DAARI DEEPAM

# దారి దీపం

మాసపత్రిక

RNI Title Code : APTEL 16175

అక్టోబరు 2022

సంపుటి 1 - సంచిక 1

పేజీలు : 44

వెల : రూ.15

తెలంగాణ సాయుధ పోరాటానికి గాంధీజీ మద్దతిచ్చారా ?

జాతీయోద్యమ మహోజ్వల వారసత్వం..

మనదేశంలో గాంధీజీ ఆదర్శాలు వేళ్ళూనుకున్నాయా?

బుద్ధుడు-గాంధీ..

బాపూజీతో భాయీ భాయీ..

నేను ముస్లిం అయితే ఏమిటి? నువ్వు హిందువైతే ఏమిటి?

గాంధీ రాముడేనా.. అయోధ్య రాముడు ?

స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనని 'దేశభక్తులు!'

ప్రగతి ఫలాలు దక్కిందెవరికి?

రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసే కుట్ర..

రాజ్యాంగ లక్ష్యాలను కాలదన్నే కార్యక్రమం

కార్పొరేట్లకు కట్టబెడుతున్నది ఎవడబ్బ సొమ్ము..!

తెలుగుజాతి సమరగీతి వీర తెలంగాణ

మార్క్సిజాన్ని విస్మరిస్తే మానవాళికి ముప్పు

గ్రాంసీ ఆలోచనలు -ఆచరణ


వర్తమానంతో నడచిన చరిత్రకారుని ఆత్మకథ

తిరోగమన శక్తులకు నాటికీ, నేటికీ సింహాస్వప్నం

# తెలంగాణ సాయుధ పోరాటం..
# వాళ్ళు సాహసికులు, వీరులు - గాంధీజీ

**మూడు దశాబ్దాలపాటు జాతీయ ఉద్యమానికి నాయకత్వం వహించిన గాంధీజీ దేశంలో చెలరేగిన మతకల్లోలాలకు హింసాత్మక ఘటనలకు నిరసనగా ప్రథమ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను (1947, ఆగస్ట్ 15) సహితం బహిష్కరించి ఢిల్లీకి దూరంగా ‘మనోవేదనతో గడిపాడు గాంధీజీ. అతి చిన్న హింసాత్మక చర్యను కూడా ఖండించే మహాత్మాగాంధీ తెలంగాణా సాయుధ పోరాటాన్ని బలపర్చాడంటే ఆ సమస్య ఎంత తీవ్రమైందో అర్థం చేసుకోవచ్చు.**

ఈయనకు హింసాత్మక ఆందోళనలు అంటే గిట్టదు. ఆయుధాలన్నా, సాయుధ పోరాటమన్నా అసలే పడదు. అహింసే తన దైవంగా, మతంగా భావించి జీవించిన మహాత్ముడు ఆసేతు హిమాచల పర్యంతం యావద్భారత ప్రజలను చైతన్యమొందిస్తున్న సహాయ నిరాకరణోద్యమాన్ని సహితం ఒక చిన్న హింసాత్మక సంఘటన మూలంగా (చౌరా చౌరీ ఘటన) మొత్తం ఉద్యమాన్నే రద్దు చేసి అహింసాత్మకమూర్తి అటువంటి అహింసావాది తెలంగాణా సాయుధ పోరాటానికి మద్దతు తెలిపాడంటే ఆశ్చర్యంగా వుంది కదూ. కాని ఇది నిజం. చరిత్ర పుటలకెక్కని పరమ సత్యం. సంస్థాన ప్రభువులపట్ల మొదటి నుంచి మెతక వైఖరి అవలంభిస్తున్న మహాత్మాగాంధీ సహితం తెలంగాణ ప్రజల నికృష్ట జీవితానికి, జరుగుతున్న అమానుషకృత్యాలకు స్పందించాడు. తెలంగాణా ప్రజా పోరాటానికి తనవంతు తోడ్పాటును అందించాడు. నిజాం రాజ్యంలో పౌర హక్కులు ఎలా వుంటాయో ఒకమారు రుచి చూసిన వ్యక్తి మహాత్మాగాంధీ. హరిజనోదరణకై దేశం మొత్తం పర్యటిస్తూ 1934 ఏప్రిల్‌లో హైదరాబాద్ సంస్థానాన్ని సందర్శించిన మహాత్మునికి నిజాం పోలీసుల తడాఖా ఏమిటో తెలిసి వచ్చింది. పర్యటనలో భాగంగా చరకమానాలో ఖాదీ బండారును ప్రారంభించేందుకు వెళుతున్న మహాత్మా గాంధీని నిజాం పోలీసులు నిరోధించారు. ఖద్దరు మొదలైతే ఎక్కడ ప్రజలు చైతన్య వంతులవుతారోనని భయపడిన నైజాం ఖాదీ బండారును మహా త్ముడు ప్రారంభించదానికి వీలులేదని ఆజ్ఞ జారీచేశాడు. ఇక నైజాం పోలీసులు ఊరుకుంటారా? వెళుతున్న మహాత్మాగాంధీ పైబడి నిలిపివేశారు. జాతిపిత మారుమాట్లాడకుండా వెనుదిరగాల్సి వచ్చింది.



1940 దశకానికి ప్రజాందోళన ఉధృత స్థాయికి చేరుకుంది. ప్రజలను ఏదో విధంగా అణచివేయాలనే ఉద్దేశంతో నిజాం పోలీసులు అమానుష కృత్యాలు చేయడానికి సహితం వెను దీయలేదు. 1946లో నిజాం పోలీసులు ఆకునూరు, మాచిరెడ్డిపల్లి గ్రామాలపైబడి దొరికిన వాడిని దొరికినట్లు చావ చితకగొట్టారు. అందిన స్త్రీని అందినట్లు మానభంగం చేశారు. ఇళ్ళను కూల్చి విలువైన వస్తువులను దోచుకున్నారు. అకారణంగా అమాయక ప్రజలను చిత్రహింసలపాలు చేశారు. నిజాం పోలీసులు చేసిన ఈ రాక్షస కృత్యానికి సంస్థాన ప్రజలంతా గగ్గోలు పెట్టారు. మహాత్మా గాంధీ వరకూ ఈ వార్త చేరుకుంది. జరిగిన అమానుష కృత్యాలను తెలుసుకున్న గాంధీ ఆకునూరు, మాచిరెడ్డిపల్లి ఘటనలపై సవివరమైన నివేదికను అందజేయాల్సిందిగా కుమారి పద్మజా నాయుడును ఆదేశించాడు. పద్మజానాయుడు ఇచ్చిన నివేదికను ఆనాటి జాతీయ పత్రికలన్నీ ప్రముఖంగా ప్రచురించాయి. ఈ ఘటనలపై మహాత్మాగాంధీ తన నిరసనను వ్యక్తంచేశారు. రానురాను నిజాం వైఖరి మరింత మొరటుతేలి తన రాక్షస వైఖరిని స్పష్టంగా బయటపెట్టాడు. 1947 నాటికి ప్రజలకు ఆయుధాలు చేపట్టడం తప్ప మరో మార్గం లేకపోయింది. గాంధీజీ హృదయ పరివర్తనా సిద్ధాంతానికి, అహింసాత్మక సత్యాగ్రహ పోరాటానికి ఎటువంటి స్థానం లేకుండాపోయింది. ప్రజలు ఆయుధాలతో పోరు ప్రారంభించారు. ఈ పరిస్థితిలో అహింసే తన ఊపిరిగా జీవించిన మహాత్మాగాంధీ స్పందించి, ప్రజలు ఆయుధాలు చేపట్టడంలో ఎటువంటి తప్పులేదని స్పష్టంగా తెలియజేశారు. భంగీ కాలనీలో నివసిస్తున్న మహాత్ముడ్ని కలవడానికి వెళ్ళిన రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు రామానందతీర్థ హైదరాబాద్ సంస్థానంలో వస్తున్న మార్పులు గురించి, ప్రజా పోరాట వెల్లువ గురించి, జరుగుతున్న సాయుధ పోరాటం గురించి గాంధీజీకి తెలియజేశాడు. ప్రజాందోళన స్థాయిని గుర్తించిన మహాత్ముడు సాయుధ పోరాటాన్ని బలపరుస్తూ తన మద్దతును ప్రకటించాడు. ‘అవును, మంచిదే. పిరికితనంతో పారిపోవడం కంటే ఆ పరిస్థితుల్లో అదే మంచిది. దౌర్జన్యమార్గం చేపట్టినప్పటికీ సాహసీకులు వీరులను నిపించుకుంటారు. వారి పరిస్థితిని అర్థంచేసుకోవచ్చు’ అని రామానందతీర్థకు మహాత్ముడు తెలియజేశారు. ఇంతే కాదు తన ఆఖరి నిమిషం వరకూ తెలంగాణా సాయుధ పోరాటాన్ని అది దౌర్జన్యమార్గంలో నడుస్తోందని కానీ, హింసాత్మకమైన ఆందోళన అని కానీ ఖండించలేదు. మూడు దశాబ్దాలపాటు జాతీయ ఉద్యమానికి నాయకత్వం వహించిన గాంధీజీ దేశంలో చెలరేగిన మతకల్లోలాలకు హింసాత్మక ఘటనలకు నిరసనగా ప్రథమ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను (1947, ఆగస్ట్ 15) సహితం బహిష్కరించి ఢిల్లీకి దూరంగా ‘మనోవేదనతో గడిపాడు గాంధీజీ. అతి చిన్న హింసాత్మక చర్యను కూడా ఖండించే మహాత్మాగాంధీ తెలంగాణా సాయుధ పోరాటాన్ని బలపర్చాడంటే ఆ సమస్య ఎంత తీవ్రమైందో అర్థంచేసుకోవచ్చు. ❑

**– పి.బాలకృష్ణ,**
**ఉదయం వీక్లీ స్పెషల్, 1987 నవంబర్ 19,**

## సంపాదకీయం



# దారి దీపం గురించి..

దారి దీపం కొత్త పత్రిక. ఇది జన్మదిన సంచిక. పత్రిక పేరు కొత్తదైనా దీనికి గత చరిత్ర వుంది. గతంలో జాతీయ స్ఫూర్తి పత్రికను నడిపిన సంపాదకవర్గమే ఈ కొత్త పత్రికను నిర్వహిస్తున్నది. పేరు మాత్రమే మారింది. పత్రిక స్వరూప స్వభావాలలో ఎలాంటి మార్పు వుండదు. మేథో సంపన్నులైన మిత్రుల రచనలు, విశ్లేషణలతో తనదైన ప్రత్యేకతను కొనసాగిస్తుంది. 2021 మేలో – సమ సమాజానికి దారి దీపం, కార్ల్ మార్క్స్ –పేరుతో ప్రత్యేక సంచికను వెలువరించాం. ఇప్పుడు దారి దీపం పత్రిక రూపం పొందింది. మార్క్స్–ఎంగెల్స్ భావజాలం ఈ పత్రికకు దిక్సూచిగా వుంటుంది.

మన దేశానికి చాలా ప్రత్యేకతలు వున్నాయి. వాటిని పట్టించుకోకపోతే వాస్తవాలకు దూరం అవుతాం. వర్తమానం అర్థం కానిదవుతుంది. మన ప్రయత్నాలు నేల విడిచిన సాములవుతాయి. మనకు శతాబ్దాల ప్రాచీన చరిత్ర వుంది. దానికి భాష్యాలు, వక్రభాష్యాలు వున్నాయి. ఎన్నో గుణపాఠాలు నేర్పే స్వాతంత్ర్యోద్యమ వారసత్వం, అందులో వివిధ పాయలు, పోరాట రూపాలు త్యాగాల చరిత్రలు వున్నాయి. సమాజంలో అమానవీయమైన అంటరానితనం, పుట్టుకతో వివక్షలున్నాయి. వీటిపై తిరుగుబాటు చేసిన యోధులున్నారు. వారు మనకందించిన తిరుగుబాటు వారసత్వం వుంది.

స్వరాజ్య స్ఫూర్తితో మనకొక రాజ్యాంగం అమలులోకి వచ్చింది. అదొక హక్కుల పత్రం,విలువల పత్రం. దాని పరిధిలో ఏర్పడిన రాజ్యాంగ వ్యవస్థలు, సంస్థలు వున్నాయి. ఈ ప్రజాస్వామ్య వారసత్వాన్ని కాపాడుకోవాలి. ప్రజాస్వామ్య విలువలను మరింతగా విస్తృతం చేసుకోవాలి. మన దేశానికి అనేక ప్రత్యేకతలు వున్నాయి. ఇది బహు భాషల దేశం. బహు ప్రాంతాలు, పలు ప్రత్యేక సంస్కృతులు గల దేశం. బహు కులాలు, మతాలు గల దేశం. ఈ బహుళత్వాన్ని అంగీకరించడం, గౌరవించడంతోనే ఏకత్వం సాధ్యమౌతుంది. ఇప్పుడు అధికారంలో వున్న బీజేపీ రాజకీయ లబ్ధి కోసం మతోన్మాదాన్ని, మెజారిటీవాదాన్ని తలకెత్తుకుంది. చరిత్రను వక్రీకరిస్తున్నది. మనుస్మృతిని ఆరాధిస్తూ రాజ్యాంగాన్ని నీరుగారుస్తోంది. ప్రజాస్వామ్యహక్కులను కాలరాస్తూ ప్రశ్నించేవారి నోరు నొక్కుతున్నది, జైళ్ళపాలు చేస్తున్నది. మైనారిటీల మీద, దళితుల మీద, మహిళలు మీద మూక దాడులను, అత్యాచారాలను, హత్యాకాండలను మౌనంగా ప్రోత్సహిస్తున్నది. మరోపక్క అంతరాలను పెంచే దోపిడీ వ్యవస్థ కోసం ప్రభుత్వ రంగ సంస్థలను, ప్రకృతి వనరులను కొందరికి దోచిపెడుతున్నది. ఇదీ నేపథ్యం.. దేశం నిండా ఎన్నో సమస్యలు.. ఎందరో బాధితులు. దారి దీపం చిన్న పత్రికైనా వారికి వేదికగా వుంటుంది. ❑

మీ అందరి తోడ్పాటును అర్థిస్తూ...

**డీవీవీఎస్ వర్మ** సంపాదకులు

**దారి దీపం సంపాదకవర్గం**

అక్టోబరు 2022

# దారి దీపం


సంపుటి : 1 - సంచిక : 1 మాసపత్రిక

డీవీవీఎస్ వర్మ
సంపాదకులు

సంపాదక వర్గం
డాక్టర్ బి.రమేష్ చంద్రబాబు
కొప్పర్తి వెంకటరమణ మూర్తి
మందలపర్తి కిషోర్
డి.సోమసుందర్

వెల : 15 రూపాయలు

## ఈ సంచికలో..



2 తెలంగాణ సాయుధ పోరాటం.. పి.బాలకృష్ణ

3 సంపాదకీయం

5 జాతీయోద్యమ మహోజ్వల వారసత్వం..
ప్రొ : వకుళాభరణం రామకృష్ణ

7 మనదేశంలో గాంధీజీ ఆదర్శాలు వేళ్ళూనుకున్నాయా?
డాక్టర్ ఎన్.భాస్కరరావు

10 బుద్ధుడు-గాంధీ
రాహుల్ సాంకృత్యాయన్,

12 బాపూజీతో భాయీ భాయీ..
ఎండీ ఉస్మాన్ ఖాన్

14 నేను ముస్లిం అయితే ఏమిటి? నువ్వు హిందువైతే ఏమిటి?
సైఫ్ అలీ గోరే సయ్యద్

15 గాంధీ రాముడేనా.. అయోధ్య రాముడు ?
కొప్పర్తి వెంకటరమణమూర్తి

17 స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనని 'దేశభక్తులు!' : ప్రొఫెసర్ దేవరాజు మహారాజు

20 ప్రగతి ఫలాలు దక్కిందెవరికి? : ఎన్.వేణుగోపాల్

22 రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసే కుట్ర.. : మల్లెపల్లి లక్ష్మయ్య

24 రాజ్యాంగ లక్ష్యాలను కాలదన్నే కార్యక్రమం..: మాడభూషి శ్రీధర్

26 సెతల్వాడ్‌కు బెయిలు.. సుప్రీం తీర్పు : కె.రామచంద్రమూర్తి

28 కార్పొరేట్లకు కట్టబెడుతున్నది ఎవడబ్బ సొమ్ము..! : ఎం.కోటేశ్వరరావు

30 తెలుగుజాతి సమరగీతి వీర తెలంగాణ - తెలకపల్లి రవి

32 మార్క్సిజాన్ని విస్మరిస్తే మానవాళికి ముప్పు : ఈపీడబ్ల్యూ సంపాదకీయం


34 గ్రాంసీ ఆలోచనలు-ఆచరణ : బోడపట్ల రవీందర్

36 వర్తమానంతో నడచిన చరిత్రకారుని ఆత్మకథ వకుళాభరణం రామకృష్ణ పుస్తక సమీక్ష.. : కొప్పర్తి వెంకటరమణమూర్తి

40 సి.రాఘవాచారి సంపాదకీయాల సంకలనం.. రెండో సంపుటి పరిచయం : మందలపర్తి కిషోర్

43 తిరోగమన శక్తులకు నాటికీ, నేటికీ సింహస్వప్నం - వీరేశలింగం : రాఘవాచారి సంపాదకీయాలు

# జాతీయోద్యమ మహోజ్జ్వల వారసత్వం



ప్రొ : వకుళాభరణం రామకృష్ణ
విశ్రాంత ఆచార్యులు, హెచ్‌సీయూ

పరాయి పాలనలో, పీడనలో కునారిల్లుతున్న భారతీయులను విముక్తం చేసి దేశానికి స్వాతంత్ర్యం సాధించిన సుదీర్ఘ జాతీయోద్యమ వారసత్వం ఏమిటి ? ఆ వారసత్వానికి 75 సంవత్సరాల తర్వాత నేడు ప్రాసంగికత ఉందా? ఆంగ్ల పాలనకు వ్యతిరేకంగా జరిగిన అనేకానేక పోరాటాల్లో తొలుత చెప్పుకోదగ్గది 1857 తిరుగుబాటు. ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామంగా ప్రసిద్ధి పొందిన ఈ తిరుగుబాటు హిందూ – ముస్లిం సమైక్య నాయకత్వంలో జరిగింది. ఆ తిరుగుబాటు విఫలమైనా, దేశ విముక్తి దిశలో వేసిన తొలి అడుగు అది. ఆ తర్వాత ప్రవేశపెట్టిన పాలనా పరమైన మార్పులు కంపెనీ పాలన రద్దు, ఆంగ్ల ప్రభుత్వ ప్రత్యక్ష పాలన. ఆంగ్ల ప్రభుత్వ విధానాలు, ప్రత్యేకించి ఆర్థికపరమైనవి, దేశాన్ని ఎలా పేదరికం పాలు చేస్తున్నాయో దాదాభాయి నౌరోజీ రచించిన Poverty and Un-British Rule as India విపులంగా వివరించింది.

***చరిత్ర నిర్మాతలు ప్రజలే అన్న విశ్వాసంతో జాతీయోద్యమం అన్ని దశల్లోనూ పెద్ద సంఖ్యలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొన్నారు. ఎనలేని త్యాగాలు చేసి స్వరాజ్యం సాధించారు. గమనించాల్సిన అంశం, అప్పట్లో సామాన్య ప్రజలు నిరక్షరాస్యులు. ప్రాంత, మత, కుల, పేద, ధనిక తారతమ్యాలు విస్మరించి వారు త్యాగబుద్ధితో చేసిన ఉమ్మడి కార్యాచరణ ఫలితమే దేశ స్వాతంత్ర్యం.***



స్వాతంత్ర్యోద్యమం సుదీర్ఘంగా సాగింది (1885 –1947). స్వాతంత్ర్యానంతర దేశాభివృద్ధి గురించిన ఆలోచనలు జాతీయోద్యమంలో భాగంగా కాంగ్రెస్ వార్షిక సభల్లో చేసిన తీర్మానాల్లో స్పష్టంగా ఉన్నాయి. స్వాతంత్ర్యానంతర దేశప్రగతి, జాతీయోద్య మ వారసత్వం నుండి వచ్చినదే! స్వతంత్ర భారతావని భవిష్యత్‌ను నిర్దేశించింది, జాతీయోద్యమ భావ జాలమే! ప్రపంచ చరిత్రలో ఒక అపూర్వ అధ్యాయంగా వర్ణించబడిన భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో ముఖ్య ఘట్టాలు చంపారన్, బార్డోలీ రైతు పోరా టాలు, సహాయ నిరాకరణోద్య మం, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా. ఇవి ప్రజా ఉద్య మాలు. లక్షల సంఖ్యలో ఆబాలగో పాలం వాటిలో పాల్గొన్నారు. నాయకులు నిర్వహించిన పాత్ర ముఖ్యమైనా, సామాన్య ప్రజా నీకమే వాటికి ప్రాణవాయువు. అందుకే, ప్రజలే ఉద్యమ నిర్మాతలు అనేది జాతీయోద్యమ వారస త్వంలో గ్రహించాల్సిన ప్రధాన అంశం. ఈ వ్యాఖ్య నాయకుల ప్రాముఖ్యాన్ని తగ్గించడానికి కాదు. వాస్తవంలో నాయకులు, ఆంగ్ల పాలనను క్షుణ్ణంగా అధ్యయనం చేసి, విశ్లేషించి, దానికను గుణంగా ఉద్యమ ఆశయాల్ని, పాటించాల్సిన ఎత్తుగడల్నీ నిర్ణ యించారు. జాతీయోద్య మం సాధించిన గొప్ప విజయం దేశ స్వాతంత్ర్యం. రాజకీయ ప్రజాస్వామ్యం, పౌరహక్కుల పరిరక్షణకు నిబద్ధత ఆ మహోన్నత పోరాటం వారసత్వాలే. ఇటీవలి కాలంలో ఈ రెండూ రాజకీయ ఒత్తిళ్లకు లోనవుతున్నా, ప్రజాఉద్యమాలు, వార్తాసాధనాలు వాటిని కాపాడుకుంటూ వస్తున్నాయి.

భారతదేశ చరిత్రను నిశితంగా పరిశీలించినప్పుడు ఆదిమ సమాజాలను మినహాయిస్తే స్వేచ్ఛా, స్వాతంత్ర్య భావాలు అరుదు. ప్రాజ్ఞ పరిపాలన (Enlightened Rule) అన్ని చారిత్రక దశల్లో పొడచూపినా, అది అంతంతమాత్రమేనన్న అభిప్రాయాన్ని బిపన్ చంద్ర లాంటి ప్రముఖ చరిత్రకారులు వెలిబుచ్చారు. ప్రజా శ్రేయస్సు అటుంచి, ప్రజాభిప్రాయానికి మన్నన, ఆదరణ, విలువ లుప్త

మైనాయి. జాతీయోద్యమం, ప్రారంభదశ నుంచి పౌరహక్కుల కోసం పోరాడుతూ వచ్చింది. పరాయి ప్రభు త్వాలకు వ్యతిరేకం గా ఉద్యమాలు స్వదేశీ (1905), సహాయ నిరాకరణ, విదేశీ వస్తుబహిష్కరణ మొదలైనవెన్నో భారతీయుల్లో స్వేచ్ఛా, స్వాతంత్ర్య భావాలను ప్రోదిచేసి పెంపొందించాయి. ఆధునికత (Modernity)ను ఆహ్వానించడం, ప్రజాస్వామిక పద్ధతులపై ఉద్యమాల్ని నిర్వహించడం జాతీయోద్యమ ప్రత్యేకతలు. ఈ వ్యాఖ్యకు మినహాయింపులు ఉండొచ్చు. వాటికి సహే తుక కారణాలు ఉండవచ్చు. దీనికి ఉదాహరణగా చరిత్రకారుడు బిపన్ చంద్ర ఒక ఉదంతాన్ని ఉటంకించాడు. సహాయనిరాకరణ ఉద్యమంపై చేసిన తీర్మానానికి అనుకూలంగా 1886, వ్యతిరేకం గా 884 ఓట్లు వచ్చాయి. ఈ తీర్మానం గాంధీ స్వయంగా ప్రవేశ పెట్టారు! ఇదే క్రమంలో పౌరహక్కుల పరిరక్షణ జాతీయోద్యమ ఎజెండాలో ఒక ప్రధాన భాగం. గాంధీ ఈ సందర్భంలో ఇలా అన్నారు. Civil liberty in the first step towards swaraj... It is the foundation of freedom... It is water of life. I have never heard of water being diluted. పౌరహక్కులను, ప్రజాస్వామిక భావాలను, పార్లమెం టరీ వ్యవస్థను నిర్ద్వంద్వంగా బలపరిచి, పదిలపరిచి, భారత రాజ్యాంగంలో పొందుపరచగలిగింది జాతీయోద్యమ వారసత్వమే!

జాతీయోద్యమం కేవలం రాజకీయ స్వాతంత్ర్యం, వ్యక్తిగత ప్రాథమిక హక్కుల కోసమే పాటుపడలేదు. పైపెచ్చు ఆర్థికాభివృద్ధి వైపు దృష్టి సారించింది. ఇంగ్లండ్ ఒకవైపు పారిశ్రామికంగా బలపడుతూ, మరో పార్శ్వంలో భారతదేశ ఆర్థిక వ్యవస్థను తన ఆర్థికాభివృద్ధికి ఉపయోగించుకుంది. దీన్నే 'సంపద తరలింపు'గా సిద్ధాంతీకరించాడు దాదాభాయి నౌరోజీ. 19వ శతాబ్ది నాటికే, వలస పాలనలోని ఆర్థిక, రాజకీయ అంశాల్ని గుర్తించి, అవి భారతదేశానికి చేస్తున్న కీడును గుర్తించి ప్రజలకు ఎరుకపర్చారు. దీంతో ఆంగ్లపాలకుల కపటత్వం భారతీయుల అభ్యున్నతి కోసమే తమ పాలన పాటుపడుతున్నదన్న బూటకం- బయల్పడింది. నిజానికి వలస పాలనలోని ఆర్థిక దోపిడీని బట్టబయలు చేసింది తొలితరం జాతీయ నాయకులే! ఆధునిక పారిశ్రామికాభివృద్ధికి జాతీయవాదులు వ్యతిరేకులు కాదు. కొందరు భావించి నట్లు యంత్ర పరిశ్రమలకు గాంధీజీ వ్యతిరేకి కాదు. ఆధునిక పరిశ్రమలు, అసంఖ్యాకంగా ఉన్న భార తీయులకు ఉద్యోగావకాశాలు తగ్గిస్తాయనీ, కుటీర పరిశ్రమలు కునారిల్లి, దేశీయులను నిరుద్యోగులుగా చేస్తాయని అప్పట్లో భావించారు. అందుకే, భారీ పరిశ్రమలను రాజ్యవ్యవస్థ ఆధ్వర్యంలో నెలకొల్పి, నిర్వహించారు. జాతీయోద్యమ ప్రధాన లక్ష్యాలలో స్వతంత్ర ఆర్థిక వ్యవస్థ ముఖ్యమైంది. విదేశీ పెట్టుబడులు దేశీయ పరిశ్రమలను దెబ్బ తీయకూడదు. అవి, భారతదేశ స్వతంత్ర ఆర్థికాభివృద్ధికి తోడ్పడ వనీ, దేశ పాలనా వ్యవస్థపై పట్టు సాధిస్తాయని భావించారు.

జాతీయోద్యమ స్వప్నం ఏమిటి? ఆ మహోన్నత ఉద్యమం భావితరాలకు అందించిన సందేశం, చూపిన దారి ఏమిటి? ఉద్యమ ఆశయాలు, కన్నకలలు భారత రాజ్యాంగంలో పొందు పరచబడ్డాయి. ఇవి చట్టపర హక్కులు. వీటితోపాటు, రాజ్యాంగంలో మరో ముఖ్య అధికరణం, రాజ్యం అనుసరింపదగ్గ ఆదేశిక సూత్రాలు. ప్రజాశ్రేయస్సు లక్ష్యంగా వాటిని అమలు చేయాలి. జాతీయోద్యమ స్వప్నం వాస్తవరూపం దాల్చుతుందా? ఈ ప్రశ్నకు సమాధానం విశాల భారతీయ సమాజం చేపట్టే కార్యాచరణపై ఆధారపడి ఉంటుంది. జాతీయోద్యమానికి ఒక దార్శనికత (Vision) ఉందా? ఉన్నది. అది పేదల సంక్షేమం, శాస్త్రీయత, పౌరహక్కుల పరిరక్షణ, చట్టం ముందు సమానత్వం, ఆర్థికంగా సమ సమాజం, రాజకీయంగా లౌకికత్వం, స్వతంత్ర విదేశాంగ విధానం-వాంఛనీయమైన, ఆచరణయోగ్యమైన ఈ దృష్టి ఉన్నందువల్లనే, జాతీయోద్యమం దీర్ఘకాలికంగా కొనసాగినా, తుదకు వలస పాలనకు స్వస్తి పలికింది.

చరిత్ర నిర్మాతలు ప్రజలే అన్న విశ్వాసంతో జాతీయోద్యమం అన్ని దశల్లోనూ పెద్ద సంఖ్యలో అన్నివర్గాల ప్రజలు పాల్గొన్నా రు. ఎనలేని త్యాగాలు చేసి స్వరాజ్యం సాధించారు. గమనించాల్సిన అంశం, అప్పట్లో సామాన్య ప్రజలు నిరక్షరాస్యులు. ప్రాంత, మత, కుల, పేద, ధనిక తారతమ్యాలు విస్మరించి వారు త్యాగ బుద్ధితో చేసిన ఉమ్మడి కార్యాచరణ ఫలితమే దేశ స్వాతంత్ర్యం. జాతిపిత గాంధీజీ పదే, పదే చెప్పినట్లు, భారతదేశం ఒక సమ్మేళన రాజ్యం. మత, కుల, ప్రాంతీయ, ధనిక, పేద విభేదాలు విస్మరించి, సమానత్వమే ప్రాతిపదికగా భావి భారతదేశాన్ని ఆవిష్కరించడమే జాతీయోద్యమ వారసత్వం. ❑

(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో..)

## గాంధీ మాటల్లో..

**నీవు చేసేది అన్యాయం, అధర్మం అయితే దానిని నేను సహించను. దానిని ప్రతిఘటించి తీరతాను. కానీ, నా ప్రతిఘటన, నా పోరాటం నీ మీద కాదు. నీలోని దుర్మార్గం మీద. దాని మీదనే నా ద్వేషం.**

**గర్వం, అవహేళన, అసహ్యత, కోపం అసహనం, కసి, కోపం, చంపడం, గాయపరచడం, భయపెట్టడం, దుర్వినియోగం చేయడం, విషం పెట్టడం, మోసం చేయడం, చెడును ప్రేరేపించడం, ముఖస్తుతి, బుద్ధి పూర్వకంగా శీలాన్ని పాడు చేయడం వంటివన్ని హింసారూపాలే..**

# మనదేశంలో గాంధీజీ ఆదర్శాలు వేళ్ళూనుకున్నాయా?



డాక్టర్ ఎన్.భాస్కరరావు
చైర్మన్, సెంటర్ ఫర్ మీడియా సర్వీసెస్

భారతదేశ స్వాతంత్రోద్యమం మహాత్మాగాంధీ నాయకత్వంలో జరిగింది. ఆ మహానాయకుడిని మనం అక్టోబర్ 2, జనవరి 30 తేదీల్లోనే కాక, ఆగస్టు 15 స్వతంత్ర దినోత్సవం, నవంబర్ 26 భారత రాజ్యాంగ చట్టం రూపుదిద్దుకున్న రోజున స్మరించుకుంటూ ఉంటాం. ఆ ప్రత్యేక దినాల్లో రాజకీయ నాయకులు, సామాజికవేత్తలు, మేధావి వర్గం, ప్రముఖ రచయితలు, టీవీ ఛానళ్ల వారు ఎంతో సందడిగా గాంధీజీకి నివాళులర్పిస్తూ ఉద్వేగభరిత ఉపన్యాసాలు ఇవ్వడం చూస్తుంటాం. ఆయన చిత్రపటానికి, విగ్రహాలకు కార్యాలయాల్లో, చౌరస్తాలో పూలమాలలు వేసి సందడి చేస్తారు.

## గాంధీజీపై పొగడ్తలు

పైగా రాజకీయ నాయకులు, సామాన్య ప్రజలతో మాట్లాడినప్పుడు గాంధీజీ నిర్భీతి, సత్యాహింసల పట్ల ఆయనకున్న నిబద్ధత గురించి ఎంతో చక్కగా వల్లె వేస్తారు. మరీ ముఖ్యంగా ఓట్లు అడగడానికి ప్రజలకు చేరువయ్యేందుకు, చేతులు జోడించి అసలైన గాంధేయవాదుల్లా నాలుగు రోజులపాటు వేషం, భాష, మాట తీరు మార్చుకునేవారు కోకొల్లలు. కానీ, ఈ దేశ ప్రజల జీవన విధానంలో, నాయకుల ప్రవర్తనలో, రాజకీయ పార్టీల కార్యకలాపాలలో, చివరకు ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజాహిత కార్యక్రమాల్లో అసలు గాంధీజీ సిద్ధాంతాలు ఏ విధంగానైనా పాటిస్తున్నామా? ప్రస్తుత సభ్య సమాజం గాంధీజీని ఏవిధంగా అనుసరిస్తున్నారనే విషయం పరిశీలిస్తే ఆశ్చర్యంగా ఉంటుంది.

## గాంధీ మార్గం

గాంధీజీ జీవితం, నడిచిన బాట గురించి జన బాహుళ్యంలోకి తీసుకు రావడానికి కారణమైనవి చాలానే ఉన్నాయి. ఉదాహరణకు గాంధీజీ ఆత్మకథ, అమెరికన్ పాత్రికేయుడు లూయిస్ ఫిషర్ రచించిన మహాత్మాగాంధీ జీవిత చరిత్ర బహుళ ప్రజాదరణ పొందాయి. నేటికీ ఎందరో దేశ విదేశ ప్రముఖులు గాంధీ ఆలోచనా స్రవంతిని గురించి, ఆయన చేపట్టిన కార్యక్రమాల ప్రగతిశీల ప్రభావంపై పుస్తకాలు, వ్యాసాలు, కవితలు వెలువరిస్తూనే ఉన్నారు. వాటిని ఎందరో చదివి ఆదరిస్తూనే ఉన్నారు. ఇక దృశ్య మాధ్యమ విషయానికి వస్తే శ్రీ రమేష్‌శర్మ 'అహింస' అనే పేరుతో నిర్మించిన డాక్యుమెంటరీ మనదేశంతోపాటు మరో ఆరు దేశాల్లో విశేషమైన ఆదరణకు నోచుకుంది. ఈ చిత్రాన్ని ఐక్యరాజ్య సమితి ప్రపంచవ్యాప్తంగా అన్నిచోట్లా ప్రదర్శించాలని సిఫార్సు చేశారు. 1982లో రిచర్డ్ ఎటిన్ బరో నిర్మించిన గాంధీ చలనచిత్రం ప్రపంచమంతటా బహుళ జనాదరణ పొందింది.

> *గాంధీజీ 'నా జీవితమే నా సందేశం' అని ప్రకటించారు. ఆ ప్రభావం మన భారతీయులపై ఏ మేరకు ఉంది? ప్రజాజీవితంలో, వ్యక్తిగతంగా మహాత్ముని సందేశాలు ఎంత అవసరం అనేది ఇవాళ మనం పునరాలోచించుకోవాలి. ప్రజాధన వినియోగం, రాజకీయ పార్టీల నిర్వహణలలో నిజాయితీ, పొదుపు ఎంత వెతికినా కనిపించడంలేదు. వ్యక్తిగత జీవనశైలిలో మార్పులు లేనిదే సంఘ సంస్కరణలు అసంభవమని గాంధీజీ అప్పుడే చెప్పారు.*

## గాంధీని అధ్యయనం చేసిన విదేశీ విద్యార్థులు

1946లో అమెరికాలో ఫిలడెల్ఫియా రాష్ట్రం మాంచెస్టర్ శివార్లలో గల 'అప్ ల్యాండ్ స్కూల్ ఆఫ్ సోషల్ చేంజ్'లో నేను విద్యార్థిగా ఉన్నప్పుడు గాంధీజీ చరిత్రను ఎంతో నిబ ద్ధతతో అధ్యయనం చేస్తున్న విదేశీయులను కళ్ళారా చూశా ను. వారు కేవలం చదవడమే కాదు, నిత్య జీవన విధానంలో గాంధీజీ ఆశయాలను అనుసరిస్తున్నారని గ్రహించాను. దురదృష్టమేమిటంటే గాంధీ పుట్టిన మనదేశంలో ఇప్పటిదాకా అలాంటి ఒక కేంద్రం గానీ, అభ్యసించే విద్యార్థులు గానీ లేకపోవడం! గాంధీజీ 'నా జీవితమే నా సందేశం' అని ప్రక టించారు. ఆ ప్రభావం మన భారతీయులపై ఏ మేరకు ఉంది ? ప్రజాజీవితంలో, వ్యక్తిగతంగా మహాత్ముని సందేశాలు ఎంత అవసరం అనేది ఇవాళ మనం పునరాలోచించు కోవాలి. ప్రజా

ధన వినియోగం, రాజకీయ పార్టీల నిర్వహణలలో నిజాయితీ, పొదుపు ఎంత వెతికినా కనిపించడంలేదు. వ్యక్తిగత జీవన శైలిలో మార్పులు లేనిదే సంఘ సంస్కరణలు అసంభవమని గాంధీజీ అప్పుడే చెప్పారు.

## గాంధీ సిద్ధాంతాలను ఆచరిస్తున్నామా?

మనం ప్రస్తుత పరిస్థితులలో ఏ కొంచెమైనా ఆచరిస్తున్నామా? అనే ప్రశ్న కీలకమైంది. ఈ మధ్య మరో కొత్త పోకడ ఏమిటంటే, గాంధీజీని హతమార్చిన గాడ్సే గొప్పవాడు అని ఒక వాదన! దీనికి జవాబుగా గాంధీజీ గురించి అనేక ప్రసంగాలు పెరిగాయి. కేవలం మాటల ద్వారా మనం గాంధేయవాదాన్ని బలపరచడం ఎంత మాత్రమూ సాధ్యం కాదు. గాంధీజీ ఆశించిన మార్పులు దేశంలో జరగలేదనే చెప్పుకోవచ్చు. భారతదేశ ఆర్థిక ఆలోచనా సరళిలో, భారతీయుల దినచర్యలో గాంధీజీ ఆశించిన మార్పు సంభవించలేదు. దీనికి కారణం గాంధేయ వాదాన్ని బహుశా మనం చిలకపలుకుల్లా మాటలకే పరిమితం చేసి, ఆచరణలో శూన్యంగా మిగిలాం.

## వ్యక్తి పూజలందుకుంటున్న నాయకులు

ఉదాహరణకు రాజకీయ పార్టీల విషయం పరిశీలిస్తే ఎటు చూసినా ఆడంబరమే తప్ప ఏ శ్రేణిలోనూ అధికార వికేంద్రీకరణ ఉండదు సరి కదా, ఒక నాయకుడే విశేషమైన వ్యక్తి పూజ పొందుతూ ఉంటారు. నిరంతరం అతని నామాన్ని జపించడం సరిపోతోంది. గాంధీజీ పారిశుద్ధ్యం, పర్యావరణ సంతులనం, సృష్టిలోని ప్రాణులన్నింటినీ గౌరవించి, వాటికి జీవించే హక్కు ఉందని గుర్తించడం వంటి విలువలను ప్రతిపాదించారు. అవన్నీ ఇవాళ విస్మరించబడ్డాయి. పారదర్శకత, ప్రశ్నించే హక్కు సమాధానం ఇవ్వవలసిన అవసరం ప్రణాళికలో భాగమై ఉండాలని, అపుడే గమ్యం చేరగలమని గాంధీజీ నమ్మారు. ఫలితం కన్నా పని చేసే పద్ధతికే ఆయన ప్రాముఖ్యత ఇచ్చేవారు.

## పెరుగుతున్న పెడధోరణులు

ఈ రోజుల్లో తలపెట్టిన ప్రతి ప్రణాళిక గురించి చర్చకు బదులుగా వృథా విశ్లేషణ, పై పెచ్చు వ్యాఖ్యల వక్రీకరణ పెరిగాయి. దీనివల్ల ఏ కార్యక్రమం ఎందుకు మొదలు పెట్టబడిందో అనే మూల కారణం ఎవరికీ గుర్తుండటం లేదు. ఎన్నో మంచి ప్రణాళికలు విమర్శల పాలై, అభివృద్ధి కుంటుపడుతోంది. నిజానికి, గాంధీజీ ప్రజాప్రయోజనాల దృష్ట్యా కొన్ని విషయాలు ప్రమాదకరమని కూడా ప్రస్తావించారు. ఇవి మనకు ఎంత వరకు గుర్తున్నాయో ఒకసారి పరిశీలిద్దాం.

1. పని చేయకుండా సంపద కూడబెట్టడం : ప్రతి వ్యక్తి శారీరకంగా, మేధోపరంగా పరిశ్రమించడం ద్వారా సంపద సేకరించాలని గాంధీజీ అంటారు. మానవుని ఆశకు హద్దుండదు. అతి తక్కువ సమయంలోనే దానవుడై పోతాడని గాంధీజీ చెప్పారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో సంపద పెరిగి ఏం ప్రయోజనం? ప్రజల్లో సంపద పట్ల అలసత్వమే ఎక్కువగా ఉంది. గత పది సంవత్సరాలలో ఎన్ని చిట్ ఫండ్ కంపెనీలు, దొల్ల వ్యాపారాలు సామాన్య ప్రజలను మోసగించి, బోర్డు తిప్పలేదు? ఎంతమంది బడాబాబులు బ్యాంకులను మోసగించి వందల కోట్ల రూపాయలను విదేశాలకు తరలించుకు పోలేదు? ఆహా! ఏం జరుగుతోంది?

2. అంతఃకరణ శుద్ధి లేకుండా సుఖాలను పొందడం : సుఖలాలసత్వం, భోగం పెరిగి, మాదక ద్రవ్యాలు, మత్తు పానీయాల వాడకంలో యువత నిర్వీర్యమై మాఫియా, హింస వైపు మళ్లింది.

3. మానవత్వాన్ని విస్మరించిన విజ్ఞానం: శాస్త్ర పరిశోధనలు పెరిగి అనేక రకాల పనిముట్లు, యంత్రాలు దినచర్యలో భాగమయ్యాక మనిషిలో బద్ధకం, అలసత్వం, స్వార్థం పెరిగాయి. అందుకే ఇతరులను మోసం చేయడం, అక్రమ సంపద కూడబెట్టడం పెరిగింది. ఇవన్నీ విజ్ఞానశాస్త్ర ఫలితాలను, మానవత్వాన్ని మంట కలపడానికే ఉపయోగపడి సంఘం తిరోగమన దిశలో ఉంది.

4 వివేకం లేని విజ్ఞానం : మంచి చెడులను బేరీజు వేసుకుని నిర్ణయాలను విచక్షణతో తీసుకోవాలి. సంయమనం లేకపోతే దుష్ఫలితాలే ఎక్కువ. ఉదాహరణకు కాలుష్యం ఎంత ఎక్కువగా ఉందంటే, ప్లాస్టిక్ వ్యర్థాలు తిన్న ఆకలిగొన్న పశువులు, రోగాల బారిన పడితే పొట్టలోంచి కేజీల కొలది ప్లాస్టిక్ తొలగించారని పత్రికల్లో చదివినప్పుడు విచారం కలుగుతుంది.

5. నిబద్ధత లేని రాజకీయాలు : రాజకీయం దేశంలో విపరీత ధోరణి లో సాగుతున్నట్లుగా కనబడుతోంది. పార్టీ ప్రముఖులు, కార్యకర్తలు, ప్రజల వద్దకు ఓట్ల కోసం వచ్చి చేస్తున్న వాగ్దానాలు అంచనాలకు మించి పోతున్నాయి. రాయితీలు, ఉచితాలు వలన సామాన్య ప్రజలను బిచ్చగాళ్లుగా తయారు చేసే ప్రమాదం ఉంది. "పేద వారిగా పుట్టడం తప్పు కాదు, పేదలు పేదలుగా మిగిలి పోకూడదు" అన్నది మంచి ఆలోచనే. కాని విదేశీ రుణాలు, అధికార దుర్వినియోగంతో ప్రజాధన వినియోగం ప్రచార ఆర్భాటంతో పారదర్శకత లోపించి ప్రజాహితం కొరవడుతోంది.

6. నీతి లేని వ్యాపారం : వ్యాపారం అంటేనే చెప్పేది ఒకటి, చేసేది మరొకటి. నాణ్యత లేకపోగా ప్రజలను మభ్య పెట్టి ఎంతసేపూ అమ్మకాలనెలా పెంచుకోవాలో అన్నదే లక్ష్యంగా వస్తు వినిమయ సంస్కృతి మార్కెట్లో ప్రబలింది.

7. త్యాగం లేని ఆరాధన : ప్రార్థనా ప్రదేశాల్లో, పండుగలు జరుపుకోవడంలో దర్పం, ఆడంబరం, ఆర్భాటం పెరిగాయి. నిశ్శబ్దం, నివేదన, భక్తి, త్యాగం కనిపించడం లేదు.

పైన వివరించిన నిషిద్ధ విషయాలు గాంధీజీ సూక్ష్మ పరిశీలన, భవిష్యద్దర్శనలకు అద్దం పడతాయి.

గాంధీజీ తన జీవిత కాలమంతా బోధించి, ఆచరించి చూపించిన సమయపాలన, ప్రకృతి పట్ల గౌరవ భావం, అవసరం–ఆశ మధ్య హద్దులు తెలుసుకొని ఉండగలగడం, ఆలోచనకు ఆచరణకు అంతరం తగ్గించడం, స్వార్థం సంఘం పట్ల వ్యక్తికి ఉండాల్సిన బాధ్యతకు నడుమనున్న సున్నితమైన వ్యత్యాసం తెలుసుకోవడం అనేవి గాంధీజీ దృష్టిలో కీలకమైన విషయాలు. భవనం ఎంత ఎత్తుకు ఎదిగినా, పునాది పటిష్టం గా ఉండాలి. కాబట్టి, గాంధీజీ ప్రతిపాదించిన ఈ వ్యక్తిగత సూత్రాలను భారతీయులు గుర్తెరిగి తమ అంతరాత్మను పరిశు భ్రంగా ఉంచుకోవాలి. పౌరులకు సామాజిక స్పృహను పెంచే కొన్ని విలువైన మార్గ నిర్దేశకాలు, గాంధేయమార్గంలో అవస రమని చెప్పడానికి నేను సాహసిస్తున్నాను. అవి సుస్థిరమైన దేశ ఆర్థికాభివృద్ధికి సోపానాలు అని నా అభిప్రాయం.

## గ్రామ స్వరాజ్యం

ప్రతి గ్రామం స్వయంసమృద్ధి కలిగి ఉండాలి. "మన దేశం గ్రామాల్లోనే జీవిస్తుంద"ని గాంధీ చెప్పారు. శతాబ్దాల క్రితం తమిళనాట చోళులు గ్రామ స్వరాజ్యానికి పెద్దపీట వేయగా అందులో వ్యవసాయాభివృద్ధి ముఖ్యమైన అంశం. క్రీస్తుశకం 5, 6 శతాబ్దాలలోనే నీటి కాల్వలు తవ్వించి, వరద నివారణ చర్యలను చేపట్టి, ఏడాదికి రెండు పంటలు పండించిన వారు ఆ చోళులు. దురదృష్టవశాత్తు గత 70 సంవత్సరాలలో గాంధీజీకి ప్రీతిపాత్రమైన గ్రామ స్వరాజ్యమనే అంశం రాజ్యాంగంలోని ఆదేశ సూత్రాలలో మాత్రమే సురక్షితంగా వుంది! కొన్ని ప్రాంతాల్లో గ్రామాలు రాజకీయ నాయకుల చేతుల్లో కీలుబొమ్మలుగా ఉన్నాయన్నది సత్యదూరం కాదు.

## అధికార వికేంద్రీకరణ

స్థానికమైన సమస్యలు, అవసరాలను అక్కడి ప్రజలు తమ కు తామే గుర్తించి, అందుకు అవసరమైన వనరులతో సత్వం మైన అభివృద్ధికి కృషి చేయడం అధికార వికేంద్రీకరణతోనే సాధ్యం. ఇలా జరిగినప్పుడే, పౌరులకు నాయకత్వ లక్షణాల లో శిక్షణ లభించి స్వయంసమృద్ధికి బాటలు పడి ఉపాధితో పాటు ఆర్థిక సంక్షేమం సాధ్యం. అప్పుడే పొరుగు ప్రాంతాలకు వలస వెళ్లవలసిన అవసరం రాకుండా ఉంటుంది. గ్రామాలు దేశ శ్రేయస్సుకు వెన్నెముకగా మారుతాయన్నది గాంధీజీ అభిప్రాయం కాగా, ఈనాడు అధికారమంతా నగరాలలో కేంద్రీకృతమై గ్రామాలు నిర్వీర్యమౌతున్నాయి.

"భారత దేశ పౌరులమైన మనం." అనే పదాలతో రాజ్యాంగ చట్టంలో పీఠిక ప్రారంభమౌతుంది. కానీ, ఈనాడు "రాజకీయ పార్టీలైన మనం" అనే స్థితి సర్వత్రా నెలకొంది. ఎన్నో పార్టీలు అవకాశవాదంతో పుట్టగొడుగుల్లా పెరిగి ఒక్కొక్కసారి మాయమైపోతున్నాయి కూడా. ప్రజాస్వామ్యం వేళ్ళూనుకోవటానికి చురుకైన పౌరులు సంఘటితంగా ఉం డటం అవసరం. మరి ఇప్పుడో? దారీతెన్నూ తోచక ప్రజలు ప్రతిపనికీ, ప్రభుత్వం పైనే ఆధారపడుతున్నారు. అవినీతి పెరిగి, ఎంతో కొంత లంచం సమర్పించకపోతే పనులేవీ జరగకపోవడం చూస్తున్నాం. ప్రజాస్వామ్య ప్రభుత్వం పౌరులు ఎన్నుకోబడిన ప్రతినిధులతో కూడిన చట్టసభల ద్వారా పని చేస్తుంది. కానీ ప్రతినిధులకు పౌరుల సంక్షేమం, శాంతి భద్రతలు, సర్వతోముఖాభివృద్ధిపట్ల సరైన అవగాహన లేదు. పార్టీ సిద్ధాంతాల చట్రంలో చిక్కుకుని, వారి దృక్కోణం ప్రజల అభీష్టాలకు, అవసరాలకూ దూరంగా ఉంటోంది. ప్రజాస్వా మ్యంలో, శాసనసభ– కార్యనిర్వాహక శాఖ– న్యాయవ్యవస్థ అనే మూడు విభాగాలు పరిపాలనను హద్దుల్లో ఉంచేలా రూపొందించారు. కానీ ఒకటో, రెండో బలమైన రాజకీయ పార్టీల కనుసన్నలలో ఈ మూడింటి కార్యాచరణ పరిమితమై పోయింది. ఇది సంక్షోభానికి దారి తీస్తుంది.

ప్రాథమికవిద్య : ప్రాథమిక విద్య విషయంలో దిశానిర్దేశం కొరవడింది. రాష్ట్రాల నడుమ అసమానతలు ఉన్నాయి. అధికార దుర్వినియోగం లేని సమర్థవంతమైన ప్రజాసేవ గాంధీజీ ఆశయం. మన వ్యవస్థలో పైసా లేనిదే బ్రతుకు దుర్లభంగా మారింది. ఇక్కడ చెప్పిన అంశాలన్నిం టినీ సింహావలోకనం చేయగా గాంధీజీ పుట్టిన దేశంలో గాంధీజీ ఆశయాలు వేళ్ళూనుకున్నాయా అనే ప్రశ్నకు సమాధానం "లేదు" అనే చెప్పుకోవాల్సి వస్తోంది. గాంధీ పేరున రోడ్లు, కాలనీలు, విగ్రహాలు నెలకొల్పి, కరెన్సీ నోట్లపై ఆయన ముఖచిత్రం ముద్రించి, ముఖ్యమైన కొన్ని రోజుల్లో ఆయనను తల్చుకుని, ఉపన్యాసాలు ఇస్తే సరిపోదు. ఈ తరంలో పిల్లలకు గాంధీజీ నిరాడంబర సేవా దృక్పథం గురించి ఏమీ తెలియదు. చివరికి వారు చదువుకునే పాఠ్యపుస్తకాల్లో సైతం గాంధీజీ వ్యక్తిగత విలువల గురించి బోధించడం లేదు. విలాసవంతమైన జీవితం, పర్యావరణ నిర్లక్ష్యం పెరిగాక, పొదుపు, వనరుల సద్వినియోగం అనేవి ఈ తరం పిల్లల ఊహకు అందని విషయమైంది. ఈ మధ్యే 'యోగా' ప్రక్రియకు ప్రాముఖ్యత పెరిగింది. దీనికి కేంద్ర ప్రభుత్వం, రాజకీయ నాయకులు సహకరించారు. ప్రజలు కూడా ఆరోగ్యవంతమైన జీవితం పై శ్రద్ధ పెడుతున్నారు. అదేవిధంగా గాంధీతత్వాన్ని అమలు చేసినప్పుడే శుభ పరిణామాలు ప్రారంభమౌతాయి. అదే గనుక జరిగితే భారత దేశం ప్రపంచానికి మార్గదర్శకమై ఆదర్శంగా నిలబడుతుంది. ఆ మంచిరోజు రావాలని ఎదురు చూస్తున్నాను. ❑

**(11 ఫిబ్రవరి 2021 నాడు ప్రైమ్ పోస్ట్‌లో ఆంగ్ల వ్యాసానికి శ్రీమతి కాళ్ళకూరి శేషమ్మ స్వేచ్ఛానువాదం.**

# బుద్ధుడు-గాంధీ



రాహుల్ సాంకృత్యాయన్,

**గాంధీజీ సమస్త మానవులకు చెందినవాడు. ఆయన జీవన పర్యంతం బహుజనుల హితం కోసం పోరాడారు. వారి శ్రేయస్సే కోరేవాడు కాబట్టి, ఈ లక్ష్యాన్ని సాధించేందుకు ఆయన బుద్ధుని కంటే కూడా ఎక్కువగా కష్టాలు సహించాల్సి వచ్చిందని అనడానికి సందేహించను. బాటసారులపై ప్రాణాంతకంగా దాడి చేస్తూ ఉండిన అంగులీమాలుణ్ణి తెలిసి తెలిసి ఆయన ఎదిరించాడు కదా ! కాని, బుద్ధుని జీవితంలో అలాంటి సందర్భాలు చాలా తక్కువగా కనిపిస్తాయి. ఇతరులను రక్షించటం కోసం మహాత్మాగాంధీ కొన్ని వందలసార్లు తన ప్రాణాన్ని పణంగా పెట్టవలసి వచ్చింది.**

1893 ఏప్రిల్ 9న ఉత్తరప్రదేశ్ ప్రాంతం అజాంఘర్ జిల్లా కనైల చక్రఫన్‌పూర్‌లో జన్మించిన రాహుల్ సాంకృత్యాయన్ తన 50 ఏళ్ల జీవితంలో 45 సంవత్సరాలు పర్యటనలలో గడిపారు. బుద్ధుని సిద్ధాంతాలతో మమేకమై తన పేరు రాహుల్‌గా మార్చుకున్న ఈ మహా పండితుడికి హిందీ, సంస్కృతం, పాళీ, భోజ్‌పురి, ఉర్దూ, పర్షియన్, మిగహి, అరబిక్, టిబెటన్, సింహళం, ఫ్రెంచి, రష్యన్, తమిళం, కన్నడం, ఇలా చాలా భాషలు తెలుసు. ఆయన రచనలు సామాజికం, చరిత్ర, తత్వం, బౌద్ధం, టిబెటాలజి, లెక్సికోగ్రఫి, వ్యాకరణం, సైన్స్, జానపద విజ్ఞానం, రాజకీయాలు ఇలా పలు అంశాల మీద వంద దాకా రచనలు రాశారు. 'ఓల్గా సే గంగా' బాగా ప్రఖ్యాతమైన రచన. 1863లో 'పద్మభూషణ్' గౌరవం పొందిన రాహుల్ సాంకృత్యాయన్ శ్రీలంక విశ్వ విద్యాలయంలో టీచింగ్ వృత్తిని స్వీకరించారు. డయాబెటిస్, రక్తపోటు, జ్ఞాపకశక్తి తగ్గడం వంటి సమస్యలతో సతమతమై 1863 ఏప్రిల్ 14న డార్జిలింగ్‌లో కన్నుమూశారు. 1942లో హజారీ భాగ్ సెంట్రల్ జైలులో రాజకీయ ఖైదిగా ఉన్నప్పుడు రాహుల్ సాంకృత్యాయన్ 'వైజ్ఞానిక భౌతికవాది' అనే హిందీ రచన చేశాడు. ఈ పుస్తకం 2015లో తెలుగులో తర్జుమా అయ్యింది. ఈ గ్రంథంలో గాంధీజీ తాత్విక దృక్పథంపై రాహుల్ సాంకృత్యాయన్ తీవ్ర విమర్శ చేశారు. అయితే స్వాతంత్రం వచ్చాక గాంధీజీ సజీవులుగా ఉన్నపుడే (1947-48 ప్రాంతంలో) 'బుద్ధుడు-గాంధీ' అనే ఆంగ్ల వ్యాసాన్ని రచించారు. గాంధీ మీదున్న ప్రతికూల ధోరణిని పూర్తిగా మార్చుకున్న వాదన ఇందులో కనబడుతుంది. గాంధీజీ మరణానంతరం ఈ ఆంగ్ల వ్యాసపు హిందీ అనువాదం 'ఆజ్‌కల్' అనే ఢిల్లీ పత్రికలో వెలువడింది. ఈ వ్యాసాన్నిగానీ, రాహుల్ సాంకృత్యాయన్ స్వీయచరిత్రలో పేర్కొన్న విషయాలను గానీ ప్రస్తావించకుంటే గాంధీ పట్ల వ్యతిరేకధోరణి వాదం ప్రబలడం ఒక ముఖ్యమైన పోకడ.

బాపట్ల నివాసులు టి.రవిచంద్ ఆధారం లేని ధోరణిని కొంతయినా మార్చాలని అన్నపురెడ్డి వెంకటేశ్వరరెడ్డి ద్వారా ఈ హిందీ వ్యాసాన్ని తెలుగులోకి అనువాదం చేయించారు. జె. ఎల్.రెడ్డి చేసిన తెలుగు అనువాదం 2005 జూలై సంచిక 'మిసిమి'లో ప్రచురితమైంది. ఈ వ్యాసం హిందీతోపాటు తెలుగు అనువాదం, రాహుల్ స్వీయచరిత్రలో గాంధీ గురించి ప్రస్తావించిన విషయాలు కలిపి టి.రవిచంద్ 2017లో మిళింద ప్రచురణలు ద్వారా 24 పుటల చిరు పుస్తకాన్ని ప్రచురించారు. గాంధీజీ గురించి రాహుల్ సాంకృత్యాయన్ 1947-48 కాలంలో రచించిన వ్యాసం తెలుగు అనువాదం ఈ మాసం 'గాంధీయే మార్గం' శీర్షికలో అందిస్తున్నాం. మరో విలువయిన రచనతో మళ్లీ తర్వాత మాసం ఈ శీర్షిక అలంకరింపబడుతుంది. మనది సుదీర్ఘ చరిత్ర గల దేశం. ఇక్కడ ఎందరో మహాపురుషులు జన్మించారు. వీరందరిలో బుద్ధుడు నిస్సందేహంగా గొప్పవాడు. ఆయనది సర్వాంగీణ వ్యక్తిత్వం, బహుముఖ ప్రజ్ఞాశాలి. ఆయన తన పరివర్తన వాదం (క్షణికవాదం)లో జగత్తూక్షణ క్షణం పరివర్తన చెందే ప్రవాహధార లాంటిదని చెప్పాడు. అనాత్మవాదం, ప్రతీత్య సముత్పాదంలో ఒక పదార్థం నశించిన తర్వాత మరొకదాని ఉత్పత్తి జరుగుతుందని చెప్పాడు. ఇలాంటి వాటిలో ప్రతి ఒక్కటి ఆయన సృజనాత్మక ఆలోచనా సరళికి ఉజ్వల ఉదాహరణ. కాని ప్రస్తుతం నేను మానవుని ఆలోచనా సరళికి ఆయన ఏ ఏ సిద్ధాంతాలు ప్రసాదించారు అనే అంశాన్ని గురించి చర్చించడం లేదు. రండి ఆయన బోధనలైన మానవత్వం, ప్రేమ,

విశ్వ బంధుత్వం, ఉదారత, వీటిపైన దృష్టి సారిద్దాం. మహాత్ముడైన బుద్ధుణ్ణి సరిగా అర్థం చేసుకోలేకపోయినవారు కొందరు ఆయన వ్యక్తివాది అయిన మహాపురుషుడని, వైయక్తిక నిర్వాణమే ఆయన లక్ష్యమని భావిస్తారు. కాని అది సత్యం కాదు. ఆయన వ్యక్తివాది కాదు. ఆయన జీవితంలోని సంఘటనను ఇందుకు ఋజువుగా చూపించవచ్చు. ఒకసారి ఆయన సవతి తల్లి ప్రజాపతి గౌతమి తను స్వయంగా వడికినేసిన గుడ్డ ఆయనకు కానుకగా ఇచ్చింది. అప్పుడు ఆయన ఇలా అన్నాడు, "ఈ గుడ్డ  బౌద్ధ సంఘానికి ఇవ్వు, దానివల్ల నీకు మరింత ఔన్నత్యం కలుగుతుంది. ఎందుచేతనంటే వ్యక్తికంటే సంఘం గొప్పది. ఉన్నతమైనదీను." ఇంతేకాక "ఇతరులను ఉద్ధరించడం కోసం ఆత్మత్యాగం చేస్తూ మీరు అసంఖ్య జన్మలెత్తవలసి ఉంటుంది" అని శిష్యులకు బోధించే ఆయన సిద్ధాంతం వ్యక్తివాదానికి చెందిన సిద్ధాంతం కాజాలదు.

ఆయన అన్ని ప్రాణుల శ్రేయస్సు కోరేవారు. "సబ్బే సత్తా భవంతు సుఖీ సత్తా." అలా అని ఆయనను నిష్క్రియాపరుడైన స్వప్నదర్శిగా భావించకూడదు. ఆయన యథార్థవాది. అందువల్ల తన శిష్యమండలిని కార్యక్షేత్రంలో దిగమని, బౌద్ధ ధర్మ ప్రచారం చేయమని ఆదేశించినప్పుడు ఆయన సమస్త ప్రాణుల శ్రేయస్సు కోసం శ్రమించమని చెప్పలేదు. బహుజనుల హితం కోసం, బహుజనుల సుఖం కోసం (బహుజన హితాయ బహుజన సుఖాయ) సంచరించండి అని చెప్పాడు. బహుజనుల హితము, బహుజనుల సుఖము ఒక్కొక్కప్పుడు కొందరి హితానికి, సుఖానికి విరుద్ధంగా ఉంటుందని ఆయనకు తెలుసు. సమాజం పరస్పర విరుద్ధమైన విభిన్న వర్గాల హితాలతో కూడి ఉంటుంది. ఆయన అభిప్రాయం ప్రకారం ఆదిమానవులు ఏ పద్ధతిలో సృష్టిలోని సంపదలను వినియోగించుకునేవారో, అదే ఆదర్శమైన పద్ధతి. ఆనాటి సమానత్వాన్ని రూపుమాపి స్వీయ సంపత్తి సేకరణకు జన్మనిచ్చిన లోభం మానవుని మౌలిక అపరాధం. దీని కారణంగా మానవ సమాజం ఇంతవరకు ఎన్నో కష్టాలు అనుభవిస్తూ వచ్చింది. మున్ముందు కూడా అనుభవిస్తూ ఉంటుంది. బుద్ధుని అభిప్రాయం ప్రకారం స్వీయ సంపత్తికి సంబంధించిన ఆ లోభం నుండే చౌర్యగుణం పుట్టింది. ఆ తర్వాత కలహాలు, హత్యలు పుట్టుకొచ్చాయి. ఈ దుర్నీతుల నుండి తప్పించు కొనేందుకే మానవుడు రాజును ఏర్పరచుకున్నాడు. మానవ సమాజంలోని జబ్బుకు వేరే మందు అతనికి దుర్లభమైంది.

బుద్ధుడు తన పద్ధతిలో భిక్షువులు, భిక్షుణిల మధ్య సామ్యవాదాన్ని నెలకొల్పడానికి ప్రయత్నం చేశాడు. కానీ, అది చాలా కాలం నిలదొక్కుకోలేక పోయింది. కారణం ఏమిటంటే రాజు, రివాజుల మద్దతు పొంది ఉన్న స్వీయ సంపత్తిని పెంచుకోవాలనే వ్యక్తిగత లోభ సముద్రంలో సామ్యవాదపు ద్వీపాన్ని నిలువరింప చేయడం సాధ్యం కాదు. ఆయన తన ఆఖరు ఉపదేశంలో ఇలా అన్నాడు. "వైరం ద్వారా వైరం శాంతించదు" (నహి వైరేణ వైరాణి శామ్యనీహ కదాచన సంస్కృతం). క్లుప్తమైన ఈ కథనంలో మనకు బుద్ధుని మూలాధారమైన కొన్ని తాత్త్విక సామాజిక ఉపదేశాలు లభిస్తాయి. ఇక బుద్ధుని తర్వాత సంపూర్ణ మానవ సమాజానికి ఇంత గొప్ప సందేశం ఇచ్చిన మహాపురుషుడు గాంధీ ఒక్కడే. ఆయన తత్త్వదర్శనంలో బుద్ధునిలో ఉన్న మౌలికత లేదు.

తాత్విక నేపథ్యం నుండి వేరుచేసి చూసినపుడు గాంధీ మహాత్ముని సత్యము, అహింస ఒక వ్యక్తిలోని వ్యామోహంగానే కనిపిస్తాయి. గాంధీజీ సమస్త మానవులకు చెందినవాడు. ఆయన జీవన పర్యంతం బహుజనుల హితం కోసం పోరాడారు. వారి శ్రేయస్సే కోరేవాడు కాబట్టి, ఈ లక్ష్యాన్ని సాధించేందుకు ఆయన బుద్ధుని కంటే కూడా ఎక్కువగా కష్టాలు సహించవలసి వచ్చింది, అని అనడానికి నేను సందేహించను. అంటే నా ఉద్దేశ్యం అలాంటి పరిస్థితుల్లో, ఆ వాతావరణంలో ఉండి ఉంటే బుద్ధుడు అలాంటి చర్యలు తీసుకోవడానికి జంకేవాడు అని చెప్పడం కాదు. బాటసారులపై ప్రాణాంతకంగా దాడిచేస్తూ ఉండిన అంగులీమాలుణ్ణి తెలిసి తెలిసి ఆయన ఎదిరించాడు కదా ! కాని, బుద్ధుని జీవితంలో అలాంటి సందర్భాలు చాలా తక్కువగా కనిపి స్తాయి. ఇతరులను రక్షించటం కోసం మహాత్మాగాంధీ కొన్ని వందలసార్లు తన ప్రాణాన్ని పణంగా పెట్టవలసి వచ్చింది. జాతి భేదాలను రూపుమాపడానికి, వేలాది ప్రజల ప్రాణాలు రక్షించడానికి గాంధీజీ దక్షిణాఫ్రికాలో తన ప్రాణాలను లెక్కచేయకుండా బోయర్లతో జరిగిన యుద్ధంలో పాల్గొన్నాడు. కలకత్తా, ఢిల్లీ, తదితరచోట్ల మత సామరస్యాన్ని స్థాపించేందుకు ఆయన చేసిన అనేక ప్రయత్నాలు ఎవరికి తెలియవు ? ఆయన నిజంగా ఒక మహాత్ముడు అనడంలో సందేహం ఉంటుందా ?

వ్యక్తిని, సంపూర్ణ సమాజాన్ని ప్రేమించే విషయంలో గాంధీజీ రెండవ తథాగతుడు. ఆయన అవైరభావం (అహింస) లో అకర్మణ్యతకు చోటు లేదు. అకర్మణ్యత దుర్బలత్వానికి, సోమరితనానికి చిహ్నం. లక్షలాది భారత వాసులను కర్మక్షేత్రంలోకి రమ్మని పిలుపునిచ్చిన ఆయన అహింస నిషేధాత్మక (Prohibitten) శక్తికాదు. తప్పనిసరిగా అది ఒక సునిశ్చితమైన, సుదృఢమైన శక్తే. ఈ విధంగా కూడా ఆయన కర్మను బోధించే గురువు. దేవుణ్ణి, అపరివర్తన శీలమైన జగత్తును స్వీకరించే తాత్త్విక దృష్టిని నమ్మిన వాడైనప్పటికీ, గాంధీజీ కార్యాచరణలో జడత్వం లేదు. ఆయన నరనరాల్లో నిండి ఉన్న బహుజనుల శ్రేయస్సు గురించిన ఆలోచన ఆయనకు తెలియకుండానే తన వ్యక్తిత్వంలో మార్పు చేసుకొనేందుకు ఆయనను మెల్లమెల్లగా సంసిద్ధుడిని చేస్తూ ఉంటుంది. ఆయన బుద్ధుని గతిశీల తత్త్వదృష్టిడిని తన లక్ష్యంగా స్వీకరించకపోవడం విచారకరమైన విషయం. **(మిగతా 19వ పేజీలో)**

# బాపూజీతో భాయీ భాయీ..



ఎండీ ఉస్మాన్ ఖాన్
**పత్రికా రచయిత**

భారతదేశానికి స్వాతంత్ర్యం సాధించడం కోసం అనేక మంది త్యాగధనులు తమ ధన, ప్రాణాలను పణంగా పెట్టారు. అందులో హిందువులూ, ముస్లిములూ ఉన్నారు. స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రలో గాంధీజీతో భుజం భుజం కలిపి నడిచిన సహచరులు అసంఖ్యాకంగా ఉన్నారు. భారతదేశం అమృత మహోత్సవాలు జరుపుకుంటున్న వేళ కొంతమంది మహాత్ముని ముస్లిం సహచరుల గురించి తెలుసుకుందాం. గాంధీజీ స్వగ్రామమైన పోర్‌బందర్‌లో అబ్దుల్లాహ్ హాజీ ఆదం జవేరీ అని ఒక ప్రఖ్యాత ముస్లిం వ్యాపారి ఉండేవారు. మెసర్స్ దాదా అబ్దుల్లా అండ్ కంపెనీ పేరుతో ఆయన దక్షిణాఫ్రికాలో వ్యాపారం నిర్వహించేవారు. ఆ వ్యాపారాలకు సంబంధించి అక్కడి న్యాయస్థానాల్లో కొన్ని వ్యాజ్యాలు నడుస్తున్నాయి. తన గ్రామస్థుడైన యువ న్యాయవాదిని పిలిపించుకుంటే బాగుంటుందని భావించిన అబ్దుల్లా దక్షిణాఫ్రికాలో తన కంపెనీ న్యాయ వ్యవహారాలు చూస్తున్న న్యాయవాదులకు సహకరించడానికి గాంధీజీని దక్షిణాఫ్రికాకు పిలిపించుకున్నారు. అప్పటి నుంచి గాంధీకి అబ్దుల్లా అన్ని విషయాల్లో సహకరిస్తూ మార్గదర్శిగా నిలిచారు. ఈ క్రమంలో దాదా అబ్దుల్లా ద్వారా దక్షిణాఫ్రికాలో భారతీయులు ఎదుర్కొంటున్న వివక్ష, ఇతర ఇబ్బందుల గురించి తెలుసుకున్నారు గాంధీజీ. స్వయంగా చూశారు. అనుభవించారు కూడా! ఈ దుర్మార్గపు వివక్షకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని ఒక నిర్ణయానికొచ్చిన అబ్దుల్లా, గాంధీజీ ఇద్దరు కలసి, 'నాటల్ ఇండియన్ కాంగ్రెస్' (ఎన్ఐసి) అనే ఒక సంస్థను ఏర్పాటుచేశారు. దీనికి అధ్యక్షులు దాదా అబ్దుల్లా, కార్యదర్శి గాంధీజీ. దక్షిణాఫ్రికాలో దాదా అబ్దుల్లా సహచర్యంలో 'ప్రజాసేవ చేయాలనే కోరిక, దానికి కావలసిన శక్తి నాకు అక్కడే లభించాయి' అని గాంధీజీ తన ఆత్మకథలో రాసుకున్నారు.

దక్షిణాఫ్రికాలో వివక్షకు వ్యతిరేకంగా పోరాడి విజయం సాధించిన తరువాత గాంధీజీ భారతదేశానికి వచ్చారు. ఆంగ్లేయులకు వ్యతిరేకంగా చంపారన్ రైతాంగ పోరాటాన్ని భుజానికెత్తుకున్నారు. దీనికోసం ఆయన ఎంచుకున్న ఆయుధం దక్షిణాఫ్రికాలో విజయం సాధించి పెట్టిన 'సత్యాగ్రహమే'. చంపారన్ రైతాంగ పోరాట నాయకులు షేక్ గులాబ్, ముహమ్మద్ మోనిస్ అన్సారీ గాంధీజీకి కుడి భుజంగా నిలిచి సహకరించారు. దక్షిణాఫ్రికాలో జాతి వివక్ష, కుల వివక్షతలకు వ్యతిరేకంగా పోరాడి విజయుడై స్వదేశానికి వచ్చిన గాంధీజీ ఇక్కడ కూడా వివక్షను ఎదుర్కోక తప్పలేదు. తొలుత పాట్నా

***'నేను ఎట్టి పరిస్థితుల్లోనూ అహింసామార్గాన్ని వీడను. పగ, ప్రతీకారం జోలికి వెళ్లను. నన్ను అణగదొక్కిన వారిని, హింసించిన వారిని కూడా క్షమిస్తాను' అన్న ప్రతిజ్ఞతో 'ఖుదాయి ఖిద్మత్ గార్' పేరిట భారత స్వాతంత్ర్య పోరాటానికి స్వచ్ఛంద సంస్థను ఏర్పాటుచేసిన శాంతి కాముకుడు ఈ సరిహద్దు గాంధీ. 1969లో గాంధీజీ శతజయంతి ఉత్సవాల్లో పాల్గొనడానికి వచ్చిన ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ పార్లమెంట్ సంయుక్త సమావేశంలో మాట్లాడుతూ, 'మీరు బుద్ధుడిని మరచిపోయినట్లుగానే గాంధీని మరచిపోతున్నారు' అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.***

లోని బాబూ రాజేంద్రప్రసాద్ (అప్పటికాయన న్యాయవాదే) ఇంట్లోకి ఆయనకు అనుమతి లేదు. ఆ సమయాన రాజేంద్ర ప్రసాద్ ఇంట్లో లేని కారణంగా, పని మనుషులు ఆయన్ని ఇంట్లోకి అనుమతించలేదు. బావిలో నీళ్ళు తోడుకొని తాగడానికి గాని, ఇంటి మరుగుదొడ్డి వాడుకోడానికి గాని ఆయనకు అనుమతి ఇవ్వలేదు. ఈ విషయాలను గాంధీజీ తన ఆత్మకథలో రాసుకోవడమే కాకుండా, కొడుకు మదన్‌లాల్ గాంధీకి కూడా ఉత్తరం ద్వారా తెలియజేశారు. బాబూజీ ఇంటి పని మనుషులు మమ్మల్ని బిచ్చగాళ్ళకంటే హీనంగా పరిగణించారని రాశారు. అప్పుడాయనకు పాట్నా గ్రామస్థుడైన తన లండన్ సహచరుడు అడ్వకేట్ మౌలానా మజ్హరుల్ హఖ్ గుర్తుకొచ్చారు. బాబూజీ ఇంట తనకెదురైన పరిస్థితిని వివరిస్తూ ఆయనకు కబురు పెట్టారు. వెంటనే మజ్హరుల్ హఖ్ ఆఘమేఘాల మీద గాంధీజీ దగ్గరికొచ్చి, ఆయనకు కావలసిన ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సంఘటనను గాంధీజీ తన ఆత్మకథలో 'చంపారన్ మచ్చ' పేరుతో రాసుకున్నారు. తరువాత ఆయన చంపారన్ చేరుకొని అక్కడి రైతుల గోసను విన్నారు. నీలిమందు సాగు చేయాలని ఆంగ్లపాలకులు తమపై

జరుపుతున్న దాడులు, దుర్మార్గాలను రైతులు గాంధీజీకి ఏక రువు పెట్టారు. చంపారన్ రైతుల్లో గాంధీజీకి ఉన్న ఆదరణ, తదనంతర పరిణామాలనూ పసిగట్టిన ఆంగ్ల అధికారి ఇర్విన్ గాంధీ అడ్డు తొలగించుకోవాలని పథకం పన్నాడు. దీనికిగాను తన ఇంట్లో వంట మనిషిగా పని చేస్తున్న బతఖ్ మియా అన్సా రీని ఎంచుకున్నాడు. పథకంలో భాగంగా గాంధీని భోజనానికి ఆహ్వానించి, ఆయనకు విషమిచ్చి చంపే బాధ్యతను అన్సారీకి అప్పగించాడు. గాంధీజీని చంపితే ఊహకు కూడా అందని బహుమతులతో సత్కరిస్తానని, పథకం విఫలమైతే నరకం చూపించి అనంత లోకాలకు పంపుతానని భయపెట్టాడు. కాని బతఖ్ మియా తన ప్రాణాలకు తెగించి బాపూజీ ప్రాణాలు రక్షించారు. ఈ విధంగా ఆంగ్లేయుల కుట్రల నుంచి బాపూజీ ప్రాణాలు కాపాడి భారత స్వాతంత్రోద్యమానికి నాయకత్వాన్ని అందించారు బతఖ్ మియా అన్సారీ. చంపారన్ రైతాంగ పోరాటంలో విజయం సాధించిన గాంధీజీ భారత జాతీయ ఉద్యమంలోకి దూకారు. భారత స్వాతంత్ర్య చరిత్రలో 'అలీ బ్రదర్స్'గా ప్రసిద్ధిగాంచిన మౌలానా ముహమ్మద్ అలీ జౌహర్, మౌలానా షౌకత్ అలీ జౌహర్, వారి కుటుంబం అండదండలు గాంధీజీకి కొండంత బలాన్నిచ్చాయి. అలీ సోదరులతో గాంధీ జీ ఎంతగా కలిసిపోయారంటే, ఆబాదీబాను బేగంకు తాను మూడో సంతానమని చెప్పుకునేవారు. ఆమెను గాంధీజీ అమ్మా అనే పిలిచేవారు. అందుకే ఆమె ప్రజలందరిచేతా అమ్మగా పిలువబడి 'బీబీ అమ్మాన్'గా ప్రసిద్ధి చెందారు. స్వాతంత్ర్యో ద్యమం కోసం గాంధీజీకి ఆమె భారీ మొత్తంలో ఆర్థిక సహా యం అందించారు. ఆమె అంతిమ సమయాన అలీ సోదరుల తోపాటు గాంధీజీ కూడా 'అమ్మ' మంచం దగ్గరే ఉన్నారు.

గాంధీజీకి ఉద్యమ అవసరాల కోసం ఆపద్బాంధవుడిలా ఆదుకున్న మరో సహచరుడు ఉమర్ సుభాని. బొంబాయిలో ఏ మీటింగు జరిగినా, ఎంత పెద్ద కార్యక్రమం జరిగినా అం దులో సగానికి సగం ఉమర్ సుభాని ఒక్కడే భరించేవారు. ఆర్థి కంగా ఆదుకోవడమే కాకుండా కార్యక్రమాలను విజయవం తం చేయడానికి అలుపెరుగని ప్రయత్నం చేసేవారు. 1921 లో 'తిలక్ స్వరాజ్య నిధి'కి విరాళాలు సేకరించే సమయాన గాంధీజీకి బ్లాంక్ చెక్కు ఇచ్చి 'ఎంత అవసరమో అంత రాసుకోండి' అన్న ఉదార గుణ సంపన్నుడు ఉమర్ సుభాని.

గాంధీజీ మరో ప్రాణ స్నేహితుడు, దక్షిణాఫ్రికా నుంచి కుటుంబంతో సహా గాంధీజీ వెంట భారతదేశానికి వచ్చేసిన మిత్రుడు ఇమాం అబ్దుల్ ఖాదిర్ బావజీర్. దక్షిణాఫ్రికాలో అత్యంత సంపన్న, విలాస జీవితాన్ని త్యాగం చేసి, గాంధీజీ సహచర్యంతో భారతదేశానికి తరలి వచ్చి, సబర్మతీ ఆశ్రమంలో సాధారణ జీవితం గడపడానికి ఇష్టపడిన త్యాగధనుడు. అంతటి గొప్ప సంపన్న, విలాస జీవితం గడిపిన ఇమాం అబ్దుల్ ఖాదిర్ ఆశ్రమంలో గ్రంథాలయ బాధ్యతలను చేపట్టారు. గాంధీజీ ఆయన్ని ప్రేమగా 'ఇమాం సాబ్' అని పిలుచుకునేవారు, సోదరునిగా పరిగణించేవారు. ఇమాం సతీమణి, ఇద్దరు కుమార్తెలు కూడా ఆశ్రమంలోని ప్రెస్‌లోనే పనిచేసేవారు. 1920 ఏప్రిల్ 2న జరిగిన అబ్దుల్ ఖాదిర్ కూతురు ఫాతిమా బేగం వివాహ వేడుకకు సంబంధించి గాంధీజీ పేరున ప్రచురితమైన ఆహ్వాన పత్రిక /శుభలేఖ భారత జాతీయోద్యమ సాహిత్య చరిత్రలో కలికితురాయిగా నిలిచిపోయింది. తను పెళ్లిపెద్దగా వ్యవహరించి జరిపిన ఈ వివాహ విశేషాలను స్వయంగా గాంధీజీ తన 'నవ జీవన్' పత్రికలో విశేషంగా ప్రచురించారు.

అహింసా మార్గంలో అడుగులు వేసి బ్రిటీష్ పాలకుల గుండెల్లో రైళ్లు పరుగెత్తించిన గాంధీజీ మరో సహచరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు, సరిహద్దు గాంధీ. 'ఆయుధం పట్టుకొని యుద్ధం చేసే పఠాన్‌కన్నా అహింసను ఆయుధంగా ధరించిన ఈ పఠాన్ చాలా ప్రమాదకారి' అని బ్రిటీష్ పాలకు లతో అనిపించుకున్న ధీరోదాత్తుడు. 'నేను ఎట్టి పరిస్థితుల్లోనూ అహింసామార్గాన్ని వీడను. పగ, ప్రతీకారం జోలికి వెళ్లను. నన్ను అణగదొక్కిన వారిని, హింసించిన వారిని కూడా క్షమిస్తాను' అన్న ప్రతిజ్ఞతో 'ఖుదాయి ఖిద్మత్ గార్' పేరిట భారత స్వాతంత్ర్య పోరాటానికి స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసిన శాంతికాముకుడు ఈ సరిహద్దు గాంధీ. 1969లో గాంధీజీ శతజయంతి ఉత్సవాల్లో పాల్గొనడానికి వచ్చిన ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ పార్లమెంట్ సంయుక్త సమావేశంలో మాట్లాడుతూ, 'మీరు బుద్ధుడిని మరచిపోయినట్లుగానే గాంధీని మరచిపోతున్నారు' అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఈయన మహాత్మాగాంధీకి అత్యంత సన్నిహితుడు. ఆంగ్ల ముష్కరులకు వ్యతిరేకంగా విప్లవశంఖం పూరించిన వీరయోధుడు. జాతి గర్వించదగ్గ గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు. 1920లో తొలిసారిగా గాంధీజీని కలుసుకున్నది మొదలు చివరివరకు ఆయనతో భుజం భుజం కలిపి నడిచారు. అహింసా మార్గాన ఖిలాఫత్ సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొన్నారు. దేశ విభజనను నిర్ద్వందంగా వ్యతిరేకించారు. పదేళ్ళకు పైగా జైలు జీవితం గడిపారు. భారతదేశానికి తొలి విద్యాశాఖ మంత్రిగా సేవలందించారు.

ఈ విధంగా అసంఖ్యాక ముస్లింలు గాంధీజీకి సన్నిహి తంగా, స్నేహంగా, ఉద్యమ భాగస్వాములుగా వెలుగొందారు. కాని నేటి మన దేశ పరిస్థితుల దృష్ట్యా సంక్షిప్తంగానైనా దేశ స్వాతంత్రోద్యమంలో ముస్లింల భాగస్వామ్యానికి సంబంధిం చిన వాస్తవాలను ప్రజలకు పరిచయం చేయడం, ముఖ్యంగా యువతరానికి తెలియజేయడం మనందరి నైతిక కర్తవ్యం. ❑

# నేను ముస్లిం అయితే ఏమిటి?
# నువ్వు హిందువైతే ఏమిటి?



సైఫ్ అలీ గోరే సయ్యద్

నేను ముస్లిం అయితే ఏమిటి ?.. నువ్వు హిందువైతే ఏమిటి?
నీ గుడి ముందు బిచ్చగాళ్ళు హిందువులే అయినా నువ్వు గుండెలకు హత్తుకోవు..
మసీదు ముందు ఫకీర్లు ముస్లిములే అయినా నేను హత్తుకోను.

నువ్వు ఎన్ని వ్రతాలు చేసుకున్నా.. నేను ఎన్ని రోజాలు పాటించినా
నువ్వు టాక్స్ ఎగ్గొట్టేందుకు ఏ సెక్షన్లు వెతుక్కుంటావో
నేను అవే సెక్షన్లు ఫాలో అవుతాను.

నీ మంత్రాలు సంస్కృతం అయినా.. నా సూరాలు అరబ్బీ అయినా
మన పిల్లల్ని ఇంగ్లీషు మీడియం మానిపించే ధైర్యం నీకు లేదు నాకూ లేదు.

నువ్వు గుడికెళ్ళే దారిలో
ఏ గుంతల రోడ్డులో ధక్కా ముక్కీలు తింటూ వెళ్తావో
నేను అదే కంకర తేలిన నాసిరకం రోడ్డులో మసీదుకు వెళ్తాను.

నీ పండగలకు ఏ వెజ్ వంటలు చేసుకోవాలన్నా
నా పండుగులకు ఏ నాన్ వెజ్ వంటలు వండుకోవాలనుకున్నా
కిరాణ కొట్టులో ధరల పట్టికలు ఇద్దరికి భయపెడుతూనే ఉంటాయి.

నువ్వు కళ్ళ మధ్య ఎంత పెద్ద బొట్టు పెట్టుకున్నా కానీ
నేను కళ్ళలో ఏ సుర్మా పూసుకున్నా కానీ
ఎవరి కళ్ళు కూడా
ఏ కల్తీని గుర్తుపట్టలేక జిందగీలు మోసపోతూనే ఉంటాయి.

నువ్వు నదులలో పుణ్య స్నానం ఆచరించాలన్నా
నేను నదుల ఒడ్డున ఏ మసీదు లో వజూ చేసుకోవాలన్నా
కలుషితమై ఎండిపోతున్న ఈ బురదనీళ్ళే మనకు దిక్కవుతుంటాయి.

నువ్వు ఏ పానకం చేసుకోవాలనుకున్నా
నేను ఏ పాయసం చేసుకోవాలనుకున్నా
ఇద్దరివి నీళ్ళ క్యాను కొనుక్కునే బతుకులై నిరీక్షిస్తుంటాయ్.

నువ్వు వాస్తు చూసి ఇల్లు కట్టుకున్నా
నేను వాస్తు లేక ఇళ్ళు కట్టుకున్నా
మన ఇంటి ముంగిట డ్రైనేజులు మన సహనాల్ని పరీక్షిస్తూనే ఉంటాయి.

పవిత్ర దేశం అని నువ్వేదో అనుకోవడం
సారే జహాసే అచ్చా అని నేను పాడుకోవడమే కానీ
స్వేచ్ఛగా ఊపిరి తీసుకోలేక
పొల్యూషన్‌కు ఇద్దరం ముక్కులు మూసుకొని తిరుగుతూనే ఉంటాం.

రోజూ గోమూత్రం తాగినందుకు నీకు ఎవడూ జీతం ఇవ్వడు
పవిత్ర జంజం నీళ్ళు తాగినందుకు నాకు ఎవడూ తనఖా ఇవ్వడు

నేను ఏ గడ్డం అరబ్ వాని వద్దకు వెళ్ళినా
ఇదే స్వర్గాదపి గరీయసి అని నువ్వు అనుకున్నా
మనం చెమట చుక్కలు చిందించనిదే మనకెవడూ బువ్వ పెట్టడు.

నువ్వే పండుగ నవరాత్రులు చేసుకున్నా
నేను ఏ పండుగ మాసాలు చేసుకున్నా
బ్లాక్ మనీ దొంగల్ని ఏ పాలకులు కూడా పూర్తిగా పట్టుకోలేదు అని ఒప్పుకుంటాము

నీ సంప్రదాయంలో పిల్ల పెళ్ళి చేసినా
నా తరీఖాలో బేటి పెళ్ళి చేసినా
మా లో మంచోడు దొరుకుతాడో లేదో అనే ఇద్దరం భయపడుతూ వెతుకుతుంటాం.

మనిద్దరికి తెలుసు
వర్షాకాలం వస్తుందంటే కాగితం పడవల ఆనందం పోయి
మన అపార్ట్మెంట్లు ఎప్పుడు మునుగుతాయో ఫికర్
నీకు ఉంది.. నాకు ఉంది

మనిద్దరికి తెలుసు.. నా గజల్ ఖవ్వాలి లాగే
నీ తియ్యని ఆలాపన ఏదో ప్రమాదంలో ఉంది .
మనమిద్దరి గొంతుల్ని ఏదో రాజకీయం కబ్జా చేసేస్తుంది.

మనిద్దరికి తెలుసు.. నేను ముస్లిం అయితే ఏమిటి ?
నువ్వు హిందువు అయితే ఏమిటి?
మేం ఇద్దరం ఒప్పుకునే నిజం మాత్రం ఒకటున్నది
నువ్వు అమెరికా పోయినా.. నేను ఏ అరబ్‌కు వెళ్ళినా
మనమంత భారతీయులం.. హిందు ముస్లిం భాయి భాయిలం.
కావునా రాజకీయ నాయకుల ప్రయోజనాల కోసం మనం ఒకరినొకరు దూషించుకోవద్దు. ❑

# గాంధీ రాముడేనా.. అయోధ్య రాముడు ?



కొప్పర్తి వెంకటరమణమూర్తి
**ప్రముఖ కవి, చరిత్ర పరిశోధకులు**

**మతానికి కేంద్ర బిందువైన దేవుడు, ఉన్నాడా లేడా అనే మౌలిక ప్రశ్నను నిగ్గుదేల్చడం అటుంచి ప్రజలు దేవుడనే భావనను విశ్వసి స్తారనే వాస్తవాన్ని గుర్తించడం చాలా ముఖ్యం. దాన్ని విస్మరించి చేసే కసరత్తంతా నేల విడచి చేసేదే ! కాబట్టి మతానికి ఇస్తున్న వక్రీకరణకు విరుగుడు నివ్వాలి. 'బిజెపి నా హిందు మతాన్ని అవమానిస్తోంది' అంటున్నాడు జెయన్‌యు సోషియాలజీ ప్రొఫెసర్, గాంధియన్ అవిజిత్ పాథక్ తన ఏప్రిల్ 07,2019 నాటి ది వైర్ లో రాసిన వ్యాసంలో.**

రామజన్మభూమి వివాదం ముగిసి అయోధ్యలో రామా లయ నిర్మాణం ప్రారంభమైన నేపథ్యం లో 'హే రాం' అంటూ జీవితం చాలించిన (అది నిజం కాకపోతే కనీసం ఆ మాటను ఉచ్చరిస్తూ జీవితాన్ని ముగించాలనుకున్న) మహాత్మాగాంధీ నూటయాభయ్యవ జయంత్యుత్సవాల ముగింపులోకి వచ్చాం. ఇప్పుడు ఎదురౌతున్న ప్రశ్న అయోధ్యలో కొలువు కానున్న రాముడూ గాంధీ ఉచ్చరించిన రాముడూ ఒక్కరేనా అన్నది. ఎప్పుడూ ఏ ఆలయాన్ని సందర్శించడానికి ఉత్సుకత చూపని గాంధీ తన ఇష్టదైవం రాముడు జన్మించాడని చెబుతున్న చోట నిర్మితమౌతున్న ఈ ఆలయానికైనా వచ్చేవాడా అన్నది మరో ఊహాత్మక ప్రశ్న. గాంధీకి బ్రిటీష్ సామ్రాజ్యం రావణ రాజ్యం. రాముడు సత్యానికి ప్రతీక. బ్రిటీష్ రాజ్యంలో నివాసం వన వాసం. రావణ రాజ్యానికి ప్రత్యామ్నాయం రామరాజ్యం. అదే స్వపరిపాలన. రామరాజ్యం అంటే హిందు రాజ్యం కాదు. భగవంతుని రాజ్యం. రాజుకూ పేదకూ సమాన హక్కులుండే రాజ్యం. రాముడూ రహీము ఒక్కరే. సత్యమే భగవంతుడు. ఇవన్నీ వేర్వేరు సందర్భాల్లో రాముడి గురించి వ్యక్తమైన గాంధీ అభిప్రాయాలు.

రాజకీయ నాయకుల్లో మతాన్నీ భగవంతుణ్ణీ గాంధీ అర్థం చేసుకున్నంత ఆధునికంగా మరొకరు అర్థం చేసుకున్నట్లు కనిపించదు. మతాన్ని గాఢంగా విశ్వసించిన ఆయన మత ప్రమేయం లేని లౌకిక రాజ్యాన్ని కోరుకోవడంలో అది స్పష్ట మౌతుంది. తన మతం పట్ల విశ్వాసమూ ఇతర మతాల పట్లా హేతువూ ప్రదర్శించడం వల్ల ఇది సాధ్యమైందనుకోవచ్చు. మతం ప్రాతిపదికగా జరుగుతున్న దేశవిభజనను వ్యతిరేకిం చిన ఆయన మతాంతీకరణ పొందిన ఒక సమూహం మాతృ సమూహం నుంచి వేరుపడి స్వతంత్ర్య దేశం కావాలని కోరుకోవడం చరిత్రలో ఎక్కడా లేదంటూ, మతం మారితే మనస్తత్వాలు మారతాయా అని ప్రశ్నించాడు. ఇతర మతాల్ని అధ్యయనం చేయడం, అభిమానించడం స్వమతాన్ని బలహీన పరచడం కాదనీ అది విస్తృతపరచుకోవడమేననీ అంటూ, తన ప్రయత్నమంతా ప్రతీ మతస్థుణ్ణీ తన మతాన్ని మరింత అను ష్ఠానంతో అనుసరించేటట్టు చెయ్యడమేనని అన్నాడు. మతాన్ని అర్థం చేసుకోవడంలో ఒక లౌకికత్వం ఉండాలి. మతం విశ్వా సం మీద ఆధారపడి నిర్మితమౌతుంది. ఆధారాల్లేనిదీ రుజు వుల్లేనిదీ విశ్వాసం. చెరసాలలో జన్మించిన కృష్ణుణ్ణి బుట్టలో పెట్టుకుని అర్ధరాత్రి బయల్దేరిన వసుదేవుడికి యమున నది దారి ఇచ్చిందంటే ఎట్లా ఇస్తుందని ప్రశ్నించకుం డా అంగీ కరించడమే విశ్వాసం. ఇజ్రాలేయులను ఈజిప్టుకు నడిపించిన మోజెస్‌కు ఎర్రసముద్రం దారి ఇవ్వడమూ అలాంటిదే. ఇందులో ఒకటి నిజం కావడమూ, మరొకటి కాకపోవడమూ ఉండదు. ఒకటి విశ్వసించిన వ్యక్తి రెండవ దాన్ని విశ్వసిస్తేనే అతను ఒక మతస్థుడౌతాడు. అంటే ఒక మతస్థుడు వేరొక మత అస్తిత్వాన్ని కూడా విశ్వసిస్తేనే స్వమ తస్థుడౌతాడన్న మాట. ఈ అంశాన్ని గాంధీ బాగా గుర్తించినట్టు కనిపిస్తుంది. హేతుబద్ధం కానివి మార్పుకు లొంగవు. వేరొకరి జోక్యాన్ని సహించవు. అందువల్ల మానసిక ఆవరణను దాటి రాజకీయ ఆర్థిక ఆవరణలోకి వచ్చే అర్హత వాటికి ఉండదు. ఇక్కడే మతం రాజకీయం అనే రెండిటి మధ్య గాంధీ రేఖ గీయ గలిగాడు. మొదటిది వ్యక్తిగతమూ మానసికమూ అనీ, రెండవది సామూ హికమూ సామాజికమూ అనీ గుర్తించాడు.

ప్రాచీనయుగంలో అశోకుడు, మధ్యయుగంలో అక్బర్, ఆధునికయుగంలో గాంధీలు రాజకీయవేత్తలుగా మతాన్ని సరిగా అర్థం చేసుకున్నారనిపిస్తుంది. కీపూ మూడవ శతాబ్దికి చెందిన అశోకుడు బౌద్ధం స్వీకరించి కూడా స్వధర్మంతోపాటు అజవికుల్నీ, శ్రమణుల్నీ, బ్రాహ్మణుల్నీ ప్రేమపూర్వకంగా ఆదరించాడు. వారికి దానాలు చేశాడు. బౌద్ధానికి వ్యక్తిగతంగా మరిన్ని ఉదాత్త గుణాల్ని అన్వయించాడు. ఈ క్రమంలో

బౌద్ధానికి కొనసాగింపుగా 'అశోక ధమ్మం' అనే నూతన ధర్మం రూపొందింది. ఇది చరిత్రలో తొలిసారి రాజకీయంగా ఏకీకృత మైన భారతదేశాన్ని ఆత్మికంగా ఒకటి చేసి ఉంచింది. మధ్య యుగాల్లో అక్బర్ చక్రవర్తి, పాలకుడు అల్పసంఖ్యాక వర్గ మతమైన ఇస్లాంకీ పాలితులు అధికసంఖ్యాక వర్గ మతమైన హైందవానికీ చెందినప్పుడు పాలితుల అమోదం పొందడానికి చాలా పనులే చెశాడు. హిందు భార్య సంతానానికే వారసత్వ హక్కునిచ్చాడు. గడ్డం తీసివేసి, జంధ్యం ధరించి, తలపాగ చుట్టాడు. అగ్నిపూజ చేశాడు. అన్ని మతాల సారంతో నూతన మతస్థాపన చేసి చక్రవర్తి ఉండీ దాన్ని స్వీకరించమని ఎవ్వరినీ ఒత్తిడి చెయ్యలేకపోయాడు. ఫలితంగా అది విఫలమైంది. అయితే ఆ వైఫల్యంలో గొప్ప సాఫల్యాన్ని చూడొచ్చు మనం. స్వధర్మాన్ని వీడకుండానే అశోకుడు, అక్బర్‌లు వివిధ ధర్మాల ను కలిపి ఉంచడం – హిందు మతం, ఇస్లాం వేర్వేరు మతా లైనా హిందువులు ముస్లిములు వేర్వేరు దేశస్థులు కానక్కర్లేదనే గాంధీ ఆలోచనలోనూ ప్రతిఫలించింది.

ఒక మతాన్ని అనుసరించే వాళ్లందరూ తమకు ఒకే రాజ కీయ ఆర్థిక సామాజిక ప్రయోజనాలున్నాయని భావిస్తారు. మతతత్వానికి ఇదే పునాది. ఆ మతాన్ని అనుసరించడం ద్వారా ఆ ప్రయోజనాలను కాపాడుకోగలమని అనుకుంటా రు. అంతేకాదు, ఆ ప్రయోజనాలు వేరొక మతం వారి ప్రయో జనాలకంటే భిన్నమైనవిగా కూడా భావిస్తారు. ఇంకా ముందు కు పోయి అవి పరస్పర వ్యతిరేకమైనవిగా సంఘర్షించేవిగా నిర్ణయించుకుంటారు. ఇదీ మతతత్వ రాజకీయాల మీద విస్తృత పరిశోధన చేసిన ప్రొ. బిపన్‌చంద్ర విశ్లేషణ. రాజ్యాం గం ద్వారా పొందవలసిన ప్రాథమిక హక్కులు, పౌర స్వేచ్ఛ, ఆర్థిక ప్రగతి, సంక్షేమం వంటివి ఏ మతస్థులకైన ఒకే విధంగా అవసరమౌతాయి. రాజ్యం ప్రధాన బాధ్యత వాటి పరికల్పన, పరిరక్షణ. మతాన్ని బట్టి వీటిల్లో కొన్నింటికి మినహాయింపు ఉండదు. మత పరంగా పొందే ఏ ప్రత్యేక ప్రయోజనమూ ఈ అవసరాల్లో ఏ ఒక్కదానికీ ప్రత్యామ్నాయం కాజాలవు. అందు వల్ల మతం పేరిట అధికారంలోకి రావడం భావోద్వేగ పర్యవ సానమే అవుతుంది కానీ ఆలోచనాత్మకం కాదు. మతం లక్ష్యం రాజ్యం కానప్పుడు మతాన్ని వక్రీకరిస్తేకాని రాజ్యం చేజిక్కదు. ఫలితంగా మతమూ రాజ్యమూ రెండూ తప్పుదారి పడతాయి.


మతానికి కేంద్ర బిందువైన దేవుడు, ఉన్నాడా లేడా అనే మౌలిక ప్రశ్నను నిగ్గుదేల్చడం అటుంచి ప్రజలు దేవుడనే భావనను విశ్వసిస్తారనే వాస్తవాన్ని గుర్తించడం చాలా ముఖ్యం. దాన్ని విస్మరించి చేసే కసరత్తంతా నేల విడచి చేసేదే ! కాబట్టి మతానికి ఇస్తున్న వక్రీకరణకు విరుగుడు నివ్వాలి. 'బిజెపి నా హిందు మతాన్ని అవమానిస్తోంది' అంటున్నాడు జెయన్‌యు సోషియాలజీ ప్రొఫెసర్, గాంధియన్ అవిజిత్ పాథక్ తన ఏప్రిల్ 07,2019 నాటి ది వైర్ లో రాసిన వ్యాసం లో. ఆయన ఇలా అంటున్నారు : ఆధ్యాత్మికంగా సంపద్వం తమైన సాగే గుణం ఉన్న హైందవానికి బిజెపి ఒక ప్రతి వాదం(anti-thesis) అని చెప్పడానికి నేనే మాత్రం సందే హించను. అది హిందు మతాన్ని ద్వేషఖడ్గంగా దిగజార్చింది. దాని ఆధ్యాత్మిక దివ్యానుభవాన్ని చంపేసింది. మూకతత్వాన్ని ప్రేరేపించింది. ఆంతరిక అన్వేషణ లోని కవితాత్మ స్థానం లో 'శత్రువు'తో యుద్ధం వంటి పశుభావనల్ని ప్రవేశపెట్టింది.. అని అంటూ విదేశీ ముస్లిం దాడుల గురించీ, కాశ్మీరీ ఉగ్ర వాదుల గురించీ, అనైతిక కమ్యూనిస్టుల గురించీ, గాంధేయ పిరికి పందలగురించీ ఎంతకాలం వింటాం ? ఎంతకాలం ఇతరుల్ని ద్వేషించుకుంటూ మన మతాన్ని నిలబెట్టుకుంటాం ? అని ప్రశ్నించారు పాథక్

రాష్ట్రంలో ఒక చోట దేవుడి రథం తగలబడిపోతే, మరో చోట అమ్మవారి గుళ్లో వెండి సింహ ప్రతిమల్ని ఎవరో ఎత్తుకె ళ్లిపోతే ఇటువంటివే మిత్రపక్షం పాలనలో జరిగినపుడు యా దృచ్ఛిక ఘటనలుగా భావించి వదిలేసి, ఇప్పుడు జరిగితే వాట న్నిటినీ ఇప్పటి ముఖ్యమంత్రి మత విశ్వాసాలకు ముడిపెట్టి చేస్తున్న రాద్ధాంతమూ, రాజకీయమూ రాజ్యాంగ లౌకిక విలు వల పతనానికి పరాకాష్ఠ. మతాన్ని ఆత్మిక ధార్మిక ప్రయోజ నాలకు ఉపయోగించుకోవడం మతత్వం (religiosity). మతాన్ని రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవడం మతతత్వం (communalism). మతతత్వ రాజకీయాల్ని అనుసరిం చడం మతాన్ని అనుసరించడం కాదు. ఈ మౌలిక స్పృహ లేకలోతే ఉభయ భ్రష్టత్వం తప్పదు.

ఈ నేపథ్యంలో చూస్తే గాంధీ రాముడు బిజెపి రాముడు ఒకరు కాదనిపిస్తోంది. అనేక రామాయణాలున్నట్టు అనేక మంది రాముళ్లు ఉన్నట్టున్నారు. గాంధీ రాముడు నిషాదుడైన గుహుణ్ణి హత్తుకున్న రాముడు. శబరి ఎంగిలి తిన్న రాముడు. వానరులతో స్నేహం చేసిన రాముడు. జన్మతహ రాక్షసుడైన విభీషణుణ్ణి ఆదరించిన రాముడు. గాంధీ రాముడు సత్య సాధకుడు. అయితే మహోగ్రదగ్రుడై అస్త్రశస్త్రాలు ధరించి యుద్ధానికి సంసిద్ధుడౌతున్న రాముణ్ణీ, పులిని తలపించే ముఖంతో ఉన్న క్రోధుడైన ఆంజనేయుణ్ణీ పోస్టర్ల మీద చూసినపుడు వీళ్లిద్దరూ ఇప్పుడు దేశంలో ఎవరి మీద యుద్ధం ప్రకటిస్తున్నారు అనిపిస్తుంది. బ్రిటీష్ వాళ్లు వెళ్లిపోయిన తర్వాత కూడా కాషాయ రాముడు దేశంలో అంతమొందించ వలసిన మిగిలిన రాక్షసులు ఎవరు ? అసలు అప్పటి రాక్షసు లు ఇప్పుడు ఎవరు ? మధ్యలో రాక్షసులైన వాళ్లెవరు ? దేవతలకు రాక్షసులకు యుద్ధం ఇంకా జరుగుతూనే ఉందా ? రాముడు శంభుక వధను కొనసాగిస్తాడా ? వర్తమానం ఎదుట భవిష్యత్తు నిలబడినట్లు మన ముందు ఈ ప్రశ్నలు నిలబడి ఉన్నాయి. ❑

(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో..)

# స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనని 'దేశభక్తులు!'



ప్రొఫెసర్ దేవరాజు మహారాజు
బయాలజీ ప్రొఫెసర్,
కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత

**అబద్ధాల కోరులు, ఆర్థిక నేరగాళ్లు, తీవ్రవాదులు, దేశద్రోహులు అంతా కలిసి తమను తాము దేశభక్తులుగా ప్రకటించుకుంటూ ఉంటే అసహ్యంగానూ వికారంగానూ ఉంది. పైగా వాళ్ళే దేశభక్తులనేది నిర్ణయించి చెప్పడం వికృతాలలో కెల్లా వికృతం! అసలు వీళ్లు దేశభక్తి అనే పదానికి అర్థమే మార్చేశారు. అందువల్ల ఇలాంటి వారిని అన్ని రకాలుగా ఎదుర్కోవడం, వారి కుట్రలను ఛేధించటం.. ఈ దేశ ప్రజల తక్షణ కర్తవ్యం! వారిని సమాయత్తం చేసే బాధ్యత మేధావులది.**

దేశం కోసం ప్రాణాలర్పించిన త్యాగధనులు భగత్‌సింగ్, సచ్చీంద్రనాథ్ సన్యాల్, చంద్రశేఖర ఆజాద్, సుఖ్‌దేవ్ థాపర్ లు. వీరంతా కలిసి, నాటి బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడటానికి 1928లో న్యూఢిల్లీలోని ఫిరోజ్‌షా కోట్లలో ఒక విప్లవ సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. దాని పేరు హిందూ స్థాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్(హెచ్ఎస్ఆర్ఏ) దీన్నే హిందూస్థాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ ఆర్మీ–అని కూడా వ్యవహరించేవారు. నాటి యువకులంతా ఎక్కువ సంఖ్యలో ఆకర్షింపబడి ఇందులో భాగస్వాములయ్యేవారు. అలా సభ్యుడయినవాడే కేశవ్ బలిరామ్ హెడ్గేవర్. తిన్నింటి వాసాలు లెక్కపెట్టే మనస్తత్వమున్న హెడ్గేవర్ త్వరలోనే తన బుద్ధి బయట పెట్టుకున్నాడు. తన ఉన్న హెచ్ఎస్ఆర్ఏ వివరాలన్నీ రహస్యంగా బ్రిటిష్ అధికారులకు చేరవేయడం ప్రారంభించి బ్రిటిష్ గూఢచారిగా మారిపోయాడు. నాటి బ్రిటిష్ వారి ప్రోద్భలంతో 27 సెప్టెంబర్ 1925న రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్)ను స్థాపించాడు. ఇది నాటి బ్రిటిష్ పాలకులకు అనుకూలంగా పనిచేయడానికి ఏర్పడిన సంఘం. హిందూత్వను బలపరచడం దాని ధ్యేయం. హెచ్ఎస్ఆర్ఏకు పూర్తి వ్యతిరేకం!

బ్రిటిష్‌కు వ్యతిరేకంగా ఎవరూ ఏ విధమైన ఉద్యమాలు చేయకుండా అరికట్టడం ఆనాటి ఆర్ఎస్ఎస్ విధి. అందువల్ల నాటి స్వాతంత్ర్యోద్యమాన్ని దొంగదెబ్బ తీసినవాడు కేశవ్ బలరామ్ హెడ్గేవర్. దొంగే దొంగా.. దొంగా.. అని గగ్గోలు పెట్టినట్టు ఆ నాటి నుంచి ఈనాటి వరకు ఇలాంటి దేశద్రోహులే తమని తాము దేశభక్తులుగా ప్రకటించుకుంటున్నారు. పైగా మిగతా వారెవరూ దేశభక్తులు కారని, అది తమకు మాత్రమే చెందిన పేటెంట్ హక్కయినట్టు వ్యవహరిస్తున్నారు. 1925 ఆగస్టు 9న జరిగిన 'కకొరి రైలు దోపిడీ'కి సంబంధించిన విచారణలో హెడ్గేవర్ బ్రిటిష్ వారికి పూర్తి సహకారం అందించాడు. రామ్‌ప్రసాద్ బిస్మిల్, ఠాకూర్ రోషన్‌సింగ్, రాజేంద్రనాథ్ లహరి, అశ్ఫఖుల్లా ఖాన్‌లకు 19 డిసెంబర్ 1927న మరణశిక్షలు పడడానికి కారణమయ్యాడు. మరో 16 మందికి దీర్ఘకాలిక జైలు శిక్షలు, మరో 40 మందికి వివిధ శిక్షలు పడటానికి కారణమయ్యాడు. ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వానికి ఊడిగం చేసిన ఈ ఆర్ఎస్ఎస్ దేశభక్తులు నేడు దేశభక్తి మీద భాషణలిస్తున్నారు. హిందూస్థాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్ ప్రకటించిన మ్యానిఫెస్టో 'ద రెవల్యూషనరీ' కకోరి కుట్రకేసులో బ్రిటిష్ వారికి ఒక సాక్ష్యమైంది. మరణశిక్షను అనుభవించిన బిస్మిల్, అశ్ఫఖుల్లాలు విప్లవకవులు. వీరి రచనల్ని భగత్‌సింగ్ అభిమానించేవాడు.

స్వాతంత్ర్య సమరంలోకి దూకి తమ ప్రాణాల్ని సైతం అర్పించడానికి సిద్ధపడ్డ భారతీయ యువకుల్ని అదుపు చేయడానికి, వారి ధ్యేయాన్ని, గమ్యాన్ని మార్చడానికి హెడ్గేవర్ అనే ఆ 'దేశభక్తుడు' చాలా శ్రమించాడు. అహింసా సిద్ధాంతంతో బ్రిటిష్ తుపాకి తూటాలకు సైతం భయపడక ఎదురొడ్డి నిలబడ్డ దేశ ప్రజల మనోధైర్యం ముందు హెడ్గేవర్ ఆర్ఎస్ఎస్ కుట్రలు పనికి రాలేదు. స్వాతంత్ర్యం ప్రకటింపబడింది. మూడు రంగుల జెండాను జాతీయ పతాకంగా స్వీకరించడం జరిగింది. విధిలేక మొదటి సంవత్సరం జాతీయ జెండాను ఎగరేసిన ఆర్ఎస్ఎస్ చీఫ్ హెడ్గేవర్, మరుసటి సంవత్సరం నుంచి దాన్ని పూర్తిగా వ్యతిరేకించడం ప్రారంభించాడు. ఆర్ఎస్ఎస్ అధికారిక పత్రిక 'ఆర్గనైజర్' 14 ఆగస్టు 1947 సంచికలో ఈ విధంగా ప్రకటించుకున్నారు.

'ఏదో అదృష్టం కలిసొచ్చి స్వాతంత్ర్యం సాధించుకున్న వీరికి మరో ముఖ్యమైన విషయమేదీ కనబడలేదు. ఓ మూడు రంగుల జెండాను జాతీయ జెండాగా ఆమోదించుకున్నారు. ఆ జెండాను హిందువులు ఎన్నటికీ గౌరవించరు. మూడు అనే సంఖ్య చాలా అశుభమైంది. జాతీయ పతాకంలో ఉన్న మూడు రంగులు దేశ ప్రజల మానసిక స్థితి మీద తీవ్రమైన వ్యతిరేక ప్రభావం చూపగలదు. ఫలితంగా దేశ భవిష్యత్తు దుర్భరంగా ఉంటుంది" అని! త్రివర్ణ పతాకంతో భారతదేశం ఎప్పుడూ ఎక్కడా కష్టాలు

ఎదుర్కోలేదు. స్వతంత్ర దేశంగా గర్వంగానే నిలబడింది. కష్టాలంటే అది ఆర్ఎస్ఎస్ – బీజేపీల అనాలోచిత నిర్ణయాల వల్ల వచ్చినవే. వస్తున్నవే. జాతీయ జెండాపై ఆర్ఎస్ఎస్ అభిప్రాయం ఆ విధంగా ఉంది. కాబట్టే, ప్రధాని మోడీ ఒక యోగాడే సందర్భంగా జాతీయ జెండాతో చెమట తుడుచుకుని దేశాన్ని, దేశ ప్రజల మనోభావాల్నీ అవమానపరిచారు. ఎంతైనా ఆయన ఆర్ఎస్ఎస్ కార్యకర్త కదా? కేశవ్ బలిరామ్ హెడ్గేవర్ తర్వాత మాధవ్ సదాశివ్(ఎమ్మెస్) గోల్వాల్కర్ సంఘ్ చాలక్ బాధ్యతలు (1940) తీసుకున్నాడు. ఈయన హెడ్గేవర్ కన్నా మరో అడుగు ముందుకేశాడు. బ్రిటిష్ ప్రభుత్వం అడుగులకు మడుగు లొత్తడంతోపాటు, దేశ ప్రజల మనసుల్లో విషబీజాలు నాటాడు. దేశంలో అత్యధికులు హిందువులు కాబట్టి, వారిని ఏకం చేయడం కోసం అల్పసంఖ్యాకులు పట్ల ద్వేషభావం వ్యాప్తి చేశాడు. బ్రిటిష్ ప్రభుత్వాన్ని వ్యతిరేకించడం దేశభక్తి కాదని, హిందూమతాన్ని, సంస్కృతిని పరిరక్షించుకోవడమే దేశభక్తి – అని నూరిపోశాడు. దేశమంతా క్విట్ ఇండియా ఉద్యమం ఉధృతంగా సాగుతూ ఉంటే.. అందులో పాల్గొనగూడదని తన సంఘ్ పరివార్ సభ్యుల కు గోల్వాల్కర్ పిలుపునిచ్చాడు. అది కొంత వరకు పనిచేసింది. ఫలితంగా 1942లో బ్రిటిష్ వ్యతిరేక తిరుగుబాటును అణచి వేయడంలో రాష్ట్రీయ స్వయం సేవకులు అందించిన తోడ్పాటు చాలా గొప్పది" అని నాటి బ్రిటిష్ ప్రభుత్వం బొంబాయిలో ఆర్ ఎస్ఎస్‌కు ఒక ప్రశంసాపత్రం అందించింది. ఇవి చరిత్రలోని వాస్తవాలు. పుస్తకాలు చదివినా, ఇంటర్నెట్‌లో వెతికినా ఈ విష యాలన్నీ దొరుకుతాయి. ప్రస్తుత పరిస్థితుల్లో కూడా ఆర్ఎస్ఎస్– బీజేపీ ఆ మూలసూత్రాలతోనే పనిచేయడం మనం చూస్తున్నాం. ఆర్ఎస్ఎస్ చరిత్రను గ్రంథస్థం చేసిన సి.పి.భిషకర్ పుస్తకం చదివినా ఈ విషయాలన్నీ తెలుస్తాయి. అడోల్ఫ్ హిట్లర్, బెనిటో ముస్సోలినీల భావజాలాన్ని సంఘ్ పరివార్ ప్రముఖులు ఇష్టపడే వారని తెలియజేసింది ఆయనే.

గాంధీజీ హత్య నేపథ్యంలో 4 ఫిబ్రవరి 1948న ఆర్ఎస్ఎస్ రెండోసారి నిషేధానికి గురయ్యింది. అప్పుడు 'భారత రాజ్యాంగా నికి విధేయులమై ఉంటామనీ, జాతీయ పతాకాన్ని గౌరవిస్తామని, ప్రతిజ్ఞ చేసి, గోల్వాల్కర్ నేతృత్వంలో 11 ఏప్రిల్ 1949న నిషే ధాన్ని ఎత్తివేయాల్సిందిగా అభ్యర్థించి ఆర్ఎస్ఎస్ ప్రాధేయపడిం ది. మూడు నెలల తర్వాత నెహ్రూ ప్రభుత్వం నిషేధాన్ని ఎత్తేసిం ది. అయినా కూడా తన ప్రతిజ్ఞకి తానే విలువలేకుండా చేసుకున్న సంఘ్ పరివార్, ఈ రోజుకు కూడా జాతీయ జెండాను గౌరవిం చదు. రాజ్యాంగానికి విరుద్ధంగా తీవ్రవాద కార్యకలాపాలు నిర్వ హిస్తూనే ఉంది. దేశాన్ని ఆనాడు ముక్కలు చేయడంలో ఆర్ఎస్ ఎస్ ముఖ్య భూమికను పోషించింది. విభజన తర్వాత కూడా దేశంలో అశాంతి నెలకొల్పుతూ వస్తోంది. స్వాతంత్ర్య ఉద్యమం లో కలిసి పోరాడిన 'హిందూ ముస్లింల మధ్య ద్వేషాన్ని రగిలించి మత కలహాల్ని సృష్టించింది. ఇంకా ఆ ప్రయత్నంలోనే ఉంది. స్వాతంత్ర్యం సాధించుకుని ఏడు దశాబ్దాలైపోయిన తర్వాత కూడా, ఆర్ఎస్ఎస్ అభివృద్ధి నిరోధక శక్తిగా నిలబడింది.

భారత రాజ్యాంగం పట్ల ఆర్ఎస్ఎస్‌కు ఎలాంటి అభిప్రాయం ఉందో చూద్దాం. వారి అధికారిక పత్రిక ఆర్గనైజర్ 30 నవంబర్ 1949 నాటి సంచికలో ఇలా ప్రకటించుకున్నారు.. 'భారత దేశానికి కొత్తగా రాజ్యాంగం రాయాల్సిన అవసరమే లేదు. పురాతన కాలంలో మనువురాసిన గొప్పగొప్ప సూత్రాలు మనకు ఉండనే ఉన్నాయి. నేటి రాజ్యాంగంలో వాటి ప్రస్తావన లేకపో వడం విచారించదగ్గ విషయం. ప్రపంచానికి దారి చూపగల 'మను ధర్మశాస్త్రం' ఈ రాజ్యాంగ నిపుణులకు కనీసం గుర్తుకు రాకపోవడం ఈ దేశం చేసుకున్న దౌర్భాగ్యం! అని ఆర్ఎస్ఎస్ అంతటితో ఆగలేదు. 6 ఫిబ్రవరి 1950 నాటి సంచికలో 'హృద యాలను పరిపాలించే మనువు' శీర్షికతో ఒక వ్యాసం ప్రచురిం చింది. అందులో ఇలా ఉంది.. 'ఈ దేశంలో మనువుకు రోజులు చెల్లిపోయాయి. అని అంబేద్కర్ బొంబాయిలో అన్నట్టు తెలిసింది. కానీ, అది జరగని పని. దాన్ని జరగనివ్వం కూడా! మనువు ప్రతి హిందువైన వాడి మనసులో ఎల్లప్పుడూ ఉంటాడు. మనువు సూత్రాలు జన జీవితంలో కొనసాగుతాయి. శూద్రులు కూడా మనువుని పూజిస్తారు. సమానత్వం గనక ఆచరణలోకి వస్తే, దేశం బలహీనపడుతుంది. వ్యక్తులు దుర్బలులవుతారు" 26 జనవరి 1950న రాజ్యాంగాన్ని ఆమోదించిన సందర్భంలో బాబా సాహెబ్ అంబేద్కర్ 'మన రాజ్యాంగం దేశంలో సమానత్వాన్ని సాధిస్తుంది" అని అన్నందుకు ఆర్ఎస్ఎస్ పైవిధంగా స్పందించిం ది. రాజ్యాంగ వ్యతిరేకతను బాహాటంగా ప్రకటించింది. తమకు మనుధర్మ శాస్త్రమే అనుసరణీయమని చెప్పుకుంది. అందుకే చూడండి. బలహీన వర్గాలు ఆర్ఎస్ఎస్ కోసం ఎన్ని త్యాగాలు చేసినా, దాని అధినేతలుగా మాత్రం కేవలం బ్రాహ్మణులే కొనసా గుతూ ఉండటం మనం ఇప్పటికీ చూస్తున్నాం.

స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనకుండా, పాల్గొనేవారిని అడ్డగించి, ఎంతోమంది దేశభక్తుల మరణానికి ప్రత్యక్షంగా, పరో క్షంగా కారణమైన ఆర్ఎస్ఎస్ వారు తమకు తాము దేశభక్తుల మని చెప్పుకోవడాన్ని దేశ ప్రజల్ని ఒప్పుకుంటారా? వారు చేసే దేశభక్తి ఉద్బోధలు, ఉపన్యాసాలు ఎంత అసంబద్ధమైనవన్నది ఆలోచించకుండా ఉంటారా? గాంధీజీ హంతకుడికీ తమ సంస్థకూ ఎలాంటి సంబంధమూ లేదని ఆనాడు ప్రకటించుకుని, తర్వాత కాలంలో మరి ఎందుకు నాథూరామ్ గాడ్సేను ఆరాధిస్తున్నారూ? ఆర్ఎస్ఎస్‌కు – పాకిస్థాన్ ఐఎస్ఐకి సంబంధాలున్నాయన్న వాదన బలంగానే వినిపిస్తోంది. వికీలీక్స్ బయటపెట్టిన స్విస్ బ్యాంక్ ఖాతాల్లో ఎక్కువ శాతం సంఘ్ పరివార్ నాయకులవే ఉన్నాయనీ, అందుకే బీజేపీ అధికారంలోకి వచ్చాక ఆ జాబితా కనబడకుండా మాయం చేసిందనీ ఒక వాదన ఉంది. 'వంద రోజుల్లో నల్లధనం వెనక్కి తెస్తానన్న' దేశ ప్రధాని మోడీ, ఆ పని చేయలేకపోవడానికి కారణం ఇదే అయి ఉంటుందని జనం అనుకుంటున్నారు. ఇవన్నీ చూస్తే దేశంలో ఉగ్రవాదం పెచ్చరిల్లి పోవడానికీ, దేశ ఆర్థిక ప్రగతి నానాటికీ దిగజారుతూ పోవడానికీ, అతి పెద్ద ఆర్థిక నేరగాళ్లు దేశం నుంచి పారిపోవడానికీ కారణం ఆర్ఎస్ఎస్ – బీజేపీలు కలిసికట్టుగా

ఆ పనులు చేస్తున్నాయా? అనే అనుమానం ఈ దేశ ప్రజలకు కలుగుతూ ఉంది. అబద్ధాల కోరులు, ఆర్థిక నేరగాళ్లు, తీవ్రవాదులు, దేశద్రోహు లు అంతా కలిసి తమను తాము దేశభక్తులుగా ప్రకటించు కుంటూ ఉంటే అసహ్యంగానూ వికారంగానూ ఉంది. పైగా వాళ్ళే దేశభక్తులనేది నిర్ణయించి చెప్పడం వికృతాలలో కెల్లా వికృతం! అసలు వీళ్లు దేశభక్తి అనే పదానికి అర్థమే మార్చేశారు. అందు వల్ల ఇలాంటి వారిని అన్ని రకాలుగా ఎదుర్కోవడం, వారి కుట్రల ను చేధించటం.. ఈ దేశ ప్రజల తక్షణ కర్తవ్యం! వారిని సమాయత్తం చేసే బాధ్యత మేధావులది. భిన్నత్వంలో ఏకత్వం సాధించుకున్న దేశం, తన అస్తిత్వాన్ని కోల్పోకముందే మేల్కోవాల్సి ఉంది. దేశ ప్రజలంతా అప్రమత్తతతో ఉండాల్సిన సమయం ఆసన్నమైంది. భారత్ ఇప్పుడు మతరాజ్యంగా మారిపోవాలా? లేక సర్వహిత, సమభావంతో సమున్నతంగా నిలవాలా? అన్న ప్రశ్నలు ఉత్పన్నమౌతున్నాయి. ❑


devaraju.maharaju@gmail.com

# బుద్ధుడు - గాంధీ

(11వ పేజీ తరువాయి)


చాలా రోజుల నుండి మనకు గాంధీజీ కొత్త రూపం ఒకటి కనపడుతుంది. ఆయన భారత ప్రజల రాజకీయ స్వాతంత్ర్యంతోనే తృప్తి పడేట్టుగా కనిపించడం లేదు. ఆయన వారి ఆర్థిక స్వాతంత్ర్యం గురించి కూడా ఆలో చించడం ఆరంభించాడు. ఆర్థిక స్వాతంత్ర్యం ఉన్నప్పుడే నిజమైన సామాజిక విప్లవం వస్తుంది. బుద్ధుని లాగానే ఆయన కూడా సమాజంపైన కొద్దిమంది పెత్తనం చెలాయించడం వల్ల సమాజంలో వ్యాపించిన అసమానత కారణంగా ఏర్పడిన దుష్పరిణామాల తీవ్రతను బాగా అర్థిం చేసుకున్నాడు. దేశంలోని రాజుల నిరంకుశత్వాన్ని బాహాటంగా దూషిస్తున్నారు. దీని ద్వారా మన పెద్ద పెద్ద సమస్యల పట్ల ఆయన వైఖరి మనకు తెలుస్తూనే వుంది. ఆయన సమాజవాదాన్ని గురించి కూడా మాట్లాడుతారు. కాని సత్యం, అహింస వీటి పైననే ఆయనకు మక్కువ ఎక్కువ. సమాజవాది అయినవాడు ఎవడూ సత్యానికి శత్రువు కాదు. అలాగే సమాజవాది అయినవాడు ఎవడూ హింస కోసమే హింసను కోరుకోడు. నిజానికి సమాజ వాదులు కాని, సామ్యవాదులు కాని, హింసను ఆత్మరక్షణకు అవసరమైన సాధనంగా మాత్రమే స్వీకరిస్తారు. అది కూడా ఎప్పుడు? సమస్యకు శాంతియుతమైన పరిష్కారం సాధ్యపడ నప్పుడు, దుండగులు హింసా మార్గాన్ని అవలంభించి బాహా టంగా దాడి జరిపినప్పుడు.

రానున్న కొద్ది కాలంలోనే పెట్టుబడిదారుల, నిరంకుశ వర్గాల భరింపరాని ప్రత్యేక హక్కులను అంత మొందించేందుకు గొప్ప పోరాటం ఆరంభం కాబోతూంది. తన అహింస యొక్క క్రియా శీలమైన శక్తి కారణంగా గాంధీజీ పీడక వర్గానికి చెందిన దుండగుల కంటే ఎంతో శక్తిమంతుడని నా నమ్మకం, నా ఆశ. ఆయన ఒక రక్త బిందువు కూడా చిందించకుండా జీర్ణించిన, వ్యర్థమైన జమీందారీ పద్ధతిని నిర్మూలించి, సమాజంలో నుండి కొన్ని వర్గాల దోపిడీని, అత్యాచారాన్ని మరెన్నడూ కానరాకుండా పారద్రోలుతాడు. మనకున్న సమయం చాలా తక్కువ. మనమం దరం ఆయన దీర్ఘాయువు కోసం ప్రార్థిద్దాం. అయినా గాంధీజీ జీవితానికి కూడా ఒక హద్దు ఉంది కదా ! మహాత్మాజీ ఈ విషయంలో త్వరలోనే ఒక నిర్ణయం తీసుకుంటారని, అహింసాత్మకమైన ఆ గొప్ప విప్లవానికి నాయకత్వం వహించి, ఆర్థిక పరమైన వర్గభేదాన్ని రూపుమాపి నిజమైన దేశ యజమానులుగా ప్రజలను నిలుపు తారని భావించవచ్చా? ఆయన నాయకత్వం దేశానికి రాజకీయ స్వాతంత్ర్యం ఇచ్చింది. ఈ నాయకత్వాన్ని చరిత్ర, మానవ సమాజం ఎల్లప్పుడు గుర్తుంచుకుంటాయి. ఒకవేళ ఈ వృద్ధాప్యంలో గాంధీజీ పరిపక్వత చెందిన తన అనుభవ బలంతో భారతదేశ ప్రజలకు ఆర్థిక బంధనాల నుండి, కొన్ని వర్గాల అత్యాచారాల నుండి విముక్తి కలిగించడంలో సఫలీ కృతుడైతే అప్పుడు ఆయన తన సమస్త శ్రేయోభిలాషతో బుద్ధుడు కూడా చేయలేకపోయిన పనిచేసిన వాడవుతాడు. ఇది జరిగి నప్పుడు మానవుల ఆనందాన్ని సాధించే విషయంలో మహాత్మా గాంధీ బుద్ధ భగవానుని అధిగమిస్తాడు. చరిత్ర ఆయనను ఈ రూపంలోనే గుర్తుంచుకుంటుంది కదా !❑




**ఈ వ్యాసం డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ గాంధీయే మార్గం సంకలనం నుంచి గ్రహించబడింది.**

# ప్రగతి ఫలాలు దక్కిందెవరికి?



**ఎన్.వేణుగోపాల్**
**వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు, వీక్షణం సంపాదకులు.**

భారత స్వాతంత్ర్యోద్యమం బ్రిటిష్ వలసవాదానికి వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంగా ప్రసిద్ధికెక్కి ఉండవచ్చు గానీ, అది మొత్తంగా సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమం. ఆర్థిక, రాజకీ య, సామాజిక, సాంస్కృతిక దోపిడీ, పీడనలన్నీ రద్దు కావాల ని ఆకాంక్షించిన ఉద్యమం. బ్రిటిష్ పాలన తొలగిపోయినంత మాత్రాన ఆ ఉద్యమ ఆకాంక్షలు నెరవేరినట్టేనా? ఇంతకూ 1947 ఆగస్ట్ 15న బ్రిటిష్ పాలన తొలగిపోయిందా అనే ప్రశ్నలు 75 ఏళ్ళ తర్వాత కూడా ప్రాసంగికంగా ఉన్నాయి. ఏ అభివృద్ధిని ఆశించి వలస పాలకులను వెళ్లగొట్టామో, ఆ అభివృద్ధి సాధించామా, సాధించినట్టు కనబడుతున్న అభివృద్ధి ఫలాలు ఎవరికి దక్కాయి? ఎవరు కోల్పోయారు? వలసవాదానికి వ్యతిరేకంగా భారత ప్రజలు దాదాపు నూట యాభై ఏళ్ళు సాగించిన మహోజ్జ్వల పోరాటాల ధారలో ఒక మజిలీ 1947 ఆగస్ట్ 15. ఆ విస్తృత పోరాట సంప్రదాయం ఏ ఒక్క పార్టీదో, ఏ ఒక్క ప్రజా సమూహానిదో, ఏ ఒక్క నినాదానిదో, ఏ ఒక్క ప్రాంతానిదో, ఏ ఒక్క ఆశయానిదో కాదు. అది ఈ దేశ ప్రజలందరూ దోపిడీ, పీడనల నుంచి విముక్తి కావాలనే విశాల ఆశయానిది! పద్దెనిమిదో శతాబ్ది చివరి నుంచే ఆది వాసులు ప్రారంభించిన బ్రిటిష్ వ్యతిరేక పోరాటాలూ రైతుబిడ్డలైన సైనికులూ, రైతాంగమూ, సంస్థానాధీశులూ, రెండు ప్రధాన మతాలకూ చెందిన ప్రజలందరూ ఐక్యంగా పాల్గొన్న ప్రథమ భారత స్వాతంత్ర్య పోరాటమూ ఆ తర్వాత ముప్పై సంవత్సరాలకు ప్రారంభమైన మధ్యతరగతి జాతీయోద్యమమూ, ఇరవయ్యో శతాబ్ది తొలి అర్ధభాగంలో సాగిన ఎన్నో విప్లవోద్యమాలూ, భిన్నమైన రాజకీయ ఉద్యమాలూ, ఆ ఉద్యమాలలో పాల్గొన్న అన్ని ప్రజా సమూహాలూ, అన్ని ప్రాంతాలూ.. జాతీయోద్యమంలో భాగమే.

అది ప్రధానంగా బ్రిటిష్ వలసవాదానికి వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంగా ప్రసిద్ధికెక్కి ఉండవచ్చు గానీ, అది మొత్తంగా సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమం. చాలాచోట్ల అది స్థానిక భూస్వామ్య దోపిడీ, పీడనలను వ్యతిరేకించిన ఉద్యమం. భారత సమాజం అనుభవిస్తున్న ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక దోపిడీ, పీడనలన్నీ రద్దు కావాలని ఆకాంక్షించిన ఉద్యమం అది. బ్రిటిష్ పాలన తొలగిపోయినంత మాత్రాన ఆ ఉద్యమ ఆకాంక్షలు నెరవేరినట్టేనా? ఇంతకూ 1947 ఆగస్ట్ 15న బ్రిటిష్ పాలన తొలగిపోయిందా అనే ప్రశ్నలు 75 ఏళ్ళ తర్వాత ప్రాసంగికంగా ఉన్నాయి. ఈ ఏడున్నర దశాబ్దాల్లో జరిగిన అభివృద్ధి గణాంకాలు చూపి, "స్వతంత్ర భారత ప్రగతి" గురించి చెప్పడా నికి అవకాశం ఉంది. భారత ఉప ఖండంలోని ఇరుగు పొరుగు దేశాలలో

**కుంటుతూనో, నడుస్తూనో, పరుగులతోనో 12 ప్రణాళికలు అమలయ్యాయి. ప్రణాళిక అంటేనే సోషలిజం చిహ్నమేమో అని భయంతో గంగ వెర్రులెత్తే రాజకీయపక్షం అధికారం సాధించి, ప్రణాళికా సంఘాన్నీ, ప్రణాళికలనూ రద్దు చేసి పారేసి ఏడేళ్ళు గడిచాయి. ప్రణాళిక లేకుండానే భారతదేశాన్ని పరివర్తన చెందిస్తానని కొత్త సంస్థను ఏర్పాటుచేసింది. అనేక గ్రంథాలు కాగలిగిన ఈ సుదీర్ఘ చరిత్రలో భారత సమాజం సాధించిన ఆర్థిక, సామాజిక అభివృద్ధి ఎంత?**

ప్రజాస్వామ్యం అనుభవించిన అవాంతరాలను చూపి, భారత దేశంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతున్నదనే అవకాశమూ ఉంది. వలసానంతర భారత సమాజ గమనాన్ని అర్థం చేసుకోవడానికీ, విశ్లేషించడానికీ ఎన్నో సూచికలూ ప్రాతిపదికలూ ఉన్నప్పటికీ, ప్రగతి, ప్రజాస్వామ్యం అనే రెండు సూచికలే కీలకమైనవి.

బ్రిటిష్ వలస పాలన తొలగిపోవాలని భారత ప్రజలు కోరుకోవడానికీ, ఉద్యమించడానికీ మూల కారణం వలసవాదం భారత సంపదలను దోచుకుపోతున్నదనే అవగాహన. విస్పష్టమైన గణాంకాల ఆధారంగా దాదాభాయి నౌరోజీ 19వ శతాబ్ది చివరి రోజుల్లో ప్రతిపాదించిన 'వనరుల తరలింపు' సిద్ధాంతాన్ని దాదాపు జాతీయోద్యమంలోని అన్నిపాయలూ అంగీకరించాయి. భారత సమాజ వనరులతో స్థానికంగా సంపద పోగుపడ డానికీ, తద్వారా సామాజిక ఆర్థికాభివృద్ధి జరగడానికీ వలస పాలన అవకాశం ఇవ్వడం లేదని జాతీయోద్యమ నాయకులందరూ భావించారు. వలస పాలన భారత సమాజ అభివృద్ధిని అడ్డుకుంటున్నదనీ, అందువల్ల దాన్ని తొలగించి స్వరాజ్యం సాధించినప్పుడే స్వతంత్ర, భారత ప్రజా ప్రభుత్వం భారత వనరులను స్థానికాభివృద్ధికి వినియోగించగలుగుతుందనీ జాతీయో ద్యమం భావించింది.

75 ఏళ్ళ క్రితం వలస పాలకులు వెళ్లిపోయారు. భారత ప్రజ

లమైన మనం మన స్వతంత్ర రాజ్యాంగాన్ని రాసుకున్నాం. ప్రణాళికాబద్ధ ఆర్థికాభివృద్ధి వ్యూహాన్ని రచించుకున్నాం. కుంటుతూనో, నడుస్తూనో, పరుగులతోనో 12 ప్రణాళికలు అమలయ్యాయి. ప్రణాళిక అంటేనే సోషలిజం చిహ్నమేమో అని భయంతో గంగ వెర్రులెత్తే రాజకీయపక్షం అధికారం సాధించి, ప్రణాళికా సంఘాన్నీ, ప్రణాళికలనూ రద్దు చేసి పారేసి ఏడేళ్ళు గడిచాయి. ప్రణాళిక లేకుండానే భారతదేశాన్ని పరివర్తన చెందిస్తానని కొత్త సంస్థను ఏర్పాటుచేసింది. అనేక గ్రంథాలు కాగలిగిన ఈ సుదీర్ఘ చరిత్రలో భారత సమాజం సాధించిన ఆర్థిక, సామాజిక అభివృద్ధి ఎంత?

జాతీయాదాయం 3 లక్షల కోట్ల నుంచి 140 లక్షల కోట్ల రూపాయలకు, ఆహార ధాన్యాల ఉత్పత్తి 5 కోట్ల టన్నుల నుంచి 30 కోట్ల టన్నులకు, ఎగుమతులు ఒక బిలియన్ డాలర్ల నుంచి 38 బిలియన్ డాలర్లకు, రోడ్డు మార్గాలు 4 లక్షల కి.మీ. నుంచి 64 లక్షల కిలోమీటర్లకు పెరిగాయని.. అటువంటి గణాంకాలతో మనం సాధించిన ప్రగతి గురించి చెప్పుకోవచ్చు. కానీ నాణానికి ఈ బొమ్మతో పాటే బొరుసు ఉంది. ఇక్కడ ఎన్నో రెట్లు పెరిగినట్టు కనబడుతున్న అంకెల పొట్ట విప్పి చూస్తే ఆ పెరుగుదలలోని ఒడుదొడుకులు బయటపడతాయి. ఉదాహరణకు జాతీయాదాయం లెక్కలో ఒక వంద మందిని మినహాయిస్తే, హఠాత్తుగా మన జాతీయాదాయం సగానికి పడిపోతుంది. ఆ వంద మంది ఆదాయం 55 కోట్ల మంది ఆదాయం కన్నా ఎక్కువ. అలాగే ఆహారధాన్యాల ఉత్పత్తిలో ఆరు రెట్లు పెరుగుదల, జనాభా పెరుగుదల నాలుగురెట్లకన్న తక్కువే ఉన్నప్పటికీ, ఇప్పటికీ దేశంలో ఆకలిచావులు, అర్ధాకలి కొనసాగుతూనే ఉన్నాయి. ఎగుమతుల్లో 38 రెట్ల పెరుగుదల కనబడుతున్నప్పటికీ, దిగుమతులు ఇదే కాలంలో ఒక బిలియన్ డాలర్ల నుంచి 60 బిలియన్ డాలర్లకు పెరిగి, విదేశీ వాణిజ్య లోటు విపరీతంగా హెచ్చింది. ఎగుమతి దిగుమతుల వ్యత్యాసం 2 కోట్ల నుంచి 20 వేల కోట్ల రూపాయలకు పెరిగిపోయింది. ఈ 75 ఏళ్ళలో ఆర్థిక, సామాజిక అసమానతలు, అవిద్య, అనారోగ్యం, నిరుద్యోగం వంటి మౌలిక సమస్యలు గణనీయంగా మారలేదు. ఏ ఒక్క అభివృద్ధి గణాంకం తీసుకున్నా, ఆ వెలుగు వెనుక పెనుచీకటి కనబడుతూనే ఉన్నది. ఏ అభివృద్ధిని ఆశించి వలస పాలకులను వెళ్లగొట్టామో, ఆ అభివృద్ధి సాధించా మా, సాధించినట్టు కనబడుతున్న అభివృద్ధి ఫలాలు ఎవరికి దక్కాయి? ఎవరు కోల్పోయారు?


అంత మాత్రమే కాదు, ఆ నాడు ఒక్క బ్రిటన్‌కు వలసగా ఉన్న భారతదేశం ఇవాళ, మరీ ముఖ్యంగా ప్రపంచీకరణ విధానాల తర్వాత అనేక పెట్టుబడిదారీ దేశాలకు ముడిసరుకులు అందించే వనరుగా, వాళ్ల సరుకులు అమ్ముకునే మార్కెట్‌గా మారిపోయింది. ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ, ప్రపంచ వాణిజ్య సంస్థ షరతులకూ, దిగుమతుల కోసం ఆధారపడిన అన్ని దేశాల అవమా నకర ఆదేశాలకూ తలొగ్గి, సార్వభౌమాధికారాన్నే పలుచబరచుకునే స్థితి వచ్చింది. ఆధునికత, విద్య, రవాణా, సమాచార సంబంధాలు, పారిశ్రామికాభివృద్ధి వంటి రంగాలలో అంకెల్లో మాత్రమే చూస్తే బ్రిటిష్ వలస పాలన కూడ ఇటువంటి ప్రగతి సాధించినట్టే కనబడు తుంది. కానీ, సుపరిపాలన ఉన్నా సరే, స్వపరిపాలనకు ప్రత్యామ్నాయం కాదు అని జాతీయోద్యమం కోరుకుంది.

ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం కావాలనీ, పరాయి పాలన పీడన తొలగిపోవాలనీ కోరుకుంది. సంపద తరలింపు గురించి మాట్లాడిన నౌరోజీయే "బ్రిటిషేతర పాలన" అన్నాడు. అంటే స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రా తృత్వం వంటి నినాదాల పుట్టుకకు కారణమైన పెట్టుబడిదారీ విధానం వలస వాదంగా, సామ్రాజ్యవాదంగా మారి, ఆ నినాదాల స్ఫూర్తిని వదిలేసి, తమ వలస ప్రజలకు స్వేచ్ఛ లేని స్థితి కల్పించిందని అర్థం. ఆర్థికాభివృద్ధి కన్నా ముఖ్యం స్వాతంత్ర్యం అని సాగిన జాతీయోద్యమం 1947 ఆగస్ట్ 15న ఆ స్వాతంత్ర్యాన్ని సాధించానని భావించింది.

కానీ, ఆ తరువాతి ఇన్నేళ్ళ చరిత్రను అవలోకిస్తే, ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం అనే విశాల భావనను ఐదు సంవత్సరాలకు ఒకసారి మొక్కుబడిగా జరిగే ఎన్నికలకు కుదించారు. ఆ ఎన్నికలు అక్రమాలకు నిలయాలయ్యాయి. ఒకసారి ప్రజా ప్రతినిధిగా ఎన్నికైతే ఐదేళ్ళలో ఏమైనా చేసే అధికారం చేజిక్కుతున్నది. ప్రభుత్వాధికారం వ్యక్తిగత సంపదలు పెంచుకునే సాధనంగా మారిపోయింది. ఉదాత్తంగా రాసుకున్న రాజ్యాంగ ఆదేశాల అమలుకన్నా ఉల్లంఘన ఎక్కువ జరుగుతున్నది. ప్రజా భాగస్వామ్యంతో నడవవలసిన పార్లమెంటరీ ప్రాతినిధ్య ప్రజాస్వామ్యంలో ప్రజలు మౌన సాక్షులుగా మిగిలిపోయారు. బహుళత్వానికి నిలయమైన దేశంలో నెలకొనవలసిన, బలపడవలసిన పరస్పర సహాయ సహకార సంఘీభావాల స్థానంలో కుల, మత, ప్రాంత, భాషా విద్వేషాల రాజకీయాలు చెలరేగి సమాజ అస్తిత్వమూ, భవిష్యత్తూ ప్రమాదకర స్థితికి చేరాయి. వలస పాలకులు తయారు చేసిన న్యాయవ్యవస్థ, భారత శిక్షా స్మృతి, నేర శిక్షా స్మృతి స్వల్పమైన మార్పులతో కొనసాగుతున్నాయి.

వలస పాలకులు సృష్టించిన రాజద్రోహ నేరం ఇప్పటికీ అట్లాగే ఉంది. జాతీయోద్యమం తీవ్రంగా వ్యతిరేకించిన రౌలట్ చట్టాన్ని మించిన దుర్మార్గమైన ప్రజావ్యతిరేక చట్టాలు లెక్కలేనన్ని స్వతంత్ర భారత పాలనలో అమలులోకి వచ్చాయి. 'దేశమనియెదు దొడ్డ వృక్షం/ ప్రేమలను పూలెత్తవలెనోయ్/ నరుల చమటను తడిసి మూలం/ ధనం పంటలు పండవలెనోయ్' అని గురజాడ అప్పారావు 'దేశభక్తి' గీతంలో రాసి నప్పుడు మొదటి రెండు పంక్తులు ప్రజాస్వామ్యానికీ, బహుళత్వ సామరస్యానికీ , చివరి రెండు పంక్తులు సంపద అభివృద్ధికీ, సమాన పంపిణీకీ సూచనలు. ఈ 75 ఏళ్లలో భారతదేశం అనే దొడ్డ వృక్షం ఎన్నో పూలు పూసింది, ఫలాలూ ఇచ్చింది, నరుల చెమటతో ధనం పంటలూ పండించింది. కానీ ఆ ప్రగతి ఫలాలు దక్కిందెవరికి? ఆ ధనం నింపిన బొక్కసాలెవరివి అనే ప్రశ్నలు ఇంకా భారత సమాజం ముందు నిలిచే ఉన్నాయి. ❑

# రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసే కుట్ర



మల్లెపల్లి లక్ష్మయ్య
**సామాజిక విశ్లేషకులు**

**ఎన్‌డీఏ ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక, సామాజిక విధానాలు... సోషలిస్టు, సెక్యులర్ స్ఫూర్తికి విరుద్ధంగా ఉన్నాయి. ప్రభుత్వరంగ పరిశ్రమలను, ఆస్తులను ప్రైవేట్ వ్యక్తులకు, కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడం చూస్తూనే ఉన్నాం. మైనారిటీ మతాలను, వాటికి సంబంధించిన సంస్థలను వేధిస్తుండడం ఎక్కువైందని అంతర్జాతీయ సంస్థలు ఎన్నో నివేదికల ద్వారా వెల్లడించాయి. ఎవరైనా ఈ విషయాలన్నింటినీ కోర్టుల్లో సవాల్ చేస్తారని ముందే ఊహించి, వాటిని తొలగిస్తే ఇక నైతికంగా కూడా తమకు ఎదురు ఉండదని భావించి అటువంటి పిటిషన్‌ను అధికార పార్టీ సభ్యుడే వేయడం జరిగి ఉండొచ్చనే అభిప్రాయానికి రావడవం తప్పేమీకాదు.**

భారతదేశ చరిత్రను అర్థం చేసుకోవాలంటే, 'భారత రాజ్యాంగం అమలుకు ముందు, అటు తర్వాత' అని చూడాల్సి ఉంటుంది. భారత రాజ్యాంగానికి ముందు ఈ దేశంలో మనుషులంతా ఒక్కటి కాదు. కులాలు, మతాలు, ప్రాంతాలుగా విడివడి ఉన్నారు. కుల సమాజాన్ని సృష్టించి, పెంచి పోషించిన మనువాదం ఒక పరిపాలనాపత్రంగా, అదే శాసనంగా, అదే రాజ్యాంగంగా అమలవుతూ సమాజంలో అంతరాలను ఇంకా బలంగా వేళ్ళూను కొనేలా చేసింది. అలాంటి సందర్భంలో కులాలకు, మతాలకు, ప్రాంతాలకు అతీతంగా భారతదేశంలో ఉన్న ప్రజలందరినీ రాజ్యాంగం ఒక్కటి చేయగలిగింది. అప్పటి వరకు కులాన్ని బట్టి విలువ ఉండేది. ఒక్కొక్క కులానికి ఒక్కొక్క విలువను మనువాదం ప్రబోధించింది. కానీ భారత రాజ్యాంగం ప్రతి పౌరునికి ఒక ఓటు, ఒక ఓటుకు ఒకే విలువను కల్పించి, కనీసం దానిలోనైనా ఒక సమానత్వ ప్రపంచాన్ని అందించింది. అందుకే భారత రాజ్యాంగం దానికదే ఒక విప్లవం. రెండు వేల సంవత్సరాలకు పైగా ఉన్న ఒక అసమాన వ్యవస్థ నిర్మాణాన్ని అది బద్దలు చేసిం ది. అయితే కొంతకాలంగా భారత రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బ తియ్యడానికి అనేక ప్రయత్నాలు జరుగుతున్నాయి. అందులో భాగం గానే గతవారం కేంద్ర మాజీ మంత్రి సుబ్రహ్మణ్యస్వామి రాజ్యాంగ పీఠిక నుంచి 'సోషలిస్టు'(సామ్యవాద), 'సెక్యులర్' (లౌకిక వాద) పదాలను తొలగించాలని పిటిషన్ వేశారు. ఆ పిటిషన్ సెప్టెంబర్ 23న విచారణకు రానున్నది. ఇదే విషయమై, 2020 జూలైలో న్యాయవాది విష్ణు శంకర్ కూడా పిటిషన్ వేశారు. ఈ రెండు పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణకు అంగీక రించింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తుల నేతృత్వంలోని ధర్మాసనం ముందు దీన్ని విచారించనున్నారు.


సోషలిస్టు, సెక్యులర్ అనే పదాలు రాజ్యాంగ సభ ద్వారా ఆమోదించిన పీఠికలో లేవనీ, 1976లో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ వీటిని చేర్చారనీ, రాజ్యాంగ సభ చర్చలలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ లాంటి వాళ్ళు కూడా వీటిని వ్యతిరేకించారనీ ఈ పిటిషన్‌లో పేర్కొ న్నారు. పిటిషనర్‌గా ఉన్న సుబ్రహ్మణ్యస్వామి తన వాదనకు బలం చేకూర్చుకోవడానికి బాబాసాహెబ్ అంబేద్కర్ మాటలను ఉటంకించినట్టు కనిపిస్తున్నది. అయితే, అంబేద్కర్ మాటలను పరిశీలిస్తే సుబ్రహ్మణ్యస్వామియే అంబేద్కర్‌ను తప్పుగా అర్థంచేసుకున్నట్టు కనిపిస్తున్నది. ఆ రోజు సభలో అంబేద్కర్ మాట్లాడుతూ... "రాజ్యాంగాన్ని మనం ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగా రూపొందించుకోవాలి. భవిష్యత్‌లో ప్రజలు ఎటువంటి విధానాలను అవలంబించాలనుకుంటారో వారికి అవకాశం ఇవ్వాలి. అంతేగానీ ఇప్పుడే అన్ని విషయాలను ముగించకూడదు. అంతేకాకుండా, రాజ్యాంగంలోని నాలుగవ భాగమైన ఆదేశిక సూత్రాల్లో పొందుపరిచిన అంశాలన్నీ కూడా సోషలిస్టు భావనలను సమర్థిస్తున్నాయనే విషయాన్ని గుర్తుంచుకోవాలి" అంటూ రాజ్యాంగ సభకు కేటీ షా ప్రతిపాదించిన సవరణకు సమాధానమిచ్చారు. అంబేద్కర్ ఎక్కడా, సోషలిస్టు భావనను వ్యతిరేకించింది లేదు. పైగా దాని సారాంశాన్ని ఆదేశిక సూత్రాల్లో పొందుపరిచినట్టు పేర్కొన్నారు.

సరిగ్గా ఇక్కడే అంబేద్కర్‌ను అర్థం చేసుకోవడానికి రాజ్యాంగ సభలో మాట్లాడింది మాత్రమే సరిపోదు. ఒకరకంగా అది అప్పటి నాయకుల ఉమ్మడి అభిప్రాయం కూడా కావచ్చు. అయితే అంబేద్కర్ మొదటి నుంచీ సమానత్వ సమాజ స్థాపనకు పాటుపడిన వ్యక్తి. అంతేకాకుండా, రాజ్యాంగ సభలో తాను సభ్యుడిగా ఉంటానో లేదో నని భావించి, 1946లో రాజ్యాంగ సభకు ఒక

మెమోరాండంను సమర్పించారు. దానినే 'స్టేట్స్ అండ్ మైనారిటీస్' అంటారు. అందులో ప్రభుత్వం సోషలిస్టు విధానాలను అనుసరించాలని, దానికి స్టేట్ సోషలిజం అనే మాటను కూడా ఆయన వాడారు. అందులో ఆర్థికపరమైన అంశాలను పేర్కొంటూ దేశంలోని భారీ పరిశ్రమలను ప్రభుత్వమే నిర్వహించాలనీ, ఇన్సూరెన్స్ లాంటి ఆర్థిక సంస్థలు ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉండాలనీ, దేశవ్యాప్తంగా ఉన్న భూములను జాతీయం చేయాలనీ ప్రతిపాదించారు. ఈ విషయాలన్నింటినీ రాజ్యాంగంలో పొందుపరచడానికి తన శాయశక్తులా కృషి చేశారు. అయినా సఫలం కాలేదు. అటువంటి సామాజిక మార్పు ను కోరుకుని, దాని కోసమే యావత్ జీవితాన్నే ప్రజలకు సమ ర్పించిన ఓ మహోన్నత వ్యక్తి వ్యాఖ్యలను తప్పుగా, తమ సోష లిస్టు వ్యతిరేక భావాలకు మద్దతుగా వాడుకోవడం విచారకరం.

ఈ విషయం అట్లా ఉంచితే, 1976లో అప్పటి ఇందిరాగాంధీ ప్రభుత్వం 42వ రాజ్యాంగ సవరణ ద్వారా పీఠికలో 'సోషలిస్టు, సెక్యులర్' అనే పదాలను మాత్రమే కాకుండా, ఇంకా చాలా విష యాలను రాజ్యాంగంలో చేర్చారు. అయితే 1977లో జనతాపార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత చాలా విషయాలను 43వ సవరణ ద్వారా తొలగించారు. అయితే రాజ్యాంగ పీఠికలోని ఆ రెండు పదాల జోలికి మాత్రం పోలేదు. ప్రస్తుత పిటిషనర్ సుబ్ర హ్మణ్యస్వామి అప్పుడు జనతాపార్టీ లోక్‌సభ సభ్యుడిగా గెలిచారు. మరి అప్పుడు తన గొంతును ఎందుకు వినిపించలేదో ఆయనకే తెలియాలి. 2008లో 'గుడ్ గవర్నెన్స్ ఇండియా ఫౌండేషన్'కు చెందిన సంజీవ్ అగర్వాల్ ఇదే విషయమై సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కె.జి.బాలకృష్ణన్ నాయకత్వంలోని ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం ఈ పిటిషన్‌ను తిరస్కరించింది. "సోషలిజం అనగానే అదేదో కమ్యూనిస్టులకు సొంతమైనట్టు అనుకోవడం సరైనది కాదు. ప్రజల సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడం కూడా అందులో భాగమే" అని వ్యాఖ్యానించింది. అందువల్ల ఆ పదా లను తొలగించాల్సిన అవసరమే లేదని భారత అత్యున్నత న్యాయస్థానం ఆనాడు కుండ బద్దలుకొట్టింది.

ప్రస్తుతం మళ్లీ ఎందుకు ఈ ప్రతిపాదన ముందుకుతెస్తున్నా రనేది ప్రశ్న. దీనికి ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్‌డీఏ ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక, సామాజిక విధానాలు... సోషలిస్టు, సెక్యులర్ స్ఫూర్తికి విరుద్ధంగా ఉన్నాయి. ముఖ్యంగా ప్రభుత్వరంగ పరిశ్రమలను, ఆస్తులను ప్రైవేట్ వ్యక్తులకు, కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడం చూస్తూనే ఉన్నాం. అదేవిధంగా మైనారిటీ మతాలను, వాటికి సంబంధించిన సంస్థలను వేధిస్తుండడం ఎక్కువైందని




అంతర్జాతీయ సంస్థలు ఎన్నో నివేది కల ద్వారా వెల్లడించాయి. ఎవరైనా ఈ విషయాలన్నింటినీ కోర్టు ల్లో సవాల్ చేస్తారని ముందే ఊహించి, వాటిని తొలగిస్తే ఇక నైతికంగా కూడా తమకు ఎదురు ఉండదని భావించి అటువంటి పిటిషన్‌ను అధికార పార్టీ సభ్యుడే వేయడం జరిగి ఉండొచ్చనే అభిప్రాయానికి రావడవం తప్పేమీకాదు. అదే విధంగా భారత దేశంలో హిందూమతాన్ని అధికార మతంగా చేయడానికి ఒక ప్రయత్నం జరుగుతున్నది. దానికి రాజ్యాంగాన్నే మార్చేయాలనే ప్రయత్నం చేస్తున్నట్టు సాధువులు, సంతులు స్వయంగా ప్రకటించారు. అందుకనుగుణంగానే ఇప్పటికే ముప్పై పేజీల డాక్యుమెంటు రూపొందించినట్టు కూడా ప్రకటించారు.

ఇటువంటి నేపథ్యం నుంచి ఈ పీఠికను చూడాల్సి ఉంది. నిజానికి రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు సోషలిస్టు, సెక్యులర్ స్ఫూర్తిని బలపరచడమే కాకుండా నిర్దిష్టమైన మార్గాన్ని చూపుతున్నాయి. సోషలిస్టు, సెక్యులర్ పదాలు భారత రాజ్యాంగాన్ని మరింత శక్తిమంతం చేస్తున్నాయే తప్ప ఎటువంటి దుష్ప్రభావాన్నీ కలిగించడం లేదు. భారత రాజ్యాంగ రక్షణ ఈ దేశ సామాజిక ప్రగతికీ, మనుగడకూ ఒక తక్షణ అవసరంగా ఉంది. అందువల్ల రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసే ఇటువంటి కుట్ర లను భారత సమాజం సహించబోదని ఆశిద్దాం. ❑

(సాక్షి సౌజన్యంతో..)

# రాజ్యాంగ లక్ష్యాలను కాలదన్నే కార్యక్రమం




మాడభూషి శ్రీధర్,
డీన్, స్కూల్ ఆఫ్ లా,
మహీంద్రా యూనివర్సిటీ,
హైదరాబాద్.


- **జాతీయ వనరుల అద్దె ఓ విఫల విధానం**

వనరులు అద్దెకిచ్చే ప్రయత్నాలు విదేశాల్లో విఫలమైన అనుభవాలు ఉన్నాయి. 2013లో ఆస్ట్రేలియా ప్రభుత్వం సిడ్నీలో కెంబ్లా రేవును, బోటానీ రేవును అద్దెకిచ్చింది. కాని అక్కడ అసెట్ మానిటైజేషన్ ప్రయోగం అంతగా విజయవంతం కాలేదు. అక్కడి రెండు రాష్ట్రాలు మాత్రమే ఈ పథకాన్ని అమలుచేశాయి. మిగతా రాష్ట్రాలు తమ సార్వభౌమాధికారాన్ని వినియోగించి ఈ 'సంస్కరణ' మాకొద్దన్నాయి. అక్కడ పవర్ గ్రిడ్‌ను, విద్యుచ్ఛక్తి ఉత్పత్తి వనరులను 49 సంవత్సరాలకు లీజ్ ఇచ్చారు. మిగతా వనరుల అద్దెకు బిడ్‌లలో పాల్గొనడానికి అంతగా ముందుకు వచ్చిన వారు తక్కువే. ఆస్ట్రేలియాలో క్వీన్స్ లాండ్ వంటి మిగతా రాష్ట్రాల ప్రభుత్వాలు పక్క రాష్ట్రాలలో వనరులను అద్దెకు తీసుకోవడానికి బిడ్‌లలో పాల్గొన్నాయి. అబుదాబీ, కువైట్ వంటి విదేశీ ప్రభుత్వాలు కూడా కొన్ని వనరులను అద్దెకు తీసుకున్నాయి. కెనడాకు చెందిన కొందరు వర్తకులు కూడా వచ్చారు. కొన్నింటిని అద్దెకు తీసుకోవడానికి చైనా ముందుకు వచ్చింది. కాని సెక్యూరిటీ కారణాల వల్ల వారికి అప్పగించలేదు.

### ఆస్ట్రేలియాలో అట్టర్ ఫ్లాప్

ఆస్ట్రేలియాలో ఈ వనరుల అద్దె పథకం అమలయిన ప్రాంతాల్లో ధరలు పెరిగాయి. వినియోగదారుల సమస్యలు మిన్నుముట్టాయి. నిరుద్యోగం పెరిగింది. ఆదాయం అనుకున్నంత వచ్చిందో లేదో లెక్క తేలలేదు. భారతీయ వనరులను ఈ విధంగా ఇతర దేశాలు లేదా ఆదేశాల వర్తకులు కంపినీలు అద్దెకు తీసుకోవడం ఈ దేశానికి మంచిదా? మనశత్రువులు పరోక్షంగా వేరే కంపినీల ముసుగులో మన వనరులను అద్దెకు తీసుకుని పెత్తనం సాధిస్తే మన భద్రత గతేమిటి? 'మేక్ ఇన్ ఇండియా' నుంచి మార్కెంటింగ్ ఆఫ్ ఇండియాకు వైపు నడుస్తున్నామా? ప్రజోపయోగకరమైన వనరులపై పెత్తనాన్ని విచక్షణారహితంగా అసమర్థ ప్రయివేటు వ్యక్తులకు అప్పగిస్తే సామాన్య ప్రజ నష్టపోయే ప్రమాదం ఉందని ఆస్ట్రేలియన్ కాంపిటిషన్ అండ్ కన్స్యూమర్ కమిషన్ చైర్మన్ రాడ్ సిమ్స్ భారతదేశానికి ఒక హెచ్చరిక చేశారు. ఆర్థిక రంగాన్ని పరిపుష్టం చేయడానికి ప్రయివేటీకరించండి. లేదా ప్రయివేటీకరించడం మానేయండి అని సలహా ఇచ్చారు.

### న్యూసౌత్ వేల్స్‌లో సమస్యలు

**మాస్కుల వెనుక మాట పెగలడం లేదా? కొత్త, పాత కేసుల్లో కూరుకుపోయిన రాష్ట్రాధినేతలు తమ పదవులు కాపాడుకోవడం కోసం డిల్లీ సుల్తాన్‌లకు దాసోహం అంటే రాష్ట్రాలలో వ్యవస్థల గతి ఏమిటి? డిమానిటైజేషన్‌తో ప్రతి సామాన్యుడి బతుకును అల్లకల్లోలం కావడం చూశాం. ఇప్పుడు మానిటైజేషన్‌తో జాతి సంపద అద్దెకిస్తా కార్యక్రమం ఈ ఏడాది నుంచే అమలు కాబోతున్నది. ఇది సీఎంలకు, ఎంపీలకు, ఇతర ప్రతిపక్ష రాజకీయనాయకులకు అర్థమయ్యే లోగా చేయి దాటి పోతుందా?**

న్యూసౌత్ వేల్స్‌లో కూడా సమస్యలు వచ్చాయి. ఎలక్ట్రిసిటీ లైన్లు స్తంభాలు ప్రయివేటీకరించారు. దాని ఫలితం కరెంటు చార్జీలు విపరీతంగా పెరిగిపోయాయి. వ్యాపారులు ప్రజా ప్రయోజనాలు ఎందుకు చూస్తారు. వేలంలో ఎక్కువ రేటుకు కాంట్రాక్టు సంపాదించిన వాడికి ప్రజల బాగోగులు పట్టవు కదా. మనం కూడా కరెంటు స్తంభాలు ప్రయివేటీకరించిన తరువాత ఇక్కడ మామూలు జనం గతి ఏమిటో ఊహించుకోవచ్చు. ఇష్టం వచ్చినట్టు కరెంటు రేట్లు పెంచితే భరించలేక ఉద్యమాలు చేసి ప్రాణాలు కోల్పోయిన చరిత్ర, ప్రభుత్వాలను మార్చిన చరిత్ర మనది.

### సింగపూర్లో రైళ్ల ఆరళ్లు

సింగపూర్లో సబర్బన్ రైళ్లను సిగ్నలింగ్ వ్యవస్థను ప్రైవేట్ ఆపరేటర్లకు ఇచ్చారు. వారు డబ్బులేకనో, అనుభవం లేకనో సరిగ్గా పెట్టుబడులు పెట్టలేక, నడపలేక చాలా సమస్యలు వచ్చాయి. రైళ్లు ఆగిపోవడం, కదుల్తాయో లేదో తెలియకపోవడం, ప్రయాణీకులు ఆగ్రహోదగ్రులు కావడం వారి అనుభవాలు. కాని ఈ పాఠాలు అర్థం చేసుకునే ప్రయత్నమే లేదు.

సంస్కృతి, స్వత్వం, జాతీయత అని నీతులు చెప్పడానికి రాజనీతికి సంబంధం లేదనుకోవాలా? ఇక మనందరి మూతులకు గుడ్డలు(మాస్కు) కట్టి నోళ్లు మూసి ఇద్దరు ముగ్గురు కార్పొరేట్ సంపన్నులకు దేశ సంపదను కట్టబెట్టే దుర్మార్గాన్ని

హాయిగా అమలు చేస్తే మన ఆర్థికవ్యవస్థ ఏమవుతుంది? మాస్క్‌ల వెనుక మాట పెగలడం లేదా? కొత్త, పాత కేసుల్లో కూరుకుపోయిన రాష్ట్రాధినేతలు తమ పదవులు కాపాడుకోవడం కోసం డిల్లీ సుల్తాన్‌లకు దాసోహం అంటే రాష్ట్రాలలో వ్యవస్థల గతి ఏమిటి? డిమానిటైజేషన్ తో ప్రతి సామాన్యుడి బతుకును అల్లకల్లోలం కావడం చూశాం. ఇప్పుడు మానిటైజేషన్‌తో జాతి సంపద అద్దెకిస్తా కార్యక్రమం ఈ ఏడాది నుంచే అమలు కాబోతున్నది. ఇది ముఖ్యమంత్రులకు, ఎంపీలకు, ఇతర ప్రతిపక్ష రాజకీయనాయకులకు అర్థమయ్యే లోగా చేయి దాటే పోతుందా? ఇంకా వివరాలు లోతుగా పరిశోధించడం అవసరం.

## బ్రౌన్ ఫీల్డ్, గ్రీన్ ఫీల్డ్

ఇదివరకే వ్యవస్థాపితమైన మౌలిక వనరులను బదిలీ చేసి కొత్త వనరులను సృష్టించడాన్ని ఇంగ్లీషులో బ్రౌన్ ఫీల్డ్ పెట్టుబడులు అంటారు. సొంతంగా పెట్టుబడులు పెట్టి కొత్తగా వనరులు నిర్మించడాన్ని గ్రీన్‌ఫీల్డ్ అంటారు. దశాబ్దాలుగా నిర్మించిన ఆస్తులు అమ్ముకొని పప్పుబెల్లాలు తినడాన్ని ఏమంటారో ఇంకా తెలియదు. అప్పు చేసి పప్పుకూడు అన్న తెలుగు నుడికారం ఇక్కడ పనికిరాదు. ఎందుకంటే ఇది అమ్ముకోవడం కనుక. అదనంగా మౌలిక వనరుల సంపద సృష్టించడానికి, ఇప్పుడున్న జాతీయ మౌలిక వనరులపై అదుపును, యాజమాన్యాన్ని, లాభాలు చేసుకునే అధికారాన్ని ప్రైవేటు వ్యక్తులు లేదా సంస్థలపరం చేయడమే మానిటైజేషన్. చట్టం ప్రకారం అమ్మినా, అద్దెకిచ్చినా, బహుమతిగా ఇచ్చినా ఆస్తి బదిలీ అన్నట్టే. అమ్ముకోవడం అంటే బాగుండదని నగదీకరణ అంటున్నారు. సామాన్యుడు మరణిస్తే పత్రికలు శవం అంటాయి. అదే గొప్ప నాయకుడు పోతే 'పార్థివదేహం' అంటారు. 'పార్థివదేహం' వంటి అందమైన ప్రత్యామ్నాయ పదాలు ఈ అద్దెకిస్తా అనే సరికొత్త ఆర్థిక విప్లవాత్మక సంస్కరణకు తగిలిస్తున్నారు.

ఆగస్టు 23న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ జాతీయ నగదీకరణ ప్రణాళిక(పైప్ లైన్)ను ప్రకటించినప్పడి నుంచి సోషల్ మీడియాలో రకరకాల జోకులు, కార్టూన్లు, వ్యంగ్య వ్యాఖ్యలు కుప్పలు తెప్పలుగా వస్తున్నాయి. ఇప్పడి నుంచి నాలుగేళ్లలో 6 లక్షల (5.96 లక్షల) కోట్ల రూపాయలను ప్రభుత్వం ఈ నగదీకరణ అలియాస్ అద్దె, తాకట్టు, ఆస్తి బదిలీ, పెత్తన బదిలీ లేదా లాభార్జనానుమతి ద్వారా సమకూర్చుకుంటారన్నమాట. ఇంత సొమ్ము దేనికి అంటే కొత్తగా గ్రీన్ ఫీల్డ్ పెట్టుబడులకు అంటే మౌలిక వనరుల నిర్మాణానికి అని చెబుతున్నారు. దీన్ని అసెట్ రీసైకిలింగ్ అని కూడా అంటున్నారు. ప్రభుత్వ వనరులకు సామాన్యప్రజలే వినియోగదారులు. వారికి ఏం జరుగుతుందో తెలియాలి. ఇటువంటి వనరుల బదిలీ విధానాలు పారదర్శకంగా ఉండాలి. వారి పైన పడే ప్రభావం ఏమిటో తెలియాలి. ఆస్ట్రేలియా తదితర దేశాల అనుభవాలు పరిశీలిస్తే అది అసాధ్యం అని అర్థం కావడం లేదా? లేదు మనం ఆస్ట్రేలియాకన్న సమర్థులం కనుక ఆరు లక్షల కోట్లు సంపాదిస్తామనే అనుకుందామా. ఆ వైఫల్యం లోంచి మన నేతల తలల్లో అద్దెకిస్తా ఆలోచన ఉదయించింది. రెడ్ టేప్ అంటే మన దేశాన్ని తలచుకోవలసిందే. మన బాబూగణ్ నిద్రలేచే సరికి పైదేశాల్లో ప్రతిపాదనలు తుదిరూపులో ఉంటాయి. వాళ్ల ఆస్తులు వారు సమర్థవంతంగా దేశానికి నష్టం రాకుండా అమ్ముకోగలుగుతారు. మనం నిద్రలేచే సమయానికి కొనుక్కునే వాడు ఉండడు. లేదా వాడిదగ్గర డబ్బు ఉండదు. ఇదంతా ఎందుకు? మన నేతల తపన అంతా మన వారికి దేశ సంపదను ఎంతో భక్తితో కట్టబెట్టడానికే కదా. అసలు ఇదేనా దేశ భక్తి?

## మన రాజ్యాంగం ఏమంటోంది?

ఆర్టికిల్ 37. రాజ్యాంగం పార్ట్ 4లో ఉన్న ఆదేశిక సూత్రాలు న్యాయస్థానాల్లో అమలు చేయడానికి వీల్లేదు. కానీ ఈ సూత్రాలు దేశ పరిపాలనలో మౌలిక సూత్రాలని మరువరాదు. చట్టాలు(విధానాలు) చేసేటప్పుడు ఈ సూత్రాలను వర్తింప జేయడం ప్రభుత్వాల బాధ్యత. (Article 37. The provisions contained in this Part shall not be enforceable by any court, but the principles therein laid down are nevertheless fundamental in the governance of the country and it shall be the duty of the State to apply these principles in making laws)

ఆర్టికిల్ 38(1) ప్రజా సంక్షేమం కోసం పాటుపడడం ఎంత ముఖ్యం అంటే, సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయంతో కూడిన ఒక సాంఘిక వ్యవస్థను నెలకొల్పేంత. జాతీయ జీవనంలో పొందుపరచవలసిన బాధ్యత. (2) ముఖ్యంగా ఆదాయాల్లో అసమానతలు తొలగించాలి. హోదా, వనరులు, సౌకర్యాలు, అవకాశాలు విషయంలో వ్యక్తుల మధ్య వర్గాల మధ్య అసమానతలను తొలగించడానికి రాజ్యం కృషి చేయాలి. [Article 38. 1 (1) The State shall strive to promote the welfare of the people by securing and protecting as effectively as it may a social order in which justice, social, economic and political, shall inform all the institutions of the national life. 2 (2) The State shall, in particular, strive to minimise the inequalities in income, and endeavour to eliminate inequalities in status, facilities and opportunities, not only amongst individuals but also amongst groups of people residing in different areas or engaged in different vocations.] **(మిగతా 27వ పేజీలో)**

# సెతల్వాడ్‌కు బెయిలు.. సుప్రీం తీర్పు



కె.రామచంద్రమూర్తి
సంపాదకులు
సకలం.కామ్

**హక్కుల కోసం, వ్యక్తి స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసి విజయాలు సాధించే వాతావరణం సుప్రీం కోర్టులో లేదు. వ్యక్తిగత స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు సంబంధించిన కేసులను సుప్రీంకోర్టులో గత నలుగురు న్యాయమూర్తుల హయాంలో విచారించలేదు. దేశ ప్రజలను వేధిస్తున్న ఆరు ప్రధానమైన కేసులు విచారణకు నోచుకోలేదు. ఈ వాతావరణంలో జస్టిస్ లలిత్ ఆధ్వర్యంలోని ధర్మాసనం సెతల్వాడ్‌కు బెయిలు మంజూరు చేయాలని నిర్ణయంచడం న్యాయవ్యవస్థపై జన బాహుళ్యం విశ్వాసం తిరిగి పాదుకోల్పడానికి దోహదం చేస్తుందనడంలో సందేహం లేదు.**


దేశంలో న్యాయం, ధర్మం కొనఊపిరితోనైనా బతికే ఉన్నాయనడానికి సాక్ష్యం శుక్రవారం కొత్త ప్రధాన న్యాయమూర్తి యూయూ లలిత్ హక్కుల కార్యకర్త తీస్తా సెతల్వాడ్‌కు తాత్కాలిక బెయిలు మంజూరు చేయడం. తీస్తా సెతల్వాడ్ గుజరాత్ అల్లర్లకు సంబంధించిన బాధితులకు న్యాయస్థానాల లో న్యాయం లభించే విధంగా కృషి చేస్తూ వస్తున్నారు. నరేంద్రమోదీ, అమిత్ షాలు ఎనిమిదేళ్ళుగా ఈ దేశానికి ప్రధానిగా, దేశీయాంగమంత్రిగా వ్యవహరిస్తున్నారు. అంతటి బలమైన నాయకుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా గుజరాత్ కోర్టులలో, సుప్రీంకోర్టులో న్యాయంకోసం పోరాడటం అన్నది ధీరోదాత్తమైన చర్య. అధినాయకులను ఇరికించడం ఉద్దేశం కాదు. వాస్తవాలను వెలుగులోకి తేవడం పిటిషనర్ల పరమావధి.

ఇటీవల సుప్రీంకోర్టు ధర్మాసనం ఒక చరిత్రాత్మకమైన తీర్పు ఇచ్చింది. గుజరాత్ అల్లర్లపైన ప్రభుత్వం నియమించిన ప్రత్యేక పరిశోధన బృందం(స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్-సిట్) సమర్పించిన నివేదికను ఆమోదించింది. మోదీకి కానీ ఇతర రాజకీయ నాయకులకు కానీ అల్లర్లలో ఎటువంటి పాత్రా లేదని స్పష్టం చేసింది. అంతటితో ఊరుకుంటే పెద్దగా గొడవ ఉండేది కాదు. ఈ కేసును ఇంతదూరం తీసుకువచ్చిన హక్కుల కార్యకర్తలను ప్రత్యక్షంగానే తప్పుపట్టింది. న్యాయమూర్తులు ఏఎం ఖాన్విల్కర్, దినేష్ మహేశ్వరి, సీటీ రవికుమార్‌లతో కూడిన ధర్మాసనం చేసిన వ్యాఖ్యలు పోలీసులను పురికొలిపే మాదిరిగా ఉన్నాయి. తమ రహస్య లక్ష్యాల కోసం (హక్కుల కార్యకర్తలు) కుండను మరిగేటట్టు ఉంచారంటూ బెంచి వ్యాఖ్యానించింది. "వారిపైన చట్టప్రకారం తీసుకోదగిన చర్యలు తీసుకోవాలి" అని కూడా అంది. అసలే గుజరాత్ ప్రభుత్వం, అందులోనూ పోలీసులు. సుప్రీం ధర్మాసనం చేసిన వ్యాఖ్యలతో పోలీసులు రెచ్చిపోయారు. వెంటనే బయలుదేరి ముంబయ్ వెళ్ళి సెతల్వాడ్‌ను అరెస్టు చేసి గుజరాత్‌కు తీసుకొచ్చారు.

సెతల్వాడ్ బెయిలు కోసం గుజరాత్ హైకోర్టులో దరఖాస్తు పెట్టుకున్నారు. ఆమె పిటిషన్‌పైన స్పందిస్తూ కోర్టు పోలీసులకు నోటీసు జారీచేసింది. ఆరు వారాల తర్వాత సమాధానం పంపమంది. ఎంత జాప్యం? ఎంత అలసత్వం? ఒక మహిళను గుజరాత్ పోలీసులు రెండు మాసాలుగా నిర్బంధంలో ఉంచారు. ఏడు రోజులపాటు పోలీసులు ఆమెను ప్రశ్నించారు. గుజరాత్ హైకోర్టు ఏ మాత్రం తొందరలేకుండా నింపాదిగా వ్యవహరించింది. విధిలేక సెతల్వాడ్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అదృష్టవశాత్తు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా యూయూ లలిత్ ఉన్నారు.

ఆయన గుజరాత్ హైకోర్టును కొన్ని సూటి ప్రశ్నలు అడిగారు. 1. మీరు మామూలుగా ఏ కేసులోనైనా పోలీసులకు నోటీసులు ఇచ్చి ఆరు వారాల తర్వాతనే సమాధానం పంపమని అంటారా? 2. రెండు నెలలు సెతల్వాడ్ నిర్బంధంలో ఉన్నప్పటికీ చార్జిషీటు ఎందుకు దాఖలు చేయలేదు. 3. ఒక మహిళను నిర్బంధించే విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ఆమెను నెలల తరబడి నిర్బంధించవలసిన అవసరం ఉన్నదా? ఈ ప్రశ్నలే కాకుండా సెతల్వాడ్ తరఫున వాదించిన కపిల్ శిబ్బల్ కూడా మరో ప్రశ్న సంధించారు. ఎఫ్ఐఆర్‌లో ఆమె కొన్ని పత్రాలు ఫోర్జరీ చేశారని ఆరోపించారు. ఏ పత్రాలు ఫోర్జరీ చేశారో ఎందుకు పేర్కొనలేదు?

జస్టిస్ ఖాన్విల్కర్ నాయకత్వంలోని బెంచి చేసిన వ్యాఖ్యలు పోలీసులను ప్రేరేపించాయి. గుజరాత్ హైకోర్టు వైఖరి వారి ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచాయి. సెతల్వాడ్‌ను అరెస్టు చేయడంతో పాటు రిటైరై విశ్రాంతి తీసుకుంటున్న మాజీ పోలీసు అధికారి ఆర్.బి.శ్రీకుమార్‌ని కూడా అరెస్టు చేశారు. మరో పోలీసు అధికారి సంజీవ్ భట్ అప్పటికే జైలులో మగ్గుతున్నారు. అధికారంలో ఉన్నవారికి వెరవకుండా తమ విధులను నిర్వర్తించడమే ఈ అధికారులు చేసిన నేరం. అహ్మదాబాద్ గుల్బర్గ్ సొసైటీలో అల్లరి మూక దాడి చేసి జాకియా భర్త, మాజీ ఎంపి ఎహసాన్



జాఫ్రీని, మరెంతో మందిని నరికి చంపారు. భర్తను కోల్పోయిన జాకియాకూ, బాధితులైన మరికొందరికి అండగా నిలబడటం, కోర్టులో కేసులు కొట్లాడేందుకు వారికి బాసటగా ఉండటం సెతల్వాడ్ చేసిన అపరాధం.

గురువారం నాడు గుజరాత్ హైకోర్టును నిశితంగా ప్రశ్నించి, శుక్రవారం నాడు సెతల్వాడ్‌కు తాత్కాలిక బెయిలు మంజూరు చేసిన జస్టిస్ లలిత్ నాయకత్వంలోని సుప్రీం ధర్మాసనం చివరికి ఈ కేసును తిరిగి గుజరాత్ హైకోర్టుకే అప్పగించింది. అక్కడే విచారణ స్వతంత్రంగా జరగాలనీ, తన వ్యాఖ్యల ప్రభావం లేకుండా స్వేచ్ఛగా ఒక నిర్ణయానికి రావాలని హైకోర్టుకు జస్టిస్ లలిత్ సూచించారు. ప్రధాన న్యాయమూర్తి చేసిన వ్యాఖ్యానాలను గుజరాత్ న్యాయమూర్తులు పట్టించుకుంటారో లేదో కొంత వ్యవధి తర్వాత కానీ తెలియదు. అభియోగపత్రం దాఖలు చేయకపోవడానికి సెతల్వాడ్‌ను ఉపా (అన్ లాఫుల్ యాక్టివిటీస్ – ప్రివెన్షన్ – యాక్ట్) కింద అరెస్టు చేయలేదని కూడా జస్టిస్ లలిత్ గుజరాత్ హైకోర్టుకూ, గుజరాత్ పోలీసులకూ చురక అంటించారు. సెతల్వాడ్ విషయంలోనే పోలీసులకు జారీచేసిన నోటీసులకు జవాబివ్వడానికి ఆరువారాల వ్యవధి మంజూరు చేశారు. ఇతర కేసులలో గుజరాత్ హైకోర్టు ఈ విధంగా వ్యవహరించలేదన్నది స్పష్టం. అందుకే గుజరాత్ హైకోర్టు నిర్ణయాలను అనుమానంగా చూడవలసి వస్తున్నది. కానీ బెయిలు పిటిషన్‌పై విచారణ జరపవలసిందిగా హైకోర్టు కనుక సుప్రీంకోర్టు గుజరాత్ హైకోర్టునే పురమాయించింది. మొత్తంమీద జస్టిస్ లలిత్ నాయకత్వంలోని ధర్మాసనం జారీచేసిన ఉత్తర్వు మరో సుప్రీం ధర్మాసనంలో న్యాయమూర్తులకూ, గుజరాత్ హైకోర్టుకూ, గుజరాత్ ప్రభుత్వానికీ, గుజరాత్ పోలీసులకూ ఒక సందేశాత్మకమైన సంకేతం.

ఈ మధ్య హక్కుల కోసం, వ్యక్తి స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసి విజయాలు సాధించే వాతావరణం సుప్రీంకోర్టులో లేదు. వ్యక్తిగత స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు సంబంధించిన కేసులను సుప్రీంకోర్టులో గత నలుగురు న్యాయమూర్తుల హయాంలో విచారించలేదు. దేశ ప్రజలను వేధిస్తున్న ఆరు ప్రధానమైన కేసులు విచారణకు నోచుకోలేదు. ఇటువంటి వాతావరణంలో జస్టిస్ లలిత్ ఆధ్వర్యంలోని ధర్మాసనం సెతల్వాడ్‌కు బెయిలు మంజూరు చేయాలని నిర్ణయించడం న్యాయవ్యవస్థపైన జనబాహుళ్యం విశ్వాసం తిరిగి పాదుకోల్పడానికి దోహదం చేస్తుందనడంలో సందేహం లేదు. ❑

# రాజ్యాంగ లక్ష్యాలను కాలదన్నే కార్యక్రమం

**(25వ పేజీ తరువాయి)**

ఆర్టికల్ 39: పౌరులు– అంటే మగవారు, మహిళలు సమానంగా సరిపోయేంతగా జీవనోపాధి మార్గాలు కలిగి ఉండేట్టు చూడడం, మానవ సమాజానికి చెందిన మౌలిక వనరుల యాజమాన్యం అదుపు జనబాహుళ్యపు ఉమ్మడి ప్రయోజనాలకు అనుగుణంగా పంపిణీ చేయాలి. ఆర్థికవ్యవస్థను ఏ విధంగా నిర్వహించాలంటే జాతి సంపద, ఉత్పత్తి వనరులు ఉమ్మడి ప్రయోజనాలను విఘాతం కలిగించే విధంగా కేంద్రీకృతం కాకూడదు. (Article 39. The State shall, in particular, direct its policy towards securing (a) that the citizens, men and women equally, have the right to an adequate means of livelihood; (b) that the ownership and control of the material resources of the community are so distributed as best to subserve the common good; (c) that the operation of the economic system does not result in the concentration of wealth and means of production to the common detriment]

ఈ మూడు ప్రాథమిక ఆదేశిక పాలనా రాజ్యాంగ సూత్రాలను ప్రయివేటీకరణ, ప్రభుత్వ ఆస్తులను అద్దెకివ్వడం అనే మానిటైజేషన్ పూర్తిగా ఉల్లంఘిస్తూ ప్రజలకు నష్టదాయకం అని గుర్తించవలసి ఉంది. ఇదిగాక సమానతా హక్కుకు ఇది పూర్తిగా విరుద్ధం. భారతరాజ్యాంగ పీఠికలో లక్ష్యాలను కాలదన్నే కార్యక్రమం. ❑

# కార్పొరేట్లకు కట్టబెడుతున్నది ఎవడబ్బ సొమ్ము..!



ఎం.కోటేశ్వరరావు
సీనియర్ జర్నలిస్టు,
వేదిక.కామ్

> **ప్రధాని నరేంద్రమోడీ ఉచితాల గురించి హితవు చెబుతూ ఉచితాలు దేశ హితం కోసం కాదు, దేశాన్ని వెనక్కు నెడతాయి. రాజకీయాల్లో స్వార్ధం ఉంటే ఎవరైనా వచ్చి పెట్రోలు, డీజిల్ ఉచితంగా ఇస్తామని చెబుతారు. ఇలాంటి స్వార్థం వల్ల నిజాయితీగా పన్ను చెల్లించేవారి మీద భారం పడుతుంది. ఇది విధానం కాదు, అనైతికం అంటూ మాట్లాడారు. ఇదే మోడీ గారు తన ఏలుబడిలో చేస్తున్నదేమిటి ? ప్రోత్సాహకాలు, పన్ను ఎక్కువగా ఉంటే ఎగవేత ఎక్కువగా ఉంటుందంటూ కార్పొరేట్లకు పన్ను తగ్గించి ఏటా కొన్ని లక్షల కోట్లు కట్టబెడుతున్నారు. ఇది ఉచితమా అనుచితమా ?**

## ఉచితాలు - అనుచితాల చర్చ

ఎన్నికల తరుణంలో ఓటర్లకు ఉచితాలను అందిస్తామని వాగ్దానాలు చేయకుండా చూసేందుకు ఎన్నికల కమిషన్‌కు మార్గ దర్శక సూత్రాలను జారీ చేయాలని బిజెపి నేత, లాయర్ అశ్వనీ ఉపాధ్యాయ సుప్రీంకోర్టులో ఒక పిటీషన్ దాఖలు చేశారు. ఎన్ని కల ప్రణాళికల్లో చేసే వాగ్దానాలను అక్రమాలుగా పరిగణిం చలేమని 2013లో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. తాజా పిటీషన్, దాన్ని సవాలు చేస్తూ మరికొందరు కక్షిదారులుగా చేరటంతో వాటిని సమీక్షించేందుకు ముగ్గురు జడ్జీలతో సుప్రీంకోర్టు ఒక బెంచ్‌ను ఏర్పాటు చేసింది. ఉచితాల వలన మన దేశం శ్రీలంక మాదిరి అవుతుందంటూ అనేకమంది గుండెలు బాదుకుంటు న్నారు. నిజమే, శ్రీలంక మాదిరి ఏ దేశమూ మారకూడదు. వారు చెప్పనిదీ, శ్రీలంక అసలు కారణం ఏమంటే ధనికులు, కార్పొ రేట్లకు పన్నులు తగ్గించటం. దివాలా కారణంగానే ఎరువులను దిగుమతి చేసుకోలేక ఆ బలహీనతను దాచి పెట్టి సేంద్రియ సాగుపేరుతో చేసిన పిచ్చి పనికి ఆ రంగం దెబ్బతిన్నది.

గతంలో కాంగ్రెస్ పాలకులు అనుసరించిన, వాటిని మరింత వేగంగా అమలు జరుపుతున్న బీజేపీ నేత నరేంద్ర మోడీ విధానా లు ఇలాగే కొనసాగితే మన దేశం శ్రీలంకగా మారేందుకు రోజు లు దగ్గరపడుతున్నాయని గ్రహించటం అవసరం. బడ్జెట్ అంటే దేశంలో వచ్చే రాబడి, సంపదలను అందరికీ సమంగా పంచ టం, కొత్త రాబడిని సృష్టించేందుకు పెట్టుబడులు పెట్టటం. నిజం గా అలా జరుగుతోందా? జరిగితే జనాలకు ఉచితాలతో పనిలేదు, ఎవరూ దేహీ అంటూ చేతులు చాచరు. రైతులు సాగును వదలి సంవత్సరాల తరబడి నిరవధిక ధర్నా చేయనవసరం లేదు. విధాన పరంగా కాంగ్రెస్–బిజెపి దొందూ దొందే, బిజెపి దేశానికి ఇస్తున్న బోనస్ ఏమిటంటే మతోన్మాదాన్ని రేకెత్తించటం. అసలు పేదలకు ఉచితాలను అందిస్తే, నగదు బదిలీ చేస్తే దేశ ఖజానా దివాలా తీస్తుందా, పన్ను చెల్లింపుదార్ల సొమ్ము వృధా అవుతుందా ? కాస్త ఆలోచిద్దాం. పేదలకు నేరుగా ఇచ్చే సొమ్ము ను వారు మార్కెట్లో ఏదో ఒక వస్తువు లేదా సేవ కొనుగోలుకు వెచ్చిస్తారు సమాజానికి తోడ్పడతారు తప్ప కార్పొరేట్ల మాదిరి పన్ను స్వర్గాల్లో, విదేశాల్లో సంపదలను కూడబెట్టుకోరు.

ఉచితాలతో దేశం కుదేలవుతుందని చెబుతున్న అశ్వనీ ఉపాధ్యాయ(47) పుట్టక ముందే దేశంలో మూడుసార్లు 1957–58, 1965–66, 1972–73 ఆర్థిక సంక్షోభం లేదా మాంద్యం వచ్చింది. తరువాత 1991లో వచ్చింది. అప్పుడేమీ ఉచితాలు లేకున్నా ఇలా ఎందుకు జరిగిందో కొంత మంది తెలిసి కూడా చెప్పరు. మరికొందరు తెలివిగలవారు వారికంటే ఘనులు. చరిత్ర చాట భారతం, సిద్దాంతాలు రాద్దాంతాలు వినే ఓపిక ఎవరికి ఉంది చెప్పొద్దు అంటారు. మొత్తం మీద గతాన్ని గురించి ప్రస్తా వించకూడదు. దీన్ని అంగీకరించాలా? రోజూ చర్చలో ఉన్న ఉచితాలు–అనుచితాలు, సంస్కరణలు, నూతన విధానాలు గతం తో నిమిత్తం లేకుండా ఆకాశం నుంచి ఊడిపడితే ఓకే వాటి గతాన్ని చర్చించనవసరం లేదు. అలాకాదే మరి !

దోమలు దూరే కంతలను చూసి గుండెలు బాదుకొనే వారికి ఏనుగులు పోతున్న మహాద్వారాలు కనిపించవా ? పార్లమెం టులో 2017జూలై 21 నక్షత్ర గుర్తులేని ప్రశ్న 938కి ఇచ్చిన సమాధానం ప్రకారం 2004–05 కస్టమ్స్, ఎక్సైజ్, కార్పొరేట్, వ్యక్తిగత పన్ను రాయితీల వలన ప్రభుత్వం కోల్పోయిన రాబడి లక్షా 95 వేల కోట్ల రూపాయలు. తరువాత అది ఏటేటా పెరు గుతూ నరేంద్రమోడీ అధికారానికి వచ్చిన 2014–15లో ఐదు లక్షల 54వేల కోట్లకు చేరింది. వీటిలో రాష్ట్రాలు ఇచ్చిన భూమి, విద్యుత్, అమ్మకపు పన్ను, ఇతర రాయితీలు లేవు. అవి కూడా వేలు, లక్షల కోట్లలోనే ఉంటాయి. అంటే ఇంతేసి మొత్తాలను

ప్రోత్సాహకాల పేరుతో కేంద్రం అప్పనంగా కార్పొరేట్లకు అప్ప గించింది. లేనట్లైతే ఆ మొత్తం ఖజానాకు చేరి జనాల సంక్షేమాని కి లేదా పెట్టుబడుల ద్వారా దేశ సంపదల వృద్ధికి తోడ్పడేది కదా ? మరి ఈ ఉచితాలు-అనుచితాల గురించి వాటిని తమ జేబు లోని సొమ్ము మాదిరి ఇచ్చిన ప్రభుత్వాల గురించి ఎవరూ ప్రశ్నిం చలేదే ! తమ ప్రభుత్వం వాణిజ్య, పారిశ్రామిక రంగాలకు ఇస్తున్న ప్రోత్సాహం అని గొప్పలు చెప్పుకొనేందుకు, ఇంతేసి మొత్తాలను ఇస్తున్నాం రండహో అని విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు నాటి కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్ పత్రాల్లో వీటి గురించి కోల్పో యిన రాబడి శీర్షికతో పేజీలకు పేజీలు కేటాయించింది.


నరేంద్రమోడీ అధికారానికి వచ్చిన తరువాత సరికొత్త పద్ధతు ల్లో దోచి పెట్టటం ప్రారంభించారు. 2014-15లో కస్టమ్స్, ఎక్సైజ్ పన్నుల రాబడిలో కోల్పోయిన మొత్తం రూ.4,35,756 కోట్లుగా పేర్కొనగా మరుసటి ఏడాది నాటకీయంగా ఆ మొత్తాలను రూ. 1,48,442 కోట్లుగా పేర్కొన్నారు. దీని అర్ధం ఖజానాకు మోడీ గారు రూ.2,87,314 కోట్లు మిగిల్చినట్లా? నిజానికి అంతమిగిల్చి ఉంటే పెట్రోలు, డీజిలు మీద 2014-15లో ఎక్సైజ్ పన్ను ఖాతా కింద కేంద్రానికి వచ్చిన మొత్తం రూ.99,068 కోట్ల మొత్తాన్ని మరుసటి ఏడాదికి రూ.1,78,447 కోట్లకు, తరువాత క్రమంగా పెంచి 2020-21 నాటికి రూ.3,72,970 కోట్లకు చేర్చారు. మరుసటి ఏడాది కొంత మేరకు తగ్గించటంతో రూ.3,63,365 కు తగ్గింది. ఇంత మొత్తం భారాన్ని మోపటంతోపాటు గాస్ సబ్సి డీని భారీగా తగ్గించి ముష్టి విదిల్చినట్లుగా మార్చి వేశారు. అశ్వనీ ఉపాధ్యాయ వంటి వారు వీటిని గురించి ఎందుకు పట్టించు కోలేదు ? అసలు జరిగిందేమిటి ?

ఉచితాలు, సంక్షేమ పథకాలను వ్యతిరేకిస్తున్న వారు గానీ సమర్ధిస్తున్న వారు గానీ ఇవెందుకు ఉనికిలోకి వచ్చిందీ తెలుసు కోవాలి. దేశంలో 1991లో ఎగువున ఉన్న పది శాతం మంది జనాభాకు దేశ రాబడిలో 35 శాతం ఉండగా అది 2014 నాటికి 57 శాతానికి పెరిగింది. సంస్కరణల పేరుతో కాంగ్రెస్ ఏలినా, ఆరేండ్లు బీజేపీ వాజ్‌పాయి అధికారంలో ఉన్నా జరిగింది ఇది. కొందరికి సంపద పెరిగితే ఏడుపు ఎందుకు, సంపాదించటం చేతకాక అంటారు కొందరు ? నిజమే ఏడవాల్సిన పనిలేదు. దేశ జనాభాలో 50 శాతం మందికి ఇదే కాలంలో వస్తున్న రాబడి 20.1 నుంచి 13.1 శాతానికి దిగజారింది. మరి దీనికి వారి ఖర్మ అనుకోవాలా ? చేతకాని అసమర్ధులని భావించాలా ? 2022 ప్రపంచ అసమానతల సూచిక ప్రకారం మన దేశంలోని ఎగువ ఒక శాతం చేతిలో 22 శాతం సంపద చేరింది. దేశంలో మైనారిటీ తీరిన వారి సగటు సంపాదన ఏడాదికి రూ.2,04,200 కాగా దిగువ 50 శాతం మంది సగటు రాబడి రూ.53,610, ఇక ఎగువ 10 శాతం మందికి రూ.11,66,520 ఉన్నట్లు ఆ నివేదిక పేర్కొన్నది. తొలిసారిగా మన దేశంలో అసమానత నివేదికను ప్రభుత్వం విడుదల చేసింది. లేబర్ ఫోర్స్ సర్వే (పీఎల్ఎఫ్ఎస్) 2019-20 ప్రకారం ఎగువన ఉన్న పది శాతం మంది కార్మికు ల్లో నెలకు ఇరవై ఐదు వేలు సంపాదించే వారు ఉన్నారు. వారిలో కూడా ఎగువన ఉన్న ఒక శాతం రాబడి మొత్తంలో 6-7 శాతం కాగా, పది శాతం మంది మూడోవంతు పొందుతున్నారు. మరి దేశంలో కష్టపడనిది ఎవరు ? అందరికీ ఎందుకు పెరగలేదు ? పేదల పరిస్థితి నానాటికీ దిగజారుతున్నది కనుక వారిలో అసం తృప్తి ప్రబలితే తమకు మొదటికే మోసం వస్తుందేమోనని ఉపశమ న పరిచేందుకు తెచ్చినవే ఉచితాలు, సంక్షేమ పథకాలు. అధికా రం కోసం ఒక పార్టీకంటే మరొక పార్టీ ఎక్కువ ఇస్తానని చెప్పి ఓట్లను కొల్లగొట్టవచ్చు తప్ప సంక్షేమ పథకాలను ఎత్తివేసే పరిస్థితి లేదు.

ప్రపంచంలో అత్యంత ధనిక దేశం అమెరికా. అక్కడ కూడా దారిద్ర్యంలో లేదా అల్పాదాయం ఉన్న కుటుంబాలు ఫుడ్ స్టాంప్స్ పేరుతో ప్రతి నెలా అర్హతలను బట్టి ప్రతినెలా 250 నుంచి 1,316 వరకు డాలర్ల రూపంలో ప్రభుత్వం చెల్లిస్తున్నది. దీన్నే రూపాయల్లో చెప్పాలంటే ఇరవై వేల నుంచి లక్షా ఐదువేల వరకు ఉంటుంది. ఏదో ఒక రూపంలో ఈ కార్యక్రమం 1939లో మొద లు పెట్టి ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. అక్కడ 2020లో 33 కోట్ల మంది జనాభా ఉంటే పేదరికంలో ఉన్న వారు. 3.72 కోట్లని అధికారికంగానే చెప్పారు. వారందరూ ఫుడ్ స్టాంప్స్‌కు అర్హులే. మన దగ్గర చౌక దుకాణాల్లో సబ్సిడీ బియ్యం ఇస్తారు, అక్కడ కూపన్లతో ఆహారానికి సంబంధించిన జాబితాలోని వస్తు వులను కొనుక్కోవాల్సి ఉంటుంది. కొనకూడని వస్తువుల జాబితా ఉంటుం ది కనుక దుకాణదారు వాటిని విక్రయిస్తే ఆ కూపన్లు వాటికి చెల్లవు. అమెరికాలో పేదరికాన్ని ఎందుకు తొలగించ లేకపోయా రు, దేన్నీ ఉచితంగా ఇవ్వకూడదని చెప్పే అమెరికా పేదలకు డాలర్లు ఎందుకు ఇస్తున్నట్లు ? వాటిని ఉచితాలుగా పరిగణిం చాలా అమెరికా పాలకుల అసమర్ధతకు చెల్లిస్తున్న పరిహారంగా చూడాలా ? మన దేశంలో ఉపాధి హామీ పథకం కింద కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకం వల్ల తమ పొలాల్లో పని చేసేం దుకు కూలీలను దొరక్కుండా చేస్తున్నారని, సబ్సిడీ బియ్యాన్ని అమ్ముకుంటున్నారంటూ ఏడ్చేవారు ఆ పథకాలను అనుచితమైన విగానే వర్ణిస్తారు.

జనంలో అసంతృప్తి తలెత్తుతున్నపుడు అధికారం కోసం అర్రు లు చాచేవారు ఇతరులను విమర్శిస్తూనే తమ అధికారాన్ని సుస్థి రం చేసుకొనేందుకు అనివార్యంగా సబ్సిడీ, సంక్షేమ పథకా లను అనుసరిస్తారనేందుకు తాజా నిదర్శనం ప్రధాని నరేంద్ర మోడీ. సరిగ్గా 2019 లోక్‌సభ ఎన్నికలకు ముందు 2018 డిసెంబరు నుంచి కిసాన్ సమ్మాన్ పథకాన్ని ప్రకటించి మూడు విడతలుగా పదకొండు కోట్ల మంది రైతులకు ఏడాదికి ఆరువేలు నేరుగా బాంకుల్లో వేస్తున్నారు. ఇప్పటికి పదకొండు విడతలు అందించా రు. ధరల పెరుగుదలకు దారితీసిన కారణాల్లో ప్రధానమైనదిగా చమురుపై సెస్‌ల పెంపుదల ఒకటి. జనానికి ఉపశమనం కలిగించటంకంటే అదెక్కడ తన ఓటు బాంకుకు గండికొడుతుం దో అన్న భయంతో ఎలాంటి (మిగతా 33వ పేజీలో)

# తెలుగు జాతి సమరగీతి వీర తెలంగాణ



తెలకపల్లి రవి
సీనియర్ సంపాదకులు

శ్రీశ్రీ అన్నట్టు తారీఖులు, దస్తావేజులకన్నా చరిత్ర సారం కీలకం. ఆ విధంగా చూస్తే తెలంగాణ సాయుధ పోరాటం 75 ఏళ్ల తర్వాత తన విశిష్టతను చాటుకుంటున్నది. కమ్యూనిస్టులు రాజకీయ మార్పుల రీత్యా సెప్టెంబరు 17నే జరిపి సైద్ధాంతిక చారిత్రిక ప్రాధా న్యత చెబుతూ వస్తున్నారు. బీజేపీ రంగ ప్రవేశం తర్వాత వక్రీక రణలను నిలవరించడం మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. మారిన ఈ పరిస్థితుల్లో జాతీయ సమైక్యతా దినోత్సవంగానైనా దీన్ని జరపడం అందువల్లనే. మూగవోయిన కోటి తమ్ముల గళాల/పాట పలికించి కవితా జవమ్ము కూర్చి/నా కలానికి బలమిచ్చి నడిపినట్టి / నా తెలంగాణ కోటి రతనాల వీణ. వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట 76వ వార్షికోత్సవ సందర్భమిది. 1946 జులై 4న దొడ్డి కొమరయ్య బలిదానం ఆ మహత్తర సమరానికి నాంది ప్రస్తావన. తెలుగు జాతి చరిత్రలో రుధిరాక్షర లిఖితం ఆ పోరాటం. రాజకీయ సాంస్కృతిక, ఆర్థిక పీడనలపై అశేష జనం ఒక్కుమ్మడిగా ఆయుధాలు ధరించి అంత పెద్ద ఎత్తున పోరాడటం దేశంలో అంతకుముందు, తర్వాత జరగలేదు. అది అంతర్జాతీయంగా గొప్ప ఖ్యాతి గడించిన ఆ పోరాట చరిత్రలో సెప్టెంబరు 17 కీలక ఘట్టం. దానిపై రకరకాల భాష్యాలున్నా కాలక్రమంలో అందరూ జరుపుతూ వస్తున్నారు. ఈ రోజు స్వాతంత్ర్య అమృతోత్సవాలలో దాన్ని మేళవించి కేంద్రం, తెలంగాణ ప్రభుత్వం వేర్వేరు పేర్లతో విడివిడిగా నిర్వహిస్తున్నాయి. ఆ పోరాటానికి నాయకత్వం వహించిన కమ్యూనిస్టులు ఎప్పటిలాగే దీనిని స్మరించుకుంటున్నారు.

## వెట్టిచాకిరి, క్రూర నిరంకుశత్వం

హైదరాబాద్ సంస్థానంలో తెలంగాణలోని తొమ్మిది జిల్లాలు కొన్ని మరాట్వాడా కన్నడిగ ప్రాంతాలతోపాటు నిజాం రాచరిక నిరంకుశ పాలనలో మగ్గిపోతుండేవి. జన సామాన్యం వెట్టిచాకిరీ కింద నలిగిపోతుండేది. పైగాలు, జాగీర్దార్లు, ఇజారాదార్లు, మక్తేదార్లు, ఈనాందార్లు, దేశ్‌ముఖులు రకరకాల పేర్లతో దొరలు వేల లక్షల ఎకరాలు కలిగి వుండేవారు. వీరికి పన్నులు వేసేందుకు వసూలు చేసే అధికారం వుండేది. ఏ స్త్రీనైనా సరే గడీలనబడే తమ బంగళాల్లోకి తీసుకుపోతారు. శ్రమనూ శరీరాలనూ కొల్లగొడతారు. ఈ అమానుష నిరంకుశ పీడన వందల ఏళ్లపాటు సాగింది. భాషా పరంగానూ, మత పరంగానూ కూడ నిజాం నిరంకుశత్వం. ప్రజలలో అత్యధికులు తెలుగు వారైనా పాలకుల ఉర్దు అధికార భాష, బోధనా భాష. సభలు జరుపుకోవడానికి గాని, సంఘాలు పెట్టుకోవడానికి ఆఖరుకు గ్రంథాలయం స్థాపించుకోవడానికి గాని అనుమతి వుండేది కాదు. 1930లో జోగిపేటలో ఆంధ్ర మహాసభ తొలిసభ జరిగింది. కొద్దిపాటి ప్రజాస్వామిక సంస్కరణలు కోరుతూ మహజర్లు సమర్పించేవారు. హైదరాబాదులో కామ్రేడ్స్ అసోసియేషన్ ఏర్పడింది. కమ్యూనిస్టు పార్టీ సభ్యుడైన రావినారాయణ రెడ్డి 1941 నాటికి ఆంధ్ర మహాసభ అధ్యక్షుడైనాడు.

**కెసిఆర్ ప్రభుత్వం కూడా ఈ పోరాట వారసత్వాన్ని తలుచుకోవడానికి ఎనిమిదేళ్లు పట్టింది. కె.సి.ఆర్ చాలాకాలంగా నిజాం ఘనతను కీర్తిస్తున్నారు. ఉత్సవాలు కూడా జరపడానికి వెనుకాడారు. రజాకార్ల నాయకుడైన కాశిం రజ్వీ స్థాపించిన మజ్లిస్ పార్టీ నేత ఒవైసీ లేఖ రాశాక జాతీయ సమైక్యతా దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. బీజేపీ మతకోణంలో విమోచన అంటుంటే కాంగ్రెస్ స్వతంత్ర దినోత్సవం అంటున్నది. అంటే వీరెవరికీ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని ఆ పేరుతోనే జరపడం ఇష్టం లేదు.**

## మహత్తర పోరాట చరిత్ర

రెండవ ప్రపంచ యుద్ధ నేపథ్యంలో కమ్యూనిస్టు పార్టీపై నిషేధం తొలగి తొలిసారి బహిరంగంగా పనిచేసే అవకాశం కలిగింది. ప్రజా ఉద్యమాలు గొప్ప వెల్లువగా సాగాయి. రాజులు, సంస్థానాధీశులు, భూస్వామ్య ప్రజా కంటకులకు వ్యతిరేకంగా రైతాంగ తిరుగుబాట్లు ఉవ్వెత్తున ఎగసాయి. మునగాల, చల్లపల్లి జమీందార్లకు వ్యతిరేకంగా రైతాంగ పోరాటం వంటివి పెల్లుబికాయి. రెడ్డి హాస్టల్‌లో వుండి రాజకీయ తరగతులు జరిపి సంబంధాలు పెంచుకున్నారు చండ్ర రాజేశ్వరరావు. 1944లో భువనగిరిలో జరిగిన 11వ మహాసభ తర్వాత ఆంధ్ర మహాసభ పూర్తిగా కమ్యూనిస్టుల ఆధ్వర్యంలోకి వచ్చింది. దాన్ని సంస్కరణలకై మొంపెట్టుకునే దశ నుంచి పోరాట వేదికగా మార్చే పని కమ్యూనిస్టు పార్టీ చేసింది. తెలంగాణ వీరులకు విశాలాంధ్ర కమ్యూనిస్టు కమిటీ ఆధ్వర్యంలో ఆంధ్ర ప్రాంతంలోనూ వాలంటీర్ శిక్షణ, ఆయుధ తర్ఫీదు లభించింది. అయిలమ్మ భూమి సమస్యపై పోరాటం సందర్భంగా 1946 జులై 4న విసునూరు రామచంద్రారెడ్డి గూండాలు దొడ్డి కొమరయ్య ప్రాణాలు బలి తీసుకో వడంతో ఈ పోరాటం విజృంభించింది. సామాన్య ప్రజలు సంఘం అని పిలుచుకున్న ఆంధ్ర మహాసభ ఆధ్వర్యంలో కమ్యూనిస్టు పార్టీ

నాయకత్వాన మొదలైన ఈ పోరాటంలో గడీలను ఆక్రమించి అప్పు ల పత్రాలు చించేశారు. వారి పొలాలను ఆక్రమించారు. దొరల గూండాలను, నిజాం సైన్యాలను, రజాకార్లనబడే కిరాయి మూకల ను, పోలీసులను ఎదిరించే మహా ప్రవాహంగా కదిలారు. స్త్రీలు పిల్లలూ సైన్యంలా కదం తొక్కారు. 'బాంచను దొరా... కాల్మొక్తా' అన్నవారే బందూకులు పట్టి దోపిడీ దొరలను దునుమాడారు. వడిశాల, కారం పొడి, రోకలిబండ కూడా ఆయుధాలైనాయి. 'ఈ కమ్యూనిస్టుల దగ్గర ఏ మహత్యమున్నదో కాని బానిసను దొరా అన్న వానితో బందూకు పట్టించారని' వారి భావాలతో ఏకీభవిం చని సురవరం ప్రతాపరెడ్డి వ్యాఖ్యానించారు.

## సాటిలేని విజయాలు

సాయుధ పోరాటం వెట్టిచాకిరీకి సమాధి కట్టింది. బానిస త్వానికి స్వస్తి చెప్పింది. మూడు వేల గ్రామాలలో పది లక్షల ఎకరా ల భూమిని ప్రజలకు పంచిపెట్టింది. వ్యవసాయ కార్మికుల కూలి రేట్లు పెరిగాయి. వడ్డీ భారం దాదాపు తగ్గించేయబడింది. ప్రజలను పీడించే ఫారెస్టు గార్డులను వెళ్లగొట్టింది. ప్రజాస్వామ్యమే ఎరుగని నిజాం ఫర్మానాలో ఇప్పుడు మూడు వేల గ్రామాలలోనూ పంచాయ తీల ఆధ్వర్యాన ప్రజా పాలన ప్రారంభమైంది. కష్టజీవులకే ప్రాతి నిధ్యం, ఇద్దరు స్త్రీలకు ప్రాతి నిధ్యం కల్పించబడింది. జీవితంలో తొలిసారి రెండు పూటలా అన్నం తిన్నామని తెలంగాణ ప్రజలు చెప్పుకున్నారు. మరోవైపు అశేష ప్రజల రక్తతర్పణ, ఎందరో ప్రజాయోధుల ప్రాణబలి ఈ విజయాల వెనక వున్నాయి. నాలుగు వేల మందికి పైగా కమ్యూనిస్టులు, రైతు గెరిల్లాలు అమరులైనారు. పది వేల మంది నిర్బంధాలతో జైలు శిక్షలను అనుభ వించారు. యాభై వేల మంది చిత్రహింసలను ఎదుర్కొన్నారు. వేలాది గ్రామాలు దాడులకు గురైనాయి. మహిళలపై వేల సంఖ్యలో అత్యాచారా లు జరిగాయి. నిజాం రాజ్యం కదలిపోతున్న స్థితిలో 1948 సెప్టెంబరు 12న కేం ద్రంలోని నెహ్రూ ప్రభుత్వ సైన్యాలు దిగాయి. హోం మంత్రి సర్దార్ పటేల్ నాయకత్వంలో సంస్థానాన్ని విలీనం చేసుకుని నిజాంను రాజప్రముఖ్‌గా గుర్తించి ప్రజలపై తుపాకులు ఎక్కుపెట్టాయి. పలా యనం పాడిన భూస్వాములకు కాంగ్రెస్ టోపీలతో పునరావాసం కల్పిం చి ప్రజలను ఊచకోత కోశాయి. ఆ దశలో కమ్యూనిస్టు పార్టీ సాధించిన విజయాలను కాపాడుకోవడం కోసం సాయుధ పోరాటాన్ని కొనసాగిం చడం అనివార్యమైంది. రెండు వారాల్లో తెలంగాణ పోరాటాన్ని అణచేస్తా నన్న అప్పటి హోం మంత్రి సర్దార్ పటేల్ గొప్పలు వమ్ము కాగా 1951 అక్టోబరు 21 వరకూ ఈ సాయుధ పోరాటం కొనసాగింది. ఆ వెంటనే జరిగిన 1952 మొదటి సాధారణ ఎన్నికల్లో కమ్యూనిస్టులు అఖండ విజయం సాధించారు.

## దేశానికి నిర్దేశం, సాంస్కృతిక వెల్లువ

తెలంగాణ పోరాటం ఫలితంగానే దున్నేవానికి భూమి అన్న నినా దం రూపొందింది. పాలకులు మాట మాత్రంగానైనా భూ సంస్కర ణలను రంగం మీదకు తేవలసి వచ్చింది. ముక్కచెక్కలై వున్న తెలుగు ప్రజలను ఒక్కచోటికి చేర్చే ఆంధ్రప్రదేశ్ ఏర్పాటుకు మార్గం సుగ మం కావడమే కాక దేశమంతటా భాషా ప్రయుక్త రాష్ట్రాలకు బాటవేసింది (తర్వాతి కాలంలో ఇది రెండుగా విభజిం చబడటం వేరే విషయం). ఆ విధంగా స్వాతంత్ర్యానంతర భారత రాజకీయ చిత్రపటాన్ని రచించింది. ఈ పోరాట విరమణ విద్రోహ మనీ కొనసా గించడం అతివాదమని సైద్ధాంతిక వాదనలు చేసిన రాసినవారున్నా అది ఇక్కడ అప్రస్తుతం. చరిత్ర వాటికి సమాధానం చెప్పేసింది. ఏమయినా ఈ క్రమంలో కమ్యూనిస్టు పార్టీలో జరిగిన అంతర్గత సైద్ధాంతిక పోరాటం మితవాద అతివాద ధోరణులను ప్రస్ఫుటం చేసి, భావి భారత ప్రజాస్వామిక విప్లవ స్వరూప స్వభా వాలను తెలియజెప్పే దిక్సూచిగా నిలిచింది. సాంస్కృతికంగా కూడా తెలంగాణ పోరాటం గొప్ప ప్రేరణ కలిగించింది. అంతకు ముందు జానపదాల్లో గోడు వెల్లబోసుకున్న ప్రజానీకం ఈ పోరాట ప్రభావం వల్ల అద్భుతమైన సమర సాహిత్యం సృష్టించారు. ప్రజాకవులు, కళాకారులు, రచయితలు చిరస్మరణీయ మైన రచనలు, కళా రూపాలు అందించారు. తెలంగాణ పోరాటం తలుచుకుంటేనే జాన పద కళారూపాలు, నైజాం సర్కారోడా వంటి పాటలు ప్రతిధ్వని స్తాయి. మా భూమి నాటకం కదలాడుతుంది. వజ్రాయుధం, త్వమే వాహం, తెలంగాణ ఉదయిని వంటి కావ్యాలు గుర్తొస్తాయి. దాశ రథి, ఆళ్వారు స్వామి తదితరుల నవలలు గుర్తొస్తాయి. చిత్తప్రసాద్ చిత్రాలు కళ్ల ముందు కదలాడతాయి.

## బిజెపి కుటిల ప్రయత్నం, విపరీత వాదనలు

మతతత్వ రాజకీయాల మూల విరాట్టు బీజేపీ 1998లో కేంద్రంలో మొదటిసారి అధికారంలోకి వచ్చేవరకూ సెప్టెంబరు 17 ను పట్టించు కోలేదు. అప్పుడే విమోచన దినం అని పేరు పెట్టి ఎల్.కె.అద్వానీని రావించి రాజకీయ హడావుడి మొదలెట్టింది. నాడు ఈ విలీనం ప్రక్రియ కు సర్దారు పటేల్ ఆధ్వర్యం వహం చినందున అద్వానీ అభినవ సర్దారు అని వారు చేసే ప్రచారానికి బాగా ఉపయోగకరమని తలపోసింది. ఇప్పుడు పటేల్ అంటే అమిత్‌షా గనక ఆయనా వస్తున్నాడు. నిజాం ముస్లిం రాజు గనక ఆయనను కూలదోయడం విమోచన అని వారి భాష్యం. వారిని వ్యతిరేకించే వారంతా నిజాంలూ రజాకార్లు. వాస్తవా నికి బీజేపీకి లేదా సంఘ పరివార్‌కు నిజాం వ్యతిరేక పోరాటంతో ఏ మాత్రం సంబంధం లేదు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక జునాగఢ్ పాకి స్తాన్‌తో కలవడానికి మంతనాలు జరిపితే, కాశ్మీర్, హైదరాబాద్ సంస్థానాలు స్వతంత్రం ప్రకటించుకోవడానికి ప్రయత్నించాయి. బీజేపీ తరహా పూర్వరూపంలాంటి రామ రాజ్య పరిషత్ హిందువనే ఒకే కారణంతో అందుకు మద్దతు తెలిపింది. వాస్తవానికి తెలం గాణ పోరాటంలో బందగీ వంటి సామాన్య ముస్లిం రైతుల నుంచి మేధావుల వరకూ పాల్గొన్నారు. సాయుధ పోరాటం కోసం పిలు పునిచ్చిన ముగ్గురిలో ముగ్దుం ఒకరు. స్టేట్ కాంగ్రెస్ పేరిట కొన్ని చర్యలు జరిగినా వాస్తవంలో ఈ పోరాటానికి ఆ పార్టీకి సంబంధం లేదు. కొందరు ఆ పేరుతో విచ్ఛిన్న చర్యలు కూడా చేశారు. ఇక్కడ ఆలస్యంగా ఏర్పడిన కాంగ్రెస్ ఎజెండాలో సంస్థానాలపై పోరాటమే లేదు. పైగా భూస్వాములతో దోస్తీ.ఇంకొన్ని శక్తులు. వారికి వంత పాడే కొందరు మేధావులు వలసవాదం వంటి సందర్భం లేని పదజాలంతో తెలంగాణ పోరాట **(మిగతా 42లో..)**

# మార్క్సిజాన్ని విస్మరిస్తే మానవాళికి ముప్పు

ఈపీడబ్ల్యూ
సంపాదకీయం

**మార్క్స్ జన్మించి రెండు వందల ఏళ్లు అయిన తర్వాత చేయవలసిన పని ఆయన ఆలోచనా విధానం, పద్ధతి ప్రకారం ప్రస్తుత పరిస్థితిని అంచనా వేయడం. దీనికి చారిత్రక భౌతిక వాదం, గతితార్కిక భౌతికవాద సూత్రాలను అన్వయించవలసి ఉంటుంది. మార్క్స్ నుంచి మనకు అందిన వారసత్వాన్ని వినియోగించుకుని ప్రతి అంశాన్నీ విమర్శనాత్మకంగా చూడవలసి ఉంటుంది. మార్క్సిజాన్ని యాంత్రికంగా అనువర్తింప చేస్తే ప్రయోజనం లేదు.**

కనికరం లేకుండా విమర్శించడం మార్క్స్ లక్షణం. పెట్టుబడి, పెట్టుబడిదారీ విధానాన్ని విమర్శనాత్మకంగా విశ్లేషించడానికి ఆయన కనికరం లేకుండానే వ్యవహరించారు. ఆయన ప్రపంచంలోని అత్యున్నత, ప్రభావవంతమైన మేధావి. ఆయన తన భావాలను, అభిప్రాయాలను అంతే నిర్దయగా పరిశీలించేవారు. తాను రాసిన దాంట్లో తప్పేమిటి, ఒప్పేమిటి అని నిశితంగా పరిశీలించేవాడు. ఉదాహరణకు ఆయన బ్రిటిష్ వలసవాదుల నుంచి అందిన సమాచారం ఆధారంగా 1853లో అది "అచేతనమైన చరిత్ర ఉపకరణం" అని భావించి బ్రిటిష్ వలసవాదం భారత పరిణామక్రమానికి దోహదం చేస్తుందని భావించారు. కాని ఆ తర్వాత 1881లో తగిన సమాచారం అందుబాటులోకి వచ్చినప్పుడు "బ్రిటిష్ వారు భారత్‌ను పీల్చి పిప్పి చేసి తాము ఇచ్చే దానికన్నా వాళ్లు దోచుకు వెళ్తున్నది అపారం" అని భావించారు. సముచిత సమాచారం ఎప్పుడందినా మార్క్స్ పరిగణనలోకి తీసుకునే వారు. అదీ గాక ఆయన భావనలు, నిర్వచనాలు అంతిమ సత్యాలని ఎన్నడూ అనుకోలేదు. చారిత్రక పరిస్థితులకు అనుగుణంగా అవి మారవచ్చునని నమ్మారు.

మార్క్స్ మొదట ఒక కాల్పనిక భావవాదిగానే ఫ్రెడరిక్ హెగెల్‌ను, లుడ్విగ్ ఫ్యూర్బాక్‌ను విశ్లేషించారు. ఇతర తత్వవేత్తల విషయంలో కూడా ఇలాగే వ్యవహరించారు. తన చుట్టూ జీవితంలో కనిపించే వాస్తవికతను గుర్తించిన కొద్దీ తనదైన గతితార్కిక భౌతిక వాదాన్ని, చారిత్రక భౌతికవాదాన్ని రూపొందించారు. అప్పటి నుంచి ఆయన ధోరణిలో విపరీతమైన మార్పు కనిపించదు. కాని మొదట ఉన్న మార్క్స్‌కు తర్వాత పరిణతి చెందిన మార్క్స్‌కు మధ్య పెద్ద తేడా లేదు. జర్మనీ తత్వశాస్త్రం, ఫ్రాన్స్ సోషలిజం, బ్రిటిష్ రాజకీయ అర్థ శాస్త్రం, ఆ తర్వాత రష్యా జనాకర్షక వాదం మార్క్స్‌ను బాగా ప్రభావితం చేశాయి. కాపిటల్(పెట్టుబడి) గ్రంథంలో మార్క్స్ 'నైరూప్య ఊహించ దగిన' పద్ధతిని అనుసరించాడు. దాన్నే తర్వాత క్రమానుసార పద్ధతి అన్నారు. ఈ పద్ధతిలో విశ్లేషణ ఒక్కొక్క అడుగే ముందుకు వెళ్తుంది. నైరూప్యమైన భావాలు తర్వాత నిర్దిష్ట భావాలుగా పరిణమిస్తాయి. కేవలం ఊహలు విశ్లేషణా స్థాయికి చేరుకుంటాయి. క్రమానుగత విశ్లేషణా దశలు నిర్దిష్టమైన ధోరణులను విడమర్చి చెబుతాయి. నైరూప్య ఊహలు విపరీతమైన పరిశీలన ద్వారా కీలకాంశాలను విప్పి చెప్పగలుగుతాయి. పెట్టుబడికి శ్రమకు ఉన్న సంబంధాన్ని వివరించడానికి మార్క్స్ ఇదే పద్ధతి అనుసరించారు. పెట్టుబడి గ్రంథం మొదటి సంపుటంలో మార్క్స్ చేసిన పని ఇదే. కీలకాంశాలకు ప్రాధాన్యం ఇచ్చారు. మార్క్స్ విశ్లేషణా విధానం చరిత్ర పరిణామం మీద ఆధారపడింది. మార్పు అంతర్నిహితమైన సామాజిక సంబంధాల మీద ఆధారపడి ఉంటుందని, అది మానవుల ఆచరణ మీద ఆధారపడి ఉంటుందని, సమాజం కొన్ని పరిమితులకు లోబడి మారుతూ ఉంటుందని, "వాస్తవ పరిస్థితుల మీద ఆధారపడి, గత పరిణామ క్రమం మీద ఆధారపడి మారుతుంది" అని మార్క్స్ విశ్లేషించారు. చారిత్రక పెట్టుబడిదారీ విధానం కాని పెట్టుబడి దారీ విధానం ఏదీ లేదు. అందుకే పశ్చిమ యూరప్‌లో పెట్టుబడి దారీ విధానం ఎలా అస్తిత్వంలోకి వచ్చింది, అది ఎలా పనిచేస్తుంది, చివరకు ఎక్కడికి దారి తీస్తుందని చారిత్రక దృష్టితో నిర్దుష్టంగా నిరూపించగలిగాడు.

మార్క్స్ దృష్టిలో మార్పును కోరుకునే చారిత్రక శక్తులకు, వ్యవస్థాపరమైన శక్తులకు మధ్య నిరంతరం ఘర్షణ జరుగుతూ ఉంటుంది. అదే సమయంలో ఒక సమతుల్యత సాధించడానికీ ప్రయత్నం జరుగుతూ ఉంటుంది. దానివల్ల ప్రయోజనాత్మకంగా కలిసికట్టుగా ఉన్న శక్తులు విడిపోయి విశిష్టమైన మార్పుకు దోహదం చేస్తాయి. మార్క్స్ 1860లలో పెట్టుబడిదారీ విధానాన్ని ఎంత నిశితంగా పరిశీలించి నిర్దిష్ట సూత్రీకరణలు చేసినప్పటికీ ఆ తర్వాత ఆర్థిక వ్యవస్థలో, సమాజంలో విశేషమైన మార్పులు వచ్చాయి. అందుకని జరగవలసింది ఏమిటంటే మార్క్స్ పద్ధతిలో పరిశోధన కొనసాగిస్తూ ఆ పద్ధతికి మరింత పదును పెట్టడం. ఆయన శాశ్వత సత్యం చెప్తున్నానని అనలేదు. ఆయన విధానాన్ని విమర్శించాలనే కోరుకున్నాడు. తన పద్ధతిని సుసంపన్నం చేయడం కోసం మార్క్సిస్టు దృక్పథంతో విశ్లేషించాలని భావించాడు.

మార్క్స్ కాపిటల్ గ్రంథం మొదటి సంపుటం వెలువడి 150 సంవత్సరాలు గడిచాయి కనక వాస్తవ స్థితిగతుల ఆధారంగా

మార్క్స్ సూత్రీకరణలను పరిపుష్టం చేయాల్సిన అగత్యం ఉంది. ప్రస్తుతం పెట్టుబడిదారీ వ్యవస్థ విశ్వవ్యాప్తమైంది. పెట్టుబడిదారీ వ్యవస్థ పరిధి, దాని పరిమిత పరిధి ఆర్థికంగా, రాజకీయంగా, సైనికంగా దాని కేంద్రానికి అనుగుణంగానే ఉంటుంది. ఈ పరిధిలో దోపిడీ, వ్యవస్థలో ఏర్పడే మిగులును పంచుకోవడంలో అధికా ర వర్గాలకు, వృత్తినిపుణులకు ఎక్కువ వాటా దక్కుతుంది. అదే ఈ వ్యవస్థలోని ప్రధానాంశం. మాంద్యం కనక ఏర్పడితే ఏకఛత్రాధి పత్యం వహించే బహుళజాతి కంపెనీలు విస్తరిస్తాయి. పెట్టుబడి ద్రవ్య రూప పెట్టుబడిగా మారుతుంది. ఇది అసలైన ఆర్థిక వ్యవస్థ ల మీద ప్రభావం చూపుతుంది. ఉన్న పెట్టుబడులపై లాభాలు రాకపోతే ఊహాపరమైన ఆర్థిక లాభాల కోసం అన్వేషిస్తారు.



"వాస్తవిక" ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో కార్మికులు ఈ వ్యవస్థ కేంద్రంలోకి వలస వెళ్తారు. బహుళజాతి సంస్థల పెట్టుబడులు పెరుగుతాయి. అసమానమైన రంగాల్లో పెట్టుబడి పెట్టడంవల్ల దోపిడీ మరింత పెరుగుతుంది. ఈ సంస్థల్లో శ్రమ శక్తి వల్ల సమకూరే లాభాలను కాజేస్తారు. వస్తూత్పత్తి పరిశ్రమలను స్వాధీనం చేసుకోవడమే కాకుండా ఈ దోపిడీ రైతులకు కూడా విస్తరిస్తుంది. అప్పుడు రైతుల లాభాలనే కాక, భూమి మీద వచ్చే కౌలును, వారి అప్పుల మీద వచ్చే వడ్డీని, వారి వేతనాల్లో కొంత భాగాన్ని కూడా కబళిస్తారు.

ఈ పరిస్థితుల్లో కాపిటల్ గ్రంథమే రాయవలసి వస్తే, విమర్శనాత్మకంగా విశ్లేషించవలసి వస్తే కచ్చితంగా అది మార్క్స్ రాసిన మూడు భాగాల కాపిటల్‌కన్నా భిన్నంగానే ఉంటుంది. అంతర్జాతీయ స్థాయిలో వర్గ విశ్లేషణ, శ్రమ శక్తి విలువ, మొదలై నవన్నీ వేరుగానే ఉంటాయి. పేద రైతులను, చిన్న వస్తువులను తయారు చేసే వారిని పెట్టుబడి దోపిడీ చేస్తుంది. ఇంటి పని చేసే వారికి ఏ వేతనమూ లేదు. సహజ వనరులను పెట్టుబడి కొల్లగొ డ్తోంది. పర్యావరణం కూడా సామ్రాజ్యవాద లక్షణాలను సంతరిం చుకుంటోంది. అస్థిరత, సంక్షోభం, గిరాకీ మొదలైనవన్నీ ఆర్థిక వ్యవస్థలను ప్రభావితం చేస్తున్నాయి. ద్రవ్య పెట్టుబడి రాజ్యమేలు తోంది. రాజ్య వ్యవస్థలు పెట్టుబడిని నిర్దేశిస్తున్నాయి. పౌర ప్రభు త్వాలు, సైనిక పాలనలు, సామ్రాజ్య వాదం ప్రధానమైన వైరుధ్యా లుగా తయారయ్యాయి.

మార్క్స్ జన్మించి రెండు వందల ఏళ్లు అయిన తర్వాత చేయవలసిన పని ఆయన ఆలోచనా విధానం, పద్ధతి ప్రకారం ప్రస్తుత పరిస్థితిని అంచనా వేయడం. దీనికి చారిత్రక భౌతిక వాదం, గతితార్కిక భౌతికవాద సూత్రాలను అన్వయించవలసి ఉంటుంది. మార్క్స్ నుంచి మనకు అందిన వారసత్వాన్ని వినియో గించుకుని ప్రతి అంశాన్నీ విమర్శనాత్మకంగా చూడవలసి ఉంటుంది. మార్క్సిజాన్ని యాంత్రికంగా అనువర్తింప చేస్తే ప్రయోజనం లేదు. ప్రపంచాన్ని పునర్నిర్వచించడం, సామాజిక విప్లవం ద్వారా సోషలిజం సాధించడం ప్రస్తుత లక్ష్యం. ఎందుకంటే పెట్టుబడి, పెట్టుబడిదారీ విధానం మరో 200 ఏళ్లు కొనసాగితే మానవజాతే మిగలకపోవచ్చు. ❑

# కార్పొరేట్లకు కట్టబెడుతున్నది ఎవడబ్బ సొమ్మనీ..!

(29వ పేజీ తరువాయి)

ఆందోళనలు తలెత్తకముందే సెస్‌లను కొంత మేరకు తగ్గించటంతోపాటు తమ పాలిత రాష్ట్రా ల్లో వాట్‌ను కొంత మేరకు తగ్గించిన సంగతి తెలిసిందే. దీనికి కేంద్ర ప్రభుత్వం చేసిన త్యాగం అని పేరు పెట్టారు. అంతర్జాతీయ ధరలను బట్టి ప్రతిరోజు చమురు ధరల తగ్గింపు లేదా పెంపన్నది ఒక విధానంగా చెప్పారు. ఏప్రిల్ ఆరు నుంచి వాటి ధరల ను స్తంభింపచేశారు. సదరు విధానం నుంచి వైదొలి గినట్లా లేక మరొకటా ? ఉచిత విద్యుత్, రైతాంగ రుణాల రద్దు, వివిధ సంక్షేమ కార్యక్రమాలకు కొన్ని రాష్ట్ర ప్రభుత్వా లు వెచ్చిస్తున్న మొత్తాలు కూడా త్యాగాల కిందకు రావా? అవి ఏటేటా పెరుగుతుంటే ఎంత కాలం భరించాలని కొందరు అంటు న్నారు. అందుకే విధానాల గురించి చర్చ జరగాలి, కొన్ని రాష్ట్రాలు ఎందుకు అమలు జరుపు తున్నాయి, కొన్ని ఎందుకు అమలు జరపటం లేదు ? విశ్వ గురువుగా నీరాజనాలు అందుకుంటున్న ప్రధాని నరేంద్ర మోడీ ఉచితాల గురించి హితవు చెప్పారు. అలాంటి వాటిని పెంపొందించే ధోరణికి అడ్డుకట్ట వేస్తూ ప్రతిన పూనాలని అన్నారు. ఉచితాలు దేశ హితం కోసం కాదు, దేశాన్ని వెనక్కు నెడతాయి. రాజకీయాల్లో స్వార్థం ఉంటే ఎవరైనా వచ్చి పెట్రోలు, డీజిల్ ఉచితంగా ఇస్తామని చెబుతారు. ఇలాంటి స్వార్థం వల్ల నిజాయితీగా పన్ను చెల్లించేవారి మీద భారం పడుతుంది. ఇది విధానం కాదు, అనైతికం అంటూ మాట్లాడారు. ఇదే మోడీ గారు తన ఏలుబడిలో చేస్తున్నదేమిటి ? ప్రోత్సాహకాలు, పన్ను ఎక్కువ గా ఉంటే ఎగవేత ఎక్కువగా ఉంటుందంటూ కార్పొరేట్లకు పన్ను తగ్గించి ఏటా కొన్ని లక్షల కోట్ల రూపాయలను కట్టబెడుతున్నారు. ఇది ఉచితమా అనుచితమా ? జనానికి రావాల్సిందాన్ని ధనికు లకు మళ్లించటమా ? 2014-21 సంవత్సరాలలో కార్పొరేట్ పన్ను 30 నుంచి 18శాతానికి తగ్గించారు. పోనీ దీన్ని సదరు కంపెనీలు తిరిగి పెట్టుబడులుగా పెట్టాయా ? అలాంటి దాఖలా ల్లేవు. పెట్టి ఉంటే దేశ వృద్ధి రేటు 8 నుంచి కరోనా ముందు నాలుగు శాతానికి ఎందుకు దిగజారినట్లు ? కొత్తగా ప్రవేశపెట్టిన పథకం ప్రకారం కొత్తగా పెట్టే సంస్థలకు కార్పొరేట్ పన్ను 15 శాతానికి పరిమితం చేశారు. ఎవడబ్బ సొమ్మనీ రామచంద్రా ! ❑

# గ్రాంసీ ఆలోచనలు-ఆచరణ



**బోడపట్ల రవీందర్**
**పత్రికా రచయిత**

> **'నిర్లిప్తులంటే నాకు నిలువెల్లా అసహ్యం. బతికి ఉండడమంటే, అటో ఇటో నిలబడడమే అన్నది నా నమ్మకం. నిజంగా సజీవులుగా ఉన్నవాళ్లు పౌరులుగా, పక్షపాతులుగా ఉండక తప్పదని నా విశ్వాసం. నిర్లిప్తత, నిరాసక్తతలు పరాన్నభుక్కులుగాను, పెడబుద్ధులుగాను మనుగడ సాగించడమే తప్ప అవి జీవలక్షణాలు కాదు. నిర్లిప్తత నమ్మడానికి వీల్లేని దుర్విధిలాంటిది. అది మన కార్యక్రమ ప్రణాళికను నాశనం చేస్తుంది. లోతుగా ఆలోచించి రూపొందించిన ప్రణాళికను నిర్లిప్తత తలకిందులు చేస్తుంది. అది మనసును శిథిలం చేస్తుంది. జనసమూహాలు, పట్టుదలను వదిలిపెట్టి నిర్లిప్తులుగా వ్యవహరిం చడం వల్లే మనలో కీడు దాపురిస్తుందని" గ్రాంసీ భావన.**

నేడు భారతదేశంలో ఆరెస్సెస్, బీజేపీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వ పాలన, ఇటలీలో ముస్సోలినీ నాయకత్వంలోని ఫాసిస్టు ప్రభుత్వ పాలనను గుర్తు చేస్తుంది. ఆరెస్సెస్, బీజేపీలు హిందూ జాతీయవాదం పేరుతో, హిందూ మత సంస్కృతి సంప్రదాయాలను, హిందువులను రక్షించే పేరుతో, గోరక్షక దళాలను ఏర్పాటు చేసి మైనార్టీలు, దళితులపై దాడులకు తెగబడుతున్నాయి. అనేక దేశాల్లో ఫాసిస్టు ధోరణులు వివిధ రూపాల్లో కొనసాగుతున్న కాలమిది. భారతదేశంలో కూడా హిందూత్వ శక్తులు తమ విద్వేష రాజకీయాలతో విషం చిమ్ముతున్న తరుణమిది. ఈ సమయంలో మన దేశానికే కాదు, ప్రపంచానికే గొప్ప ఉత్తేజం ఆంటోనియో గ్రాంసీ. ఆయన తన తుదిశ్వాస దాకా ఫాసిజంతో పోరాడి విప్లవ రాజకీయాలు, సోషలిస్టు వ్యవస్థలపై విశ్వాసం ప్రకటించిన మేధావి. ఇటాలియన్ కమ్యూనిస్టు పార్టీ నాయకుడు కార్ల్ మార్క్స్, ఎంగెల్స్, లెనిన్‌ల తరువాత అంతటి ప్రాసంగికత కల్గిన వ్యక్తి గ్రాంసీ.

గ్రాంసీ జీవితం, త్యాగాలు, బాల్యంలోని సామాజిక, రాజకీయ పరిస్థితులు, అతనిపై వాటి ప్రభావాలను తెలుసుకోవాలి. 1891 జనవరి 22న ఓ దిగువ మధ్య తరగతి కుటుంబంలో జన్మించి, 46 ఏండ్ల చిరు ప్రాయంలోనే మరణించిన గ్రాంసీ, ఏడుగురు అన్నదమ్ముల్లో నాలుగోవాడు. 11 ఏండ్ల వయసులోనే కుటుంబ పోషణకోసం చదువు మానేసి పనిలో చేరాడు. ఒక కిలో రొట్టె కొనుక్కోడానికి సరిపడా 8 లీరాల కోసం రోజుకు 10 గంటలు పనిచేసేవాడు. తనకంటే ఎక్కువ బరువున్న రిజిస్టర్లు మోసేవాడు. ఒంటి నొప్పులతో రాత్రంతా ఏడ్చేవాడు. కొంతకాలం తరువాత పోర్టు కార్మికుడైన తన పెద్దన్న గెనరో గ్రాంసీతో కలిసి ఉంటూ చదువు కొనసాగించాడు. చిన్నతనం నుంచే క్షయ వల్ల వెన్నెముక దెబ్బ తిని జీవితాంతం బాధను అనుభవించాడు గ్రాంసీ. సోదరుడు గెనరో సోషలిజంపై ఆకర్షితుడై, సార్డీనియన్ పోరాటాల పట్ల ఆసక్తి చూపుతాడు. ఇలా అన్న ఆలోచనలే గ్రాంసీపై ప్రభావం చూపాయి. 1910లో సార్డీనియాను వదిలి ఉన్నత చదువుల కోసం తురిన్‌లోని యూనివర్శిటీకి వెళ్ళాడు. అక్కడ ముందుగా సోషలిస్టు పార్టీ, తరువాత ఇటాలియన్ కమ్యూనిస్టు పార్టీలో చేరాడు. అక్కడే పార్టీ ఆఫీస్ బేరర్‌గా బాధ్యతలు స్వీకరించి, కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ ప్రధాన కేంద్రంగా ఉన్న మాస్కోలో ఇటలీ ప్రతినిధిగా పనిచేసాడు. తరువాత ఇటలీకి తిరిగి వెళ్ళి, దేశ రాజకీయాల్లో పాల్గొంటూ, పార్లమెంట్‌లో ప్రతిపక్ష నాయకుడయ్యాడు. తన ప్రభావాన్ని సహించలేని నియంత ముస్సోలిన్ పాలనలో దాదాపు జీవితమంతా జైలులో మగ్గాడు. అతడి మెదడు పనిచేయకుండా చేయాలనే తలంపుతోనే అంత సుదీర్ఘకాలం నిర్బంధించారంటే ఆ మెదడు ఎంత పదునైనదయి ఉండాలి!

అయితే ఇటలీలో ఫాసిస్టులు ఎందుకు దూసుకుపోతున్నారు, కమ్యూనిస్టులు ఎందుకు ముందుకు పోవడం లేదనే విషయాలపై గ్రాంసీ జైలులో ఆలోచించడం మొదలుపెట్టాడు. కమ్యూనిస్టులు రాజకీయాధికారం, ఆర్థిక డిమాండ్లను మాత్రమే సాధిస్తే సరిపోదని, పాలక వర్గాలు నిర్బంధంతో మాత్రమే కాక, ప్రజల ఆమోదంతో కూడా పాలించేందుకు సాధనంగా ఉన్న బావజాలం గురించి కమ్యూనిస్టులు అర్థం చేసుకోవాలని అంటాడు. తమ చర్యలు న్యాయసమ్మతమని వారు దేశ ప్రజలను మెప్పించాలని అంటాడు. ఫాసిజమనేది పాత పెట్టుబడిదారీ వ్యవస్థకు ఒక కొత్త రాజకీయ రూపమైనప్పటికీ, అనాగరిక ఫాసిజంను ఎదుర్కోడానికి పాత వ్యూహాలు, ఎత్తుగడలు చాలవని గ్రాంసీ అభిప్రాయపడ్డాడు. ఇటలీ ప్రభుత్వం ఎమర్జెన్సీని విధించినపుడు, గ్రాంసీ స్విట్జర్లాండ్ వెళ్ళాలని పార్టీ నిర్ణయిస్తే, ఇటలీ నుంచి వెళ్ళేందుకు తిరస్కరించాడు.

పదకొండేళ్ల జైలు నిర్బంధంలో గ్రాంసీ, తన ఆలోచనలను

2,848 పేజీల్లో (ప్రిజన్ నోట్ బుక్స్) నిక్షిప్తం చేయడం ద్వారా 'రెండు దశాబ్దాలపాటు తన మెదడును పనిచేయ కుండా చేసే శిక్ష విధించాలన్న' పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోరికను వమ్ము చేశాడు. ముందుగా గ్రాంసీ మేధావుల గురించి వివరిస్తూ రాజకీయ కార్యకర్తలు, నిర్వాహకులు, ఉద్యమ నాయకులు కూడా మేధావులేనని అభిప్రాయపడ్డాడు. భౌతిక, బౌద్ధిక కార్యకలాపాల మధ్య తేడాలు లేవని భావించాడు. ఆయన ఆలోచన ప్రకారం, భిన్న వర్గాలకు చెందిన మేధావులను సృష్టించే చారిత్రక క్రమాలు భిన్నంగా ఉంటాయి. ప్రతీ సామాజిక సమూహం, తన భిన్న దశలకు చెందిన ఒకటి లేదా అంతకంటే ఎక్కువ రకాల మేధావులను సృష్టిస్తుంది. ఈ మేధావులు ఆ సమూహానికి ఒక ప్రత్యేక గుర్తింపును, ఐక్యతను సమకూర్చుతారు. తన స్వంత మేధావి వర్గం ద్వారానే, ప్రతీ సామాజిక సమూహం సామాజిక, రాజకీయ రంగాల్లో తన పాత్రను అర్థం చేసుకుంటుంది. ఉదాహరణకు, పెట్టుబడిదారీ వ్యవస్థకు చెందిన ఎంట్రి ప్రెన్యూర్ (స్వేచ్ఛా వాణిజ్యం చేసే మధ్యవర్తి లేదా వర్తకుడు) తనతోపాటే సాంకేతిక నిపుణులను, ఆర్థికవేత్తలను, నూతన సంస్కృతి నిర్వాహకులను, న్యాయవ్యవస్థను సృష్టిస్తాడు. అతడు ఒక ఉన్నతమైన సామాజిక నిర్మాణానికి ప్రాతినిధ్యం వహిస్తాడు. ఇతనికి ఉన్నతస్థాయి ఉత్పత్తి విధానాన్ని నిర్దేశించే లక్షణంతోపాటు మేధోపరమైన సాంకేతిక పరిజ్ఞానం ఉంటుంది. తన రంగంతోపాటు ఇతర రంగాలకు సంబంధించిన పరిజ్ఞానం కలిగి ఉంటాడు. ప్రజలను సమీకరించే సామర్థ్యం ఉంటుంది. తన వ్యాపారంలో పెట్టుబడి పెట్టే వారిని సమీపించే సామర్థ్యం ఉంటుంది. తాను ఉత్పత్తి చేసే సరుకులను కొనుగోలు చేసే వినియోగదారుల విశ్వాసాన్ని పొందుతాడు. ఇలా ప్రతీ నూతన సామాజిక వర్గం తనతోపాటు తన వర్గ మేధావులను సృష్టించుకుంటుంది అంటాడు గ్రాంసీ.


కార్మికులు వార్తా పత్రికను ఎంచుకోవడం గురించి గ్రాంసీ కొన్ని హెచ్చరికలు చేశాడు. 'ఏ విషయంలోనైనా పెట్టుబడిదారీ పత్రికలతో ఏకాభిప్రాయంతో ఉండటాన్ని కార్మికులు తక్షణమే విడనాడాలి. పెట్టుబడిదారీ పత్రికలు కార్మికవర్గ ప్రయోజనాలకు, భావాలకు వ్యతిరేకంగా పోరాటాన్ని సాగించే సాధనాలని కార్మికులు గ్రహించాలి. ఆ పత్రికల్లో ప్రచురించే ప్రతీ విషయం ఒకే అభిప్రాయంతో ప్రభావితమై ఉంటుంది. ఆధిపత్యవర్గాలకు అనివార్యంగా సేవ చేసేలా మన ఆలోచనలను నిర్మిస్తాయి. పెట్టుబడిదారీ పత్రికల్లో మొదటి నుంచి చివరి వాక్యం దాకా ఈ లక్ష్యాలనే నెరవేర్చేట్టు ఉంటాయి' అంటాడు.

ఇటలీలో ఫాసిజం ఆవిర్భావానికి తోడ్పడిన రోమన్ సాంస్కృతిక భావజాలం గ్రాంసీని ఆలోచింపచేసింది. ఫాసిజం పేరుతో తీవ్ర జాతీయభావం ఏర్పాటులో ముస్సోలినీ ప్రేరేపించిన రోమన్ సంస్కృతి పోషించిన పాత్రను గ్రాంసీ గ్రహించాడు. మొదటి ప్రపంచ యుద్ధానంతరం ఇటలీలో ఏర్పడిన ఆర్థిక మాంద్యం, రాజకీయ అస్థిరత, శ్రామికోద్యమాల వైఫల్యాల నేపథ్యంలో సాంస్కృతిక ఆధిపత్యం నిర్వహించే పాత్రను అంచనా వేశాడు. రాజకీయ రంగంలో ఆధిపత్యవర్గాలు ఆధిపత్యాన్ని బల ప్రయోగంతో సాధించగలిగితే, సాంస్కతికరంగంలో పౌర సమాజం అంగీకారంతో సాధించగలుగుతాయని సూత్రీకరణ చేశాడు. పాలక వర్గాల సాంస్కతిక భావజాలమే అనుసరణీయమని, అదే తమ భావజాలం అని పౌరసమాజం చేత అంగీకరింపచేయడాన్ని 'సాంస్కతిక ఆధిపత్యం'గా(కల్చరల్ హెజిమోని) గ్రాంసీ నిర్వచించాడు. సోషలిస్ట్ వ్యవస్థలో శ్రామికవర్గాలు తమ సాంస్కృతిక ఆధిపత్యాన్ని నెలకొల్పుకోగలగాలని సూచించాడు. ఈ క్రమంలో కలుపుకొని పోవాల్సిన ఉపశ్రేణుల్ని ప్రస్తావిస్తూ వారిని 'సబ్ ఆల్టర్న్' వర్గాలుగా పేర్కొన్నాడు. ఈ వర్గాల ఐక్యత రాజ్యాధికార స్థాపనను సుగమం చేస్తుందని చెప్పాడు. ఇలాంటి సమయంలోనే సమాజంలోని మౌలిక వర్గమైన కార్మికవర్గం, సామాజిక ఉపశ్రేణులను సమీకరించడం ద్వారా సాంస్కతిక ఆధిపత్యాన్ని నెలకొల్పవచ్చునని, అందు కోసం కార్మికవర్గం స్వప్రయోజనాలకే పరిమితం కాక, ఉపశ్రేణులందరి ప్రయోజనాలకు గొంతుక ఇవ్వడానికి వీలుగా తన ప్రయోజనాలను కొన్నింటిని వదులుకోవాలని, అది మొత్తం జాతి ప్రయోజనాలను ప్రతిబింబించే శక్తిగా రూపొందాలని ప్రకటించాడు. ఆ క్రమంలోనే వారి భాష, సంగీత సాహిత్యాలు, కళలూ, జానపద సాంప్రదాయాలు నిర్మాణాత్మక పాత్ర పోషిస్తాయని అన్నాడు.

గ్రాంసీ తన జైలు రాతల్లో దాదాపు 250 పేజీలు ఫాసిజం గురించే రాశాడు. ఆయన మొదట్లో ఫాసిజాన్ని ఒక రాజకీయ పార్టీగానే చూడడం వల్ల, దానికి ఉన్న ప్రజాపునాది ఏమిటో, దానిని ఏ విధంగా దెబ్బ తీయాలనే దాని పైనే కేంద్రీకరించాడు. కమ్యూనిస్టులు బలపడితే ఫాసిస్టులు బలహీనపడి కనుమరుగవుతారని భావించాడు. కానీ అనతికాలంలోనే ఫాసిజం ఒక రాజకీయ పార్టీ కాదని అర్థమైంది. ఎందుకంటే దానిలో ఇటాలియన్ సమాజానికి ఉండే సహజ లక్షణాలు, సంస్కృతి ప్రతిబింబిస్తున్నాయి. ఇది ప్రజల ఆమోదంతో జరుగుతున్న ప్రక్రియ అని గ్రాంసీకి అర్థమైంది. అందుకే ఫాసిస్టులను రాజకీయంగా కూలదోయడం ఎంత ముఖ్యమో, సంస్కృతిని ఫాసిస్టు సాధనంగా ఉపయోగించే పద్ధతిని ఓడించడం అంతే ముఖ్యమని భావించాడు. ఆర్థిక సంబంధాల పునాదిపై ఆధారపడి మాత్రమే రాజకీయ, సామాజిక వ్యవస్థలు నిర్మితం కావనీ, అవి పరస్పర ఆధారితాలనీ అంటాడు గ్రాంసీ. ఆర్థిక సంబంధాలు, రాజకీయ సామాజిక సంబంధాలను ఒకవైపు రూపొందిస్తూ, మరోవైపు నిర్వహిస్తే, రాజకీయ సామాజిక సంబంధాలు ఒకవైపు ఆర్థిక సంబంధాలను రూపొందిస్తూ మరోవైపు నిర్వహిస్తాయని అన్నాడు. పాలకవర్గాల భావజాలాన్నే, ప్రజల భావజాలంగా అంగీకరింప చెయ్యడంలో బూర్జువా వర్గం విజయం సాధిస్తుంది కాబట్టి, దానికి ప్రత్యామ్నాయంగా శ్రామిక వర్గాలు, ఇతర సామాజిక వర్గాలను కలుపుకుని తామే సాంస్కృతిక ఆధిపత్యాన్ని నెలకొల్పాలని గ్రాంసీ అభిప్రాయపడ్డాడు. (మిగతా 39వ పేజీలో)

# వర్తమానంతో నడచిన చరిత్రకారుని ఆత్మకథ

దాదాపు తొంభై యేళ్లు జీవించిన ఔరంగజేబ్ జీవిత చరిత్ర రాస్తూ ప్రముఖ చరిత్రకారుడు జాదూనాథ్ సర్కార్ 'ఔరంగజేబ్ జీవిత చరిత్ర ఒక శతాబ్దపు భారతదేశ చరిత్ర' అంటాడు. అతను భారతదేశ సార్వభౌముడు కాబట్టి అతని చరిత్రే దేశచరిత్ర అని చరిత్రకారుడు అనగలిగి ఉండవచ్చు. సార్వభౌముడైనా సామాన్యుడైనా ఒక వ్యక్తి చరిత్ర సమాజ చరిత్ర అవుతుందా అంటే దేశమంటే మట్టి కాదు మనుషులని అనుకున్నప్పుడు మనుషుల చరిత్రే దేశ చరిత్ర అవుతుంది. మామూలు మనిషికి తాను చరిత్ర నిర్మాతనని తెలీదు. తన గమనం సమాజ గమనంలో కలిసి ఉంటుందనీ సమాజ గమనం తన గమనం లేకుండా పరిపూర్ణం కాదని కూడా తెలీదు. ఈ స్పృహ కలిగి ఉండి తన జీవితాన్ని ఒక వ్యక్తి అంచనా వేసుకోగలిగితే సరి. లేకపోతే ఆ పని చరిత్రకారుడు చేస్తాడు. అట్లా తన జీవితాన్ని విశ్లేషణ చెసుకుంటున్నది స్వయంగా చరిత్రకారుడే అయితే ఆ జీవిత కథకు 'నన్ను నడిపించిన చరిత్ర' అని పేరు పెడతాడు. అట్లానే పెట్టారు ఆధునిక ఆంధ్రదేశ అగ్రశ్రేణి చరిత్రకారుడు ఆచార్య వకుళాభరణం రామకృష్ణ, తన ఆత్మ కథనాత్మక జ్ఞాపకాల సంపుటికి.




**చిన్ననాట జట్కాలు పోయి బొగ్గు బస్సులు, పూట కూటిళ్లు పోయి హొటళ్లు వచ్చినపుడు మారుతున్న సమాజాన్ని గుర్తించటం మొదలు, 1990ల తర్వాత సాంకేతిక విద్య ప్రాముఖ్యం పెరిగి ఇంజనీరింగ్ చదివిన దిగువ మధ్య, మధ్య తరగతి అమెరికా వెళ్లడంతో కొత్త విలువల నూతన సంపన్న వర్గం ఆవిర్భవించిందాకా ప్రస్తావించారు. కోస్తాంధ్ర రాయలసీమకు చెందిన ఈ వర్గం ఈ డబ్బును హైదరాబాద్‌లో కొత్త పెట్టుబడులుగా పెట్టడంతో తెలంగాణ రాష్ట్రోద్యమం ఊపందుకుందని పసికట్టారు. అంతర్జాతీయంగా అమెరికాలో భారతీయులు ద్వితీయశ్రేణి పౌరులుగానే చూడబడడాన్ని, అమెరికా నల్ల జాతి సమస్యను పరిష్కరించుకోలేకపోవడాన్ని ప్రస్తావించారు.**

దేశానికి స్వాతంత్ర్యం వచ్చేనాటికి తొమ్మిదేళ్ల వయసున్న వకుళాభరణం రామకృష్ణ స్వతంత్ర భారతదేశ ఆశయాలతో, గమనంతో, వైఫల్యాలతో ముడిపడిన ఆ తర్వాతి తన డెబ్బై ఇదేళ్ల జీవిత అనుభవాలను ఈ పుస్తకంలో పంచుకున్నారు. ఊహ తెలిసే నాటికి చుట్టూరా వ్యాపించిన జాతీయోద్యమ ఉత్తరదాయిత్వం (legacy) ఇచ్చిన జాతీయ వాద, ప్రజాస్వామిక, లౌకిక, వామపక్ష భావాలు ఇచ్చిన వెలుగులో మొదలైన జీవితం సాధించిన విజయాలను, ఎదుర్కొన్న ఒడిదుడుకులను, వర్తమానంలో చెల్లాచెదరై పోతున్న స్వప్నాల మధ్య నిలుపుకుంటున్న ఆశలను చరిత్ర విద్యార్థిగా, చరిత్ర పరిశోధకుడిగా, చరిత్ర ఆచార్యుడిగానే కాక బాధ్యతగల పౌరుడిగా కూడా వ్యాఖ్యానించారు. మొత్తం ప్రయాణానికి శాస్త్రీయ దృక్పథంతో తనను నడిపించిన చరిత్రగా పేరు పెట్టినప్పటికీ వినయం వల్ల విప్పి చూపని ఆధునిక ఆంధ్రదేశ చరిత్ర పరిశోధనకు ఆయన వేసిన కొత్తదారులు కొన్ని మనకు ఇందులో కనిపిస్తాయి.

ఇసుకలో అక్షరాలు దిద్దుకుని, రోజూ గ్రామం నుంచి రానుపోను ఎనిమిది మైళ్లు నడచి, చదువు సరిగ్గా సాగక, పరీక్షల సమయంలో పూటకూటి ఇంట్లో తింటూ, తెలిసిన ఉపాధ్యాయుల ఇళ్ల అరుగుల మీద పడుకుని అత్తెసరు మార్కులతో యస్‌యస్‌యల్‌సి పాసైన వకుళాభరణం రామకృష్ణమాచార్యులు అనే శ్రీవైష్ణవ కుటుంబానికి చెందిన పేద అర్చకుని

కుమారుడు నాటి అభ్యుదయ వామపక్ష భావాల ప్రేరణతో పేరు చివర ఉన్న ఆచార్యులు అనే కులనామాన్ని వదిలివేస్తే అది కాస్తా స్వరూపం మార్చుకుని విశ్వవిద్యాలయ అధ్యాపకుడైనపుడు ఆచార్య వకుళాభరణం రామకృష్ణగా పేరు ముందుకు చేరిన వైచిత్రిని ఇందులో మనం గుర్తించవచ్చు. అయితే ఈ suffix, prefixగా మారిన చమత్కారం వెనుక చదువు పట్ల సడలని పట్టుదల, సహచరి లలిత నిరంతర ప్రోత్సాహమూ త్యాగమూ, ఆర్థిక సమస్యలకు లొంగని ఆత్మగౌరవం అసాధారణంగా కనిపిస్తాయి. అప్పటి నెల్లూరు జిల్లా దర్శి తాలూకా పొతకమూరు స్వంత ఊరు అయినా సమీపంలోని రామభద్రాపురం లో జన్మించిన రామకృష్ణ చదువు పాకల, కందుకూరు, నెల్లూరు, సింగరాయకొండల తర్వాత కావలి జవహర్ భారతిని చేరి, విశాఖ ఆంధ్ర విశ్వవిద్యాలయం మీదుగా న్యూఢిల్లీలోని ప్రతిష్ఠాత్మక జెయన్‌యూలో పరిశోధన చేసి అక్కడే కొంతకాలం అధ్యాపకత్వం నెరపే వరకూ యాత్ర గా సాగి ఒక శిఖరారోహణ ను తలపిస్తుంది.

1938లో జన్మించిన రామకృష్ణకు 1953 లోస్కూల్ ఫైనల్ పాస్ అయ్యే నాటికే నెల్లూరు సింగరాయకొండ ల్లో బలంగా ఉన్న కమ్యూనిస్ట్ భావాలు వంటబట్టడానికి తండ్రికీ, చిన్నాయనకూ కమ్యూనిస్ట్ పార్టీ పట్ల ఉన్న అభిమానం, వారికి ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాత సింగరాజు రామక్రిష్ణయ్యతో ఉన్న సాన్నిహిత్యంతోపాటు హైస్కూలులో బాలక్రిష్ణా రెడ్డి అనే టీచర్ ప్రభావం పడడం కారణమయ్యాయి. ఇక్కడ ఏర్ప డిన అభ్యుదయ భూమిక కావలి కళాశాలలో బలపడి ఆంధ్ర విశ్వవిద్యాలయంలో కేజి సత్యమూర్తి(కాబోయే శివసాగర్) పూనికతో విద్యార్థి యూనియన్‌కు వామపక్ష విద్యార్థి సంఘాల తరఫున అధ్యక్షుడిగా ఎన్నిక కావడానికీ తర్వాత జవహర్ లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో సామాజిక సాంస్కృతిక కోణం నుంచి వీరేశలింగం కాలం నాటి ఆంధ్రదేశ అధ్యయనం చేయడానికీ దోహదపడింది.

చిన్నతనంలో ఇంటి మీదుగా వెళుతున్న పీర్ల ఊరేగింపు పట్ల గౌరవ సూచకంగా లేచి నిలబడిన తండ్రి వెంకటాచార్యుల సంస్కారం, ఆడపిల్లల పట్ల దురుసుగా ప్రవర్తించిన స్కూలు అటెండరుకు దేహశుద్ధి చేసిన ఆదర్శ ఉపాధ్యాయుడి నిబద్ధత, కందుకూరులో ఉండగా అజాద్ హింద్ ఫౌజ్‌లో పని చేసి వచ్చిన సైనికుడు ఆ పతాకానికి రోజూ శాల్యూట్ చేస్తూ ప్రదర్శించిన దేశభక్తి, కరువు కాలంలో పిల్లలకు జొన్న సంకటి పెట్టి తనకు వరి అన్నం ముద్ద పెట్టిన భార్య పట్ల తన తండ్రి ప్రదర్శించిన ధర్మాగ్రహం, 1955 ఎన్నికల సమయంలో పాకల గ్రామానికి ప్రచారానికి వచ్చి జీపులో తనను సింగరాయకొండ వద్ద దింపిన పుచ్చలపల్లి సుందరయ్య ఔదార్యం, కాంగ్రెస్ అధ్యక్ష పదవి కోసం పఠాభి, బోస్‌ల మధ్య పోటీ జరిగిన త్రిపురి కాంగ్రెస్‌కు హాజరైన చిన్నాయన అప్పనాచార్యులు బోస్‌కు ఓటు వేసి చూపిన మార్గం వకుళాభరణం చిన్ననాటి వ్యక్తిత్వ నిర్మాణంలో పనిముట్లుగా ఉపకరించినట్లు అర్థమౌతుంది.

చదువుకున్న కావలి కళాశాలలోనే చరిత్ర అధ్యాపకత్వం, జెయన్‌యూలో నాలుగేళ్లపాటు పరిశోధన, బోధనలు, జవహర్ భారతి ప్రిన్సిపల్ బాధ్యతలు, హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో ఆచార్యత్వం, అక్కడే డీన్ ఆఫ్ స్టూడెంట్స్‌గా, డీన్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ అండ్ కమ్యూనికేషన్స్‌గా అదనపు బాధ్యతలు, అక్కడ ఉద్యోగ విరమణ తర్వాత నల్సర్‌లా విశ్వ విద్యాలయంలో ఎనిమిదేళ్లపాటు బోధనలను నాలుగున్నర దశాబ్దాలపాటు సాగిన వకుళాభరణం ఉద్యోగ జీవితంలోని ముఖ్య ఘట్టాలనుకుంటే వీటన్నిటిలో ఆ కాలపు రాజకీయ ఆర్థిక సామాజిక పరిణామాల ప్రభావం అల్లుకుపోయింది. కావలి కళాశాల అధ్యాపకుడిగా వున్న కాలంలోనే 1962 చైనాతో యుద్ధ సమయంలో కమ్యూనిస్ట్ అభిమానిగా తోటి అధ్యాపకులనుంచి వెలివేత నెదుర్కోవడం, శ్రీకాకుళ గిరిజన పోరాట (1967-69) ప్రభావం కావలి పరిసర ప్రాంతాలపై పడడం, 1970 లో విరసం ఆవిర్భవించినపుడు, దాని మొదటి కార్యదర్శిగా తనను alter egoగా చెప్పుకున్న తన అధ్యాపకుడూ తర్వాత సహాధ్యాపకుడూ అయిన కేవీయార్ ఎంపిక కావడం, 1975లో ఎమర్జెన్సీ విధించినపుడు తమ ఇంట్లో ఉండగానే ఆయన అరెస్ట్ కావడం రామకృష్ణని చరిత్రలో భాగం చేశాయి. ఆయన వర్తమానంతో చేసిన సంభాషణలో 1955 ఓటమితో మొదలైన కమ్యూనిస్టుల పతనం 1964 చీలికతో మరింత దిగజారడం నుంచి ఇందిరాగాంధీ హత్య, రాజీవ్ గాంధీ దుర్మరణం, జాతీయ స్థాయిలో మండల్, మందిర్ ఉద్యమాలు,బాబ్రీ మసీదు విధ్వంసం, పీవీ సరళీకరణ విధానాలు, వారసత్వ ఊబిలో ఇరుక్కుపోయిన కాంగ్రెస్ పార్టీ, ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ, సారా వ్యతిరేకోద్యమం, నక్సలైట్లతో చర్చలు, తెలంగాణ రాష్ట్ర ఉద్యమాలు, చివరికి మతతత్వ శక్తుల విజృంభణతో కేంద్రంలో బీజేపీ అధికారం కైవసం చేసుకోవడం దాకా చర్చకు వచ్చాయి.

దాదాపు అరవై యేళ్ల విద్యార్థి, ఉద్యోగ జీవితంలో వకుళాభరణంకు తారసపడిన అధ్యాపకులు, సహాధ్యాపకులు, సమకాలీనులు, అధికారులు, విద్యార్థుల పట్టిక చూస్తే ఎంత మేథో పూరితమూ చైతన్యవంతమూ అయిన పరిసరాలలో ఆయన జీవించారో అర్థమౌతుంది. వాటి నుంచి వేడినీ వెలు తురునూ గ్రహించిన ఆయన అనతికాలంలోనే ఆ పరిసరాలను తన అస్తిత్వంతో నిబద్ధతతో మరింత జాజ్వల్య మూ తేజోవంతమూ చేయడం కనిపిస్తుంది. కావలి కళాశాలలో భుజంగరాయ శర్మ, పెద్దాడ రామస్వామి, వేదుల సత్యనారాయణశాస్త్రి లాంటి వారి వద్ద చదువుకున్న ఆయన వారికి సహోద్యోగి అయి

కళాశాల క్లిష్ట పరిస్తితుల్లో ఉన్నపుడు వారిలో కొందరి తర్వాత ప్రిన్సిపల్ అయి వారు విఫలం అయినచోట విజయవంతం కావడం చూడవచ్చు. జవహర్లాల్ నెహ్రూ విశ్వ విద్యాలయం లో సర్వేపల్లి రాధాకృష్ణన్ కుమారుడు ప్రొఫెసర్ సర్వేపల్లి గోపాల్ వద్ద పరిశోధన చేసిన వకుళాభరణం ఒక ఏడాది పాటే అయినా ఆయన స్థానంలో ఆ విశ్వవిద్యాలయంలో ఆచార్యత్వం చేయడం గురువులైన రొమిలా థాపర్, సవ్యసాచి భట్టాచార్య, బిపన్ చంద్ర, కేయన్ పణిక్కర్ లాంటి అగ్రశ్రేణి చరిత్రకారులు ఆయన సహాచార్యులవడం అటువంటిదే. జే యన్‌యూ పరిశోధక విద్యార్థిగా 1972లో మొదటిసారి ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్‌కు హాజరైన ఆయన 1988 నాటికి దానికి కార్యదర్శిగా జాతీయస్థాయి గుర్తింపు పొంది వరుసగా మూడేళ్లు మతతత్వశక్తుల తీవ్ర ప్రతిఘటనలను ఎదుర్కొని గోరఖ్‌పూర్, కలకత్తా, న్యూఢిల్లీలలో వార్షిక సభల ను విజయవంతంగా నిర్వహించడం దేని నుంచి ఏమి గ్రహిస్తామో దాన్ని దానికి తిరిగి ఇచ్చి కాపాడుకోవడమే. 1976లో తన గురువు మలిరెడ్డి పట్టాభిరామిరెడ్డి ప్రారంభిం చిన ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్‌కు వ్యవస్థాపక సభ్యుడిగా మొదలై, మూడేళ్లు కార్యదర్శిగా ఉండి, కరోనా కాలం దాక నలభై రెండేళ్లపాటు వార్షిక సభలు నిర్విఘ్నంగా జరపడంలో వార్షిక సంచికలు వెలువరించడంలో చూపిన, చూపుతున్న అంకితభావం చరిత్ర రచన ఎంత ముఖ్యమో దాన్ని కాపాడు కోవడానికి ఒక వ్యవస్థను నిలబెట్టుకోవడం అంతే అవసరమని గుర్తించడమే. జెయన్‌యూలో తనకు తెరుచుకు న్న ఆధునిక ఆంధ్రదేశ పరిశోధనా గవాక్షాలను హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో ద్వారాలుగ మలిచి తెరిచి స్వేచ్ఛగా గాలీ, వెలుతురు ప్రసరించేటట్టు చెయ్యడమూ అటువంటిదే. ఎనిమిది సంపుటాలుగా ఆంధ్రప్రదేశ్ సమగ్ర చరిత్ర సంస్కృ తుల ప్రచురణ, తొమ్మిదవ సంపుటిగా అధారాల ప్రచురణ అనే బృహత్తర ప్రాజెక్ట్‌కు ప్రధాన సంపాదకుడుగా ఉండడం ఎవరికైనా కృతజ్ఞత వల్లనే సాధ్యపడుతుంది.

బోధన, పరిశోధనల మీద మరింత శ్రద్ధ పెట్టాలనుకున్న ప్రతి సందర్భంలో తనను నిర్వహణా బాధ్యతలు చుట్టుకోవ డం వకుళాభరణంను అసంతృప్తికి గురిచేశాయి. కానీ, వ్యవస్థకు enlightened administrator లభించి మేలే జరిగింది. ఇరవయ్యో శతాబ్దపు మొదటి అర్థభాగానికి (1938-50), రెండవ అర్థభాగానికి (1951-2000), ఇరవ య్యొకటో శతాబ్దపు మొదటి అర్థ భాగానికీ (2001-2022) అంటే మూడు యాభైలకు విస్తరించిన ఎనభై నాలుగేళ్ల జీవితంలో సామాజిక రాజకీయ సంస్కృతిక రంగాల్లో సంభ వించిన పరిణామాలకు ప్రత్యక్షసాక్షిగా వాటిని వ్యాఖ్యానిం చారు వకుళాభరణం. చిన్ననాట జట్కాలు పోయి బొగ్గు బస్సులు, పూట కూటిళ్లు పోయి హొటళ్లు వచ్చినపుడు మారుతున్న సమాజాన్ని గుర్తించటం మొదలు, 1990ల తర్వాత సాంకేతిక విద్య ప్రాముఖ్యం పెరిగి ఇంజనీరింగ్ చదివిన దిగువ మధ్య, మధ్య తరగతి అమెరికా వెళ్లడంతో కొత్త విలువల నూతన సంపన్న వర్గం ఆవిర్భవించిందాకా ప్రస్తావించారు. కోస్తాంధ్ర రాయలసీమకు చెందిన ఈ వర్గం ఈ డబ్బును హైదరాబాద్‌లో కొత్త పెట్టుబడులుగా పెట్టడంతో తెలంగాణ రాష్ట్రోద్యమం ఊపందుకుందని పసికట్టారు. అంత ర్జాతీయంగా అమెరికాలో భారతీయులు ద్వితీయశ్రేణి పౌరులు గానే చూడబడడాన్ని, అమెరికా నల్ల జాతి సమస్యను పరిష్క రించుకోలేకపోవడాన్ని ప్రస్తావించారు. పునరేకీకరణ తర్వాత 1997 లో జర్మనీని సందర్శించిన రామకృష్ణ తూర్పు జర్మనీ ప్రజలు, మేధావులు చిన్న చూపు చూడబడడాన్ని పశ్చిమ జర్మన్ ల అహంకారాన్ని పేర్కొన్నారు. అక్కడ బోస్ మీద తన ప్రసంగానికి హాజరైన ప్రసిద్ధ చరిత్రకారుడు సుమిత్ సర్కార్ ఫాసిస్ట్ శక్తులతో చేతులు కలిపినంత మాత్రాన బోస్ ఫాసిస్ట్ కాదని అభిప్రాయ పడినట్టు చెప్పారు.

శాస్త్ర సాంకేతిక విద్య పట్ల పెరిగిన వ్యామోహం ప్రజల్లో ప్రభుత్వాల్లో సామాజిక శాస్త్రాల పట్ల తీవ్ర నిర్లక్ష్యానికి వివక్షకు దారితీసినపుడు రామకృష్ణ సాంస్కృతిక సేనాని అవతారమె త్తారు. భావ సారూప్యత గల వారినందరినీ కూడగట్టి సభలు నిర్వహించి తీర్మానాలు చేసి చరిత్ర ను అధ్యయన అంశంగా రద్దు చేయాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కు తీసుకునేటట్టు చెయ్యడంలో కీలక పాత్ర వహించారు. ఆ సందర్భంగా 'సామాజిక శాస్త్రాలకు కాలం చెల్లిందా ?' అనే పుస్తకానికి సంపాదకత్వం చేశారు.

రామకృష్ణలో ఈస్తటిక్స్ కు కొదువలేదు. ప్రేమించిన యువతిని శాఖాంతర వివాహం చేసుకోవడానికి పెద్దల అంగీకారం కోసం ఐదారేళ్లు ఓపికగా ఎదురు చూడగలరు. భార్యనూ ముగ్గురు పిల్లలను వదిలి పరిశోధనకు పూనుకున్న పుడు బెంగతో ఆయన గుండె చెమ్మగిల గలదు. ఇద్దరి దగ్గరా చదువుకున్న ఆయన విశ్వనాథది పండిత శైలి భుజంగరాయ శర్మది భావుక శైలి అనగలరు. 'మరువ లేను మరువలేను' అని ద్వారం భావనారాయణరావు 1959 లో లలిత గీతాన్ని ఆలపిస్తే అరవై ఏళ్ల తర్వాత కూడా దాన్ని పునరాలాపన చెయ్యగలరు. హైస్కూల్లో ఉండగానే వేషాలు వేసి నాటకాల పట్ల పెంచుకున్న అభిమానాన్ని ఆంధ్ర విశ్వవిద్యాలయ స్టూడెంట్ యూనియన్ ఛైర్మన్‌గా ఆంధ్రాభ్యుదయ ఉత్సవాల సందర్భంగా ఏర్పాట్లలో తలమునకలై ఉండీ కూడా నాటకం లో వేషం వేసి నిలుపుకోగలరు. కళాశాల విద్యార్థినులకు శిక్షణ ఇవ్వడానికి ప్రముఖ దర్శకుడు బీయన్ రెడ్డి పంపగా వచ్చిన వెంపటి చినసత్యంతో, పోటీలకు నాటకాల ఎంపికకు కళాశాలకు వచ్చిన ఆచంట జానకీరాంతో జీవితకాలం స్నేహం చెయ్యగలరు. మరుగున పడిన మహాగాయని రావు బాలసరస్వతితో చరిత్ర సభలకు ప్రార్థనా గీతం ఆలపింప

చెయ్యగలరు. ఫైన్ ఆర్ట్స్ డీన్‌గా మంగళంపల్లి బాల మురళీకృష్ణతో ఏర్పడిన పరిచయాన్ని ఇంటికి పిలిచి అతిథి మర్యాదలు చేసి రసమయం చేసుకో గలరు.

1967లో కళాశాల అధ్యాపకుడిగా స్టుడెంట్ సర్వీసెస్ అంతర్జాతీయ సదస్సులో పాల్గొనడానికి నెల రోజులపాటు చేసిన అమెరికా, యూరప్ పర్యటన తన జీవితాన్ని మలుపు తిప్పిందని చెప్పుకున్నారు వకుళాభరణం. దాని వల్ల తన జ్ఞాన నేత్రం విప్పారిందనీ గ్రహించారు. అధికారం కోసం కీర్తి కోసం ప్రాకులాడకూడదనీ, కష్టపడి పని చెయ్యాలనీ, మనుషుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలనీ నిర్ణయం తీసుకున్నారు. దాని ప్రభావం వల్లనేనేమో కళాశాల ప్రిన్సిపల్‌గా ఇంటివద్ద అటెండర్‌ను నిరాకరించారు.

జెయన్‌యూ పరిశోధక విద్యార్థిగా ఉత్తర భారదేశ వంటకాలు తినలేక దాదాపు పస్తులుంటున్న దశలో తోటి దక్షిణాది విద్యార్థులు ప్రత్యేక మెస్ కోసం అందోళన చెయ్యాలని ప్రతిపాదించినపుడు 'వేరు కుంపట్లు' విద్యార్థుల ఐక్యతను దెబ్బ తీస్తాయని వారిని ఒప్పించి ప్రయత్నాన్ని విరమింప చేసిన రామకృష్ణ అనంతర కాలంలో జరిగిన తెలంగాణా రాష్ట్ర ఉద్యమాన్ని సమర్థించడం మారుతున్న కాలానికి అనుగుణంగా తనను ప్రోగ్రెసివ్ గా నిలుపుకున్నారనడానికి ఉదాహరణ.

ఈ జ్ఞాపకాల పొడవునా రామకృష్ణ కూరిమి పంటగా కనిపిస్తారు. భార్య లలిత పట్ల అపారమైన ప్రేమ, ఆమె చేసిన పరిశోధన కృషి పట్ల గౌరవం అడుగడుగునా కనిపిస్తాయి. అమె మరణంతో పూరించలేని వెలితి, శూన్యం ఆవహించిన దశలో బ్రతికి ఉండగా ఆమె కోరిన కోర్కెను తీర్చడానికే ఈ జ్ఞాపకాలను రాసినట్టు చెప్పుకున్నారు. అమె గురించి ఎన్ని సార్లు ప్రస్తావించినా ఆయనకు తనివి తీరలేదనిపిస్తుంది. కాగా, స్నేహమంటే ఆయనకు జీవిత కాల స్నేహమే. అందుకు అనేక దృష్టాంతాలు ఈ జ్ఞాపకాల్లో దాగి ఉన్నాయి. మొదటి అమెరికా పర్యటనలో కలుసుకున్న తన స్నేహితుడి తల్లి మేరీ మోల్టన్‌ను తన అమెరికన్ మదర్‌గా భావించి ఉత్తర ప్రత్యుత్తరాలు నడిపి ముప్పై ఏడేళ్ల తర్వాత మళ్లీ వెళ్లి తనను గుర్తించలేని వృద్ధాప్యంలో ఉన్న ఆమెను కలిసి గుర్తుకు తెచ్చేందుకు ప్రయత్నించి విఫలం కావడం ఎంతటి కోరి తెచ్చుకున్న ఇష్టమైన మెలాంకొలీ !

దీన్ని ఆత్మకథగా కాక కేవలం జ్ఞాపకాలుగా మాత్రమే చెప్పడం వల్ల బహుశా కొన్నిటిని వదలివేసే అవకాశం ఆయనకు వచ్చి ఉండవచ్చు. ఈ నెమరువేత వల్ల సమాజానికి మహత్తరమైన ప్రయోజనం ఉంటుందనే భేషజానికి ఆయన పోలేదు కానీ అధ్యయన అంశంగా చరిత్ర తనను ఎట్లా నడిపించిందో చెబుతూ నడుస్తున్న చరిత్రలో తానెట్లా భాగమయ్యారో చెప్పారు. రెండు చరిత్రల్ని ఏకం చేసిన తీరు మార్గదర్శకంగా మిగిలింది. విద్యార్థిగా తాను బ్రిల్లియంట్‌ను కాదని చెప్పుకోవడానికి ఏమాత్రం సందేహించని రామక్రిష్ణకు తనలో ఉన్న ఏ లక్షణాలు విజయం తెచ్చి పెట్టాయో చెప్పుకోవడానికి అణకువ అడ్డు వచ్చింది. అది ఆయన వ్యక్తిత్వాన్ని ఇనుమడింప చేసింది కానీ మనకు ఖాళీని మిగిల్చింది. స్ఫురద్రూపం, స్నేహాభిలాష, సత్యనిష్ఠ, మృదువ్యక్తీకరణ, నిర్వహణా సామర్థ్యం, సమయ పాలన, సామాజిక సత్ సంబంధాలు ఆయన విజయ రహస్యాలు. వాటిని చెప్పకనే చెబుతున్నాయి ఈ జ్ఞాపకాలు.

ఆఖరున 'కథ ముగిసింది' అన్నారు రామకృష్ణ. ఆత్మకథలెప్పుడూ ముగియవు. జీవితం ముగిసే వరకూ ఆత్మకథ లెవరూ రాయలేరు. ఆత్మకథను 'ముగించి'న స్వీయ జీవిత చరిత్రకారుడు తన శేష జీవితాన్ని మూసి ఉంచలేడు. చరిత్ర దాన్ని చదువుకుని, రాసుకుని తన ఆత్మకథను పూర్తి చేసుకుంటుంది. ❑

**- కొప్పర్తి వెంకటరమణమూర్తి**

# గ్రాంసీ ఆలోచనలు-ఆచరణ

(35వ పేజీ తరువాయి)


అదేవిధంగా గ్రాంసీ, మనుషుల్లో ఉండే నిర్లిప్తత గురించి తన అభిప్రాయాలను నిర్మొహమాటంగా చెప్పాడు. 'నిర్లిప్తులంటే నాకు నిలువెల్లా అసహ్యం. బతికి ఉండడమంటే, అటో ఇటో నిలబడడమే అన్నది నా నమ్మకం. నిజంగా సజీవులుగా ఉన్నవాళ్లు పౌరులుగా, పక్షపాతులుగా ఉండక తప్పదని నా విశ్వాసం. నిర్లిప్తత, నిరాసక్తతలు పరాన్నభుక్కులుగాను, పెడబుద్ధులుగాను మనుగడ సాగించడమే తప్ప అవి జీవలక్షణాలు కాదు. నిర్లిప్తత నమ్మడానికి వీల్లేని దుర్విధి లాంటిది. అది మన కార్యక్రమ ప్రణాళికను నాశనం చేస్తుంది. లోతుగా ఆలోచించి రూపొందించిన ప్రణాళికను నిర్లిప్తత తలకిందులు చేస్తుంది. అది మనసును శిథిలం చేస్తుంది. జనసమూహాలు, పట్టుదలను వదిలిపెట్టి నిర్లిప్తులుగా వ్యవహరించడం వల్లే మనలో కీడు దాపురిస్తుందని" ఆయన భావన. నేడు భారతదేశంలో ఆరెస్సెస్, బీజేపీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వ పాలన, ఇటలీలో ముస్సోలినీ నాయకత్వంలోని ఫాసిస్టు ప్రభుత్వ పాలనను గుర్తుచేస్తోంది. ఆరెస్సెస్, బీజేపీలు హిందూ జాతీయవాదం పేరుతో, హిందూ మత సంస్కృతీ సాంప్రదాయాలను, హిందువులను రక్షించే పేరుతో, గోరక్షక దళాలను ఏర్పాటుచేసి మైనార్టీలు, దళితులపై దాడులకు తెగబడుతున్నాయి. రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూ, మనుధర్మ పాలనను సాగిస్తు న్నాయి. ఆరెస్సెస్, బీజేపీ పాలక వర్గాల ప్రజావ్యతిరేక సంస్కృతికి, ఒక ప్రత్యామ్నాయ సంస్కృతిని ప్రవేశపెట్టే దిశగా ప్రగతిశీల, ప్రజాస్వామిక, లౌకిక, సామాజిక, విప్లవ శక్తులు ఐక్యంగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైంది. ❑

# ‘నాస్తి యేషాం యశఃకాయే జరా మరణం భయమ్’

## సి.రాఘవాచారి సంపాదకీయాల సంకలనం.. రెండో సంపుటి పరిచయం

***‘నాస్తి యేషాం యశఃకాయే జరా మరణం భయమ్’ అన్నాడట భర్తృహరి తన ‘నీతిశతకం’లో. ‘రససిద్ధులై తన కవీశ్వరులు కలకాలం మాన్యులుగా నిల్చిపోతారు; ముసలితనం వల్ల, మృత్యువు వల్ల సంక్రమించే భయాలు ఈ యశఃకాయులకు వుండ”వన్నదే సుభాషితకర్త భావన. ఇది కేవలం కవీశ్వరులకే పరిమితమయ్యే సుభాషితం కాదు; రససిద్ధమైన రచనలేవి చేసిన వాళ్ళకైనా వర్తించే ‘మంచిమాటే’ ఇది. ఆ రకంగా ఇది ఇప్పుడు యశఃకాయులుగా మనమధ్య వున్న చక్రవర్తుల రాఘవాచారి (సి.రా.) గారికీ అంతగానూ వర్తిస్తుందన్నమాట! రాఘవాచారి గారికి ఈ సుభాషితమంటే ప్రత్యేకమైన అభిమానమేదో వున్నట్టుంది. అందుకే, ఆయన దాన్ని చాలా సంపాదకీయాల్లో వాడుక చేశారు. అది మనసులో పెట్టుకునే ఇదే సుభాషితాన్ని ఈ సమీక్ష వ్యాసానికి తలకట్టుగా వుంచాను !***

ఉన్నత శ్రేణి తెలుగు మేధావుల్లో అక్కడక్కడ కనిపించే కొన్ని విశిష్టతలు సి.రా.లో పుష్కలంగా కనిపిస్తాయి. తెలుగునాట ఏదో ఒక ప్రాంతానికే పరిమితం కాని సంస్కారం ఆయనది. పుట్టింది ఉత్తర తెలంగాణలో; బాల్యం నుంచీ కోస్తా జిల్లాలతో ఆయనకి సన్నిహిత సంబంధ బాంధవ్యాలున్నాయి. ఆ మాటకొస్తే, తెలుగు నాట అన్ని ప్రాంతాలతోనూ ఘనిష్టమైన సంసర్గ ఉందాయనకు. ఇక్కడి సామాజిక పరిణామాలపై ప్రత్యేకమైన అభిమానం, మన సాహిత్యంపట్ల ప్రగాఢమయిన అభినివేశం ఉన్నవారు సి.రా. ఇక, తెలుగు ప్రజల జీవన విధానంతో ఆయనకు వున్నంత చనుమానం అక్షరాలా అనుపమానం! తెలుగు పలుకుబడిపై సి.రా.కున్న పట్టు కేవలం అనన్యదృశ్యం! భారతీయ తత్వశాస్త్రం, సంస్కృత సాహిత్యం, సంప్రదాయ సంగీతం, తెలుగు కవిత్వం, నాటకం, సినిమా, సమకాలీన ఆలోచన ధోరణులూ, న్యాయ వైజ్ఞానిక రంగాలపైనా రాఘవాచారి గారికి వున్నంత పట్టు, ప్రవేశం వున్న వాళ్ళను లెక్కించడానికి ఒక చేతివేళ్ళే ఎక్కువేమో! ఇన్ని లక్షణాలున్న వాళ్ళు వేరే రంగాల్లో వున్నారో లేదో కానీ, పత్రికల రంగంలో మరీ ముఖ్యంగా మన తెలుగు పత్రికల రంగంలో కచ్చితంగా మరెవ్వరూ లేరు! అలాంటి అసాధారణ మేధావి దాదాపు మూడు దశాబ్దాల కాలం ఒకే పత్రికలో వేర్వేరు విషయాలపై రాసిన సంపాదకీయాలు చదువుతూ పెరిగి పెద్దయిన తరానికి చెందిన వాళ్ళం మేము. సి.రా. సంపాదకీయాల సంపుటాలు రెండు రెండు వందలకు మించిన ఖండిక`లతో కూడినవి చూసినప్పుడు నాలాంటి వాడికి సహజంగానే సంబరంగానే అని పిస్తుంది మరి. మొదటి సంపుటికి ముందు మాట రాసిన ఇప్పటి ‘విశాలాంధ్ర’ సంపాదకులు ఆర్వీ రామారావ్ చెప్పినట్లు ఈ తరం పాఠకులకు కందుకూరి, గురజాడ, గిడుగు, కొమర్రాజు, గరిమెళ్ళ, అడివి, చంద్రం, తుమ్మల, పుట్టపర్తి, బలరామమూర్తి, విద్వాన్ విశ్వం తదితరుల పేర్లు ప్రత్యేకించి గుర్తు చెయ్యవలసి వస్తోంది. ఇతర రంగాల పరిస్థితి ఇంతకన్నా గొప్పగా లేదు; అందుకేనేమో రాజకీయ రంగంలో ప్రాతః స్మరణీయులయిన కొమ్మారెడ్డి సత్యనారాయణ, కంభంపాటి (సీనియర్), పుచ్చలపల్లి, చంద్ర, నీలం, వావిలాలలాంటి వారికి తన




సంపాదకీయాల్లో అంజలి ఘటించారు సి.రా. వినోబా, మొరార్జీ, జయప్రకాశ్ నారాయణ్, వి.వి.గిరి, కృష్ణయ్యర్, మధు లిమాయే తదితరులను సందర్భోచితంగా ప్రస్తావించిన సి.రా. సంపాదకీయాలను ఈ తరం పాఠ్య ప్రణాళికలో చేర్చడం జాతికి మంచిది!

కృష్ణశాస్త్రి, శ్రీశ్రీ, ఆరుద్ర, అనిసెట్టి, దాశరథి, సి.నా.రె. తదితరులు సినిమా పాటల రచయితలుగానే ఈ తరానికి తెలుసేమో అనిపిస్తుంది! 1952 సార్వత్రిక ఎన్నికల్లో విజయవాడ లోక్‌సభకు ఎన్నికైన హరీన్ ఛట్టో, ఆయనకు ‘అక్షరాలా’ అక్కగారైన సరోజినీనాయుడు, హరీన్ మేనల్లుడు గొప్ప వైద్యుడు జయసూర్య, “బిశ్వకొబీ” రబీంద్రనాథ్ టాగూర్‌నే మెప్పించగల్గిన మహాకవికార్మిక నాయకుడు కమ్యూనిస్టు యోధ మఖ్దూమ్‌ల పేర్లను ఈతరం పాఠకులు విని

వుండకపోతే, ఆ నేరం కచ్చితంగా తెలుగు పత్రికల సంపాద కులదే! అయితే, ఈ నేరారోపణకు అపవాదంగా నిలిచిన అరుదైన సంపాదకులు సి.రాఘవాచారి. తెలుగు నాట అనేకమంది సంపాదకులకు అభిమాన సంపాదకుడుగా దశాబ్దాల తరబడి మెప్పించగలిగిన వ్యక్తి సి.రా. ఎప్పుడూ, ఏ రంగంలోనూ, ఏ ఒక్కరికీ అప్పనంగా గుర్తింపు వచ్చిపడదని మనం గ్రహించాలి!! హడావిడిగా నమోదు చేసే చరిత్రగా పత్రికా రచనను అభివర్ణించాడట మాథ్యూ ఆర్నాల్డ్. హడావిడిగా చేసినా, నిదానంగా చేసినా పత్రికల్లో రాయడమనేది చరిత్ర రచనేనన్న స్పృహ మరెవరికీ లేకపోయినా పర్వాలేదు కానీ, సంపాదక మహాశయుడికి వుండి తీరాలి! లేనట్లయితే, జాతి మెదడు పొరల మధ్యన మరుగున పడిపోయే ప్రమాదంవున్న మహనీయుల పేర్లనూ, వాళ్ళ కృషినీ తరచు పాఠకులకు గుర్తు చెయ్యాలనే బాధ్యత స్ఫురించకపోవచ్చును. అలాగే, ప్రతి సంఘటననూ స్థల కాలాల పరిధిలో పెట్టి చూడకపోతే, దాని చారిత్రక స్వరూప స్వభావాలు మనకు బోధపడకపోవచ్చుననీ అనిపించకపోవచ్చు.

రాఘవాచారి సంపాదకీయాల్లో కొట్టొచ్చినట్లు కనబడే లక్షణం ఒకటుంది. అది ఆయన శైలీవిన్యాసం! మంచివక్త కావడం చేత, తెలుగు, ఉర్దూ, సంస్కృతం, ఇంగ్లిష్ భాషల్లో లోతయిన ప్రవేశం వున్న రచయిత కావడం చేత, అన్నిటికీ మించి విద్యార్థి దశ నుంచీ ప్రధానమయిన పత్రికలన్నీ చదివే అభ్యాసమున్న ఉత్తమశ్రేణి పాఠకుడు కావడం చేత సి.రా. అలా మేలిరకం సంపాదకీయాలు సృజించగలిగారు. ఆలంకారిక ప్రయోగాలను పూర్తిగా అనూహ్యమయిన సందర్భాల్లో ప్రకటించడం ద్వారా సంపాదకీయానికి ఓ అసాధారణమైన అర్థగౌరవాన్ని ఆపాదిస్తారు సి.రా. ఒక ఉదాహరణ చూడండి ఎన్.టి.రామారావు మృతి సందర్భంగా రాసిన ఓ సంపాదకీయంలో 'కుమార సంభవం'లో కాళిదాసు ప్రయోగం ఒకటి ఉటంకించారు సి.రా. హిమాలయాల పైన నిరంతరం వుండే చల్లదనంపై కాళిదాసు చేసిన వ్యాఖ్య ఇది 'ఏకోహి దోషో గుణ సన్నిపాతోనిమజ్జతీందోః కిరణోష్వి వాంకః'. ('అనేక గుణాల మధ్యన ఒక దోషం, చంద్రుని కాంతిలో మరుగునపడే కళంకం మాదిరిగా కరిగిపోతుంది" అంటున్నాడు కాళిదాసు.) దీన్ని అర్థాంతరన్యాసం అనే అలంకారానికి మచ్చుగా సం స్కృత పఠన పాఠనాల్లో చెప్తుంటారు. దాన్ని తీసుకొచ్చి ఎన్టీఆర్ కుటుంబ జీవనం తాలూకు చివరిరోజుల విపరీత ప్రవర్తనతో పోల్చారు సి.రా. ఈ పోలికతో 'ఉపమా రాఘవా చార్యస్య' అనిపించారు! ('తెలుగుతేజం' నిద్రపోయింది రెండో సంపుటి పేజీ 238). నిజమైన విశేషం ఎక్కడుందంటే, 'విశా లాంధ్ర' పాఠకుల కోసం ఇటువంటి సంక్లిష్టమయిన ప్రయోగాలు చెయ్య డానికి రాఘవాచారి ఏ మాత్రం వెనకాడకపోవడంలో వుంది! పిల్లల ఎదుగుదల కోసం వ్యాయామశాలల్లో ఏర్పాటుచేసే నిచ్చెన మెట్లను ఎప్పటికప్పుడు రీ ఎరేంజ్ చేస్తుంటారట. అలా చెయ్యకపోతే వాళ్ళ ఎదుగుదల వేగంగా జరగదట! పత్రిక పాఠకుల సాంస్కృతిక స్థాయిని కూడా అలాగే సంపాదకుడు ఎప్పటికప్పుడు రీ ఎరేంజ్ చేస్తూండాలి. అందుకు, చిన్ననాట నేర్చుకున్న సంస్కృత సాహిత్యాన్ని వినియోగించడం సి.రా. విశిష్టతను నిరూపిస్తోంది.

సమాచార సాధనంగా పత్రికను దిద్ది తీర్చే క్రమంలో, సంద ర్భోచి తమయిన సంపాదకీయాలు రాయడమో, రాయించ డమో ఎడిటర్ బాధ్యతల్లో కీలకమయిందనే మాట వాస్తవమే. మన దేశ జనాభాలో అది కూడా పన్నెండేళ్ళకు మించిన వారి లో దాదాపు 40 శాతం మంది అచ్చయిన వార్తా పత్రికలు చూస్తున్నారని ఓ సర్వే చెప్తోంది. వారిలో సగానికి సగంమంది గ్రామీణ, చిన్నపట్టణ ప్రాంతాలకు చెందినవారేనట. ఈ వర్గా నికి చెందిన పాఠకులు దాదాపు అందరూ ప్రాంతీయభాషల్లో అచ్చయ్యే పత్రికల పాఠకులు కాగా, వాళ్లలో ఏడు శాతం మాత్రమే సంపాదకీయం చదువుతారట. అంటే మొత్తం పత్రికల పాఠకుల్లో మూడున్నర శాతం మాత్రమే చదివే సంపాదకీయాలకు ఎందుకీ ప్రాధాన్యం? ఎందుకంటే, అది ఆయా పత్రికల విధానప్రకటన లాంటిది కనక! అంతేకాదు తెలుగు తో సహా భారతీయ పత్రికారంగం పాటించేది బ్రిటిష్ పత్రికా రంగ సంప్రదాయాలనే. ఆయా ప్రజాస్వామ్య సమాజాల్లో అభిప్రాయాలను గాఢంగా ప్రభావితం చేసే సాధ నాల్లో పత్రికల సంపాదకీయాలు ముఖ్యమయినవి. మతాలూ కులాలూ ప్రాంతాల మధ్య చిచ్చు రగిలినప్పుడు, ఒక పక్షాన్ని భుజాన వేసుకోకుండా, అన్ని పక్షాలమధ్య ఏకాభిప్రాయం సాధించగలిగే సాధనాల్లో సంపాదకీయాలు ముఖ్యమయినవి. ఈ కారణం చేతనే మంచి సంపాదకీయం ఎప్పుడూ తూకం తప్పకుండా నిదానంగా సాగిపోతుంది. ఈ మూడు లక్షణాలూ రాఘవాచారి లీడర్స్‌లో కొట్టొచ్చినట్లు కనిపిస్తాయి.

ఇక్కడ ఓ చిన్న వివరణ అవసరం జర్నలిజానికి సంబంధించిన మరో వివరం కూడా ఇక్కడే చెప్పుకోకపోతే, విశాలాంధ్రకు రాఘవాచారి చేసిన సేవను తగ్గించి చెప్పినట్లవుతుంది. సంపాద కీయాలు అనే సంపాదక వ్యాఖ్యలు, ఎడిటరే రాయాలన్న నిబంధ న ఎక్కడా లేదు. పత్రిక సిబ్బందిలో మరెవరూ సంపాదకీయం రాయకూడదనే నిషేధమూ లేదు! పత్రిక ఏ ఆలోచన ధోరణికి కట్టుబడి వున్నదో దానికి ప్రాతినిధ్యం వహించగల అనుభవజ్ఞు డూ, ప్రతిభావంతుడూ ఈ బాధ్యత తీసుకోవడం తరచు జరు గుతూ వుంటుంది. ఈ పాత్రకు రాఘవాచారి చేసినంత న్యాయం ఇతరులెవరూ చెయ్యలేదంటే అతిశయోక్తి కాదు. ఇందుకు దారితీసిన కొన్ని వ్యక్తిగత కారణాలు కూడా వున్నాయి. రాఘవా చారి ప్రత్యేకంగా అధ్యయనం చేసిన న్యాయశాస్త్ర విభాగం జ్యురిస్‌ప్రుడెన్స్. ప్రాచీన భారతీయులు దీన్ని 'ధర్మశాస్త్రం'గా భావించారు. న్యాయశాస్త్ర తాత్వికతను విశ్లేషించి అధ్యయనం చేసే సైద్ధాంతిక విభాగమే జ్యురిస్‌ప్రుడెన్స్. ఈ విభాగంలో రాణించడానికి న్యాయశాస్త్రం ఒక్కదానిలోనే ప్రావీణ్యముంటే సరిపోదు తత్వ శాస్త్రంలోనూ తగినంత అభినివేశం వుండితీరాలి! క్రీస్తుకు పూర్వం 1500 ఏళ్ళనాటి రుగ్వేద ఆర్యులు, క్రీ.పూ.800 ఏళ్ళ నాటి బోధాయనుడు, అతనికి 300ఏళ్ళ తర్వాతి కాలంవాడయిన సోక్రటిస్, తదితరులు ధర్మశాస్త్రం గురించి

చెప్పినవాళ్ళే. అటువంటి తత్వవేత్తల, ధార్మికుల ప్రబోధాలను అధ్యయనం చేసే వారికి ఆలోచనలోనూ, భావప్రకటనలోనూ సమతూకం ఏర్పడుతుంది. దానికి మార్క్సిజం లాంటి ఆధునిక, సమకాలీన చైతన్యమూ తోడయితే రాఘవాచారి లాంటి సంపాదకీయ రచయిత రూపుదిద్దుకుంటాడు.

ఇంతకు ముందు, రాఘవాచారి సంపాదకీయాల సంపుటులు చూసినప్పుడు నాకు కలిగిన సంబరం గురించి చెప్పాను. అయితే, సమీక్షకుల కళ్ళకు ఏ సంబరాలూ, సంభ్రమాల పొరలు కమ్మేయ కూడదంటారు పెద్దలు. అందుకే, ఈ ఖండికల్లో నాకు బొత్తిగా కిట్టని అంశం ఒక్కదాన్ని గురించి మాత్రమే చెప్తున్నాను. రాఘవాచారి సంపాదకీయాల రెండో సంపుటి "నివాళి", 262వ పేజీలో "మంచి కమ్యూనిస్టు'కో మచ్చు" అనే సంపాదకీయం గురించి ప్రస్తావించకుండా వుండలేకపోతున్నాను. ఇది, దాదాపు దశాబ్దంనర కాలం చైనా అధినేతగా కొనసాగిన డెంగ్ షియావో పింగ్‌కు సమర్పించిన శ్రద్ధాంజలి. 1949 నుంచి 78 వరకూ చైనాలో కొనసాగిన నకిలీ సోషలిజం స్థానంలో మార్కెట్ ఆర్థిక వ్యవస్థను రాజ్యాంగబద్ధంగా ప్రవేశపెట్టి, చైనాలోనూ బయటా కూడా 'ఆధునిక చైనా నిర్మాత'గా ఆరతులందుకున్నవాడు డెంగ్. మావో అధినాయకత్వంలోని చైనా కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగానూ, ఆ దేశానికి ఉపప్రధాని గానూ పనిచేసిన డెంగ్‌కు 'సాంస్కృతిక విప్లవం' చీకటి రోజుల్లో పదేళ్ళపాటు గ్రహణం పట్టించారు. కానీ, మావో మరణానంతరం డెంగ్ నాయకత్వానికి ఎగబాకి ప్రతీకారం తీర్చుకున్నారు. పాతకాలపు రాచరికాల్లో జరిగాయని చెప్పే కుట్రలూ కుహకాలను తలదన్నే రీతిలో ఈ పరిణామాలు చోటు చేసుకున్నాయి. 'డెంగ్ అభివృద్ధి పథం' వికృత రూపం వర్తమాన చరిత్ర తెలిసిన వారందరికీ తెలిసిందే! ఏ దేశంలోనూ లేని రీతిలో చైనాలో మాత్రమే లక్షలాది స్వెట్ షాపుల్లో కార్మిక స్త్రీలతో రేబవళ్ళు పనిచేయిస్తున్నారని మీడియావర్గాలు గొంతు చించుకుని చెప్తున్నాయి. డెంగ్ అభివృద్ధి పథంలో భాగంగా జరిగిందే ఈ పరిణామం! ఇటువంటి అభివృద్ధిపథాన్ని కనిపెట్టి, ప్రపంచంలోని అత్యధిక జనసంఖ్య కలిగిన దేశం నెత్తిన రుద్దిన వాడు "మంచి కమ్యూనిస్టు'కో మచ్చు" ఎలా కాగలడన్నదే అంతు పట్టని విషయం. పైగా సోషలిస్టు వ్యవస్థ పునాదులు చైనాలో బలంగా వున్నాయనీ, పెట్టుబడిదారీ దోపిడికి అక్కడ తలుపులు బార్లా తెరవలేదనీ వ్యాఖ్యానించడం మరీ విడ్డూరంగా వుంది. అసలు 'డెంగ్ అభివృద్ధి పథం' లక్ష్యమే ఈ రెండు విషయాలకూ రాజ్యాంగ బద్ధత కల్పించడం! 1997 – 1999 సంవత్సరాల్లో జన చైనా రిపబ్లిక్కులో భాగమైన హాంకాంగ్, మకావు ప్రాంతాల్లో "ప్రత్యేక పాలన వ్యవస్థలు" ప్రవేశపెట్టింది ఈ మంచి కమ్యూనిస్టే! దీనికి డెంగ్ పెట్టిన ముద్దుపేరు "ఒక దేశం రెండు వ్యవస్థలు!" అయితే, ఇటువంటివి ఈ సంపుటులలో ఒకటిరెండు కన్నా కనిపించకపోవడం చూస్తే, మళ్లీ కాళిదాసు చెప్పిన అర్థాంతర న్యాసాన్ని గుర్తు చేసుకోవాలనిపిస్తుంది. సంపాదకీయ రచనను ఒక కళారూపంగా సాధన చేసిన చక్రవర్తుల రాఘవాచారి గారికి 'విశాలాంధ్ర' పాఠకకోటి తరపున నమస్సులు!! ❑

**– మందలపర్తి కిషోర్**

# తెలుగు జాతి సమరగీతి వీర తెలంగాణ

**(39వ పేజీ తరువాయి)**

ప్రాధాన్యతకు మసిపూసే ప్రయత్నం చేశారు. తెలంగాణ పోరాటంలో ప్రారంభం నుంచి చివరి వరకూ తెలుగు ప్రజలందరి పోరాటంగా విశాలాంధ్ర కమ్యూనిస్టు కమిటీ నాయకత్వంలో జరిగింది. తెలంగాణ ప్రజా పోరాటాన్ని రగిలించడంలో రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి వంటి వారు ముఖ్యులు. సుందరయ్య, బసవపున్నయ్య, రాజేశ్వరరావు, దేవులపల్లి వెంకటేశ్వరరావు, బి.ఎన్.రెడ్డిలతో కూడిన కమిటీ దాన్ని నడిపించింది. వందల సంఖ్యలో కమ్యూనిస్టులు భౌగోళిక సరిహద్దుల ప్రసక్తి లేకుండా ఆ పోరాటంలో కీలక పాత్ర వహించారు. ప్రాణాలర్పించారు. నాలుగు వేల మంది తెలంగాణ యోధులతోపాటు కోస్తా ప్రాంతంలోనూ మూడు వందల మంది పోలీసు తూటాలకు బలైనారు. దానికి ఆయుధాలు, నిధులనే కాక కార్యకర్తలను అందించడంలోనూ, ఆశ్రయం ఇవ్వడంలోనూ, నిర్బంధ తరుణంలో తోడుగా పోరాడటంలోనూ కోస్తా ప్రాంత ప్రజానీకం ప్రశంసనీయమైన పాత్ర నిర్వహించారు. ప్రజాశక్తి నగర్ ఈ కృషికి కేంద్ర బిందువు. ఆ కారణంతోనే కాంగ్రెస్ పాలకులు 1948 తర్వాత దాన్ని ధ్వంసం చేశారు. పీడిత ప్రజా విముక్తి అనే విశాల లక్ష్యంతో జరిగిన విప్లవ పోరాటాన్ని తదుపరి రాజకీయాల సంకుచిత సులోచనాలతో వక్రీకరించడం ఎవరికీ మంచిది కాదు. కొందరు మరీ విపరీత ధోరణిలో నిజాం కూలిపోవడం వల్ల నష్టం జరిగినట్టు కూడా రాశారు. అవన్నీ ఎలాగూ నిలవలేదు.

## చారిత్రిక అనివార్యత

కేసీఆర్ ప్రభుత్వం కూడా ఈ పోరాట వారసత్వాన్ని తలుచుకోవడానికి ఎనిమిదేళ్లు పట్టింది. ఆయన చాలాకాలంగా నిజాం ఘనతను కీర్తిస్తున్నారు. ఉత్సవాలు జరపడానికి వెనుకాడారు. రజాకార్ల నాయకుడైన కాశిం రజ్వీ స్థాపించిన మజ్లిస్ పార్టీ నేత ఒవైసీ లేఖ రాశాక జాతీయ సమైక్యతా దినోత్సవంగా నిర్వహిన్నారు. బిజెపి మతకోణంలో విమోచన అంటుంటే కాంగ్రెస్ స్వతంత్ర దినోత్సవం అంటున్నది. అంటే వీరెవరికీ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని ఆ పేరుతోనే జరపడం ఇష్టం లేదు. శ్రీశ్రీ అన్నట్టు తారీఖులు, దస్తావేజులకన్నా చరిత్ర సారం కీలకం. ఆ విధంగా చూస్తే తెలంగాణ సాయుధ పోరాటం 75 ఏళ్ల తర్వాత తన విశిష్టతను చాటుకుంటున్నది. కమ్యూనిస్టులు రాజకీయ మార్పుల రీత్యా సెప్టెంబరు 17నే జరిపి సైద్ధాంతిక చారిత్రిక ప్రాధా న్యత చెబుతూ వస్తున్నారు. బీజేపీ రంగ ప్రవేశం తర్వాత వక్రీకరణ లను నిలవరించడం మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. మారి న ఈ పరిస్థితుల్లో జాతీయ సమైక్యతా దినోత్సవంగానైనా దీన్ని జరపడం అందువల్లనే. తెలంగాణ సాయుధ తిరుగుబాటు జరక్క పోతే రాష్ట్రం, దేశం కూడా ఎలా వుండేది అన్నది ఊహించుకో వలసిందే. ఇప్పుడు రెండు రాష్ట్రాలైనా ఆ చారిత్రక సత్యాలు మారవు. ఆ పోరాట వారసత్వాన్ని సరైన రీతిలో ముందుకు తీసుకు పోవడం వల్ల కలిగే సత్ఫలితాలూ అంత గొప్పగానే వుంటాయి. లాల్ సలామ్ వీర తెలంగాణ. ❑

# తిరోగమన శక్తులకు నాటికీ, నేటికీ సింహస్వప్నం - వీరేశలింగం

మత ప్రమేయం లేని లౌకిక ప్రజాస్వామ్య రాజ్యాంగం అంటూనే మతంతో రాజ్యాధికారం 'బ్రహ్మముడి' వేసుకోవడమూ, తన ప్రచార సాధనాలన్నింటినీ అందుకు తాకట్టు పెట్టడమూ, మతాధిపతులకు, పీఠాధిపతులకు అధికార లాంఛనాలతో స్వాగత సత్కారాలు, పాలకుల ఆయురారోగ్యాలకు పూజలు, క్రతువులూ అధికారికంగా జరిపించటమూ, వాస్తవిక జీవిత సమస్యల నుండి ప్రజల దృష్టిని మళ్ళించడానికి రకరకాల పలాయనవాద, ఇంద్రజాల, మహేంద్రజాల, మహాత్మ్యాలను, బాబాలను, అమ్మలను ఆకాశానికెత్తడమూ, ఇవన్నీ ఈ తిరోగమన శక్తుల విజృంభణలో భాగాలే.

జాతీయ స్వాతంత్రోద్యమమూ, జాతీయ పునరుజ్జీవనోద్యమమూ ఒకదానినొకటి ప్రభావితం చేసుకుంటూ మన దేశ ప్రజలను దాదాపు ఒక శతాబ్ది కాలంగా రాజకీయ, సాంఘిక, సాంస్కృతిక రంగాలలో పురోగమింపజేశాయి. స్వాతంత్ర్యానంతరం జాతీయోద్యమ లక్ష్యాలు పరిపూర్తి కానట్లే. జాతీయ పునరు జ్జీవనోద్యమ లక్ష్యాలు నెరవేరకుండా అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఫ్యూడల్ యుగంనాటి అవశేషాలను, కులమత తత్వాలను రకరకాల మూఢ నమ్మకాలను, అనేక కొత్త రూపాలలో సాంఘిక దురాచారాలను, దుర్నీతిని పెంచి పోషించడానికి పెట్టుబడిదారీ పాలకవర్గాలు, వారి వంది మాగధులూ చేస్తున్న ప్రత్యక్ష, పరోక్ష ప్రయత్నాలు స్పష్టంగా నేడు కానవస్తాయి. మత ప్రమేయం లేని లౌకిక ప్రజాస్వామ్య రాజ్యాంగం అంటూనే మతంతో రాజ్యాధికారం 'బ్రహ్మముడి' వేసుకోవడమూ, తన ప్రచార సాధనాలన్నింటినీ అందుకు తాకట్టు పెట్టడమూ, మతాధిపతులకు, పీఠాధిపతులకు అధికార లాంఛనాలతో స్వాగత సత్కారాలు, పాలకుల ఆయురారోగ్యాలకు పూజలు, క్రతువులూ అధికారికంగా జరిపించటమూ, వాస్తవిక జీవిత సమస్యల నుండి ప్రజల దృష్టిని మళ్ళించడానికి రకరకాల పలాయనవాద, ఇంద్రజాల, మహేంద్రజాల, మహాత్మ్యాలను, బాబాలను, అమ్మలను ఆకాశానికెత్తడమూ, ఇవన్నీ ఈ తిరోగమన శక్తుల విజృంభణలో భాగాలే. అందుకే నేడు భారత జాతీయ పునరుజ్జీవనోద్యమ వైతాళికులు





రాజారామమోహన్‌రాయ్, ఈశ్వరచంద్ర విద్యాసాగర్, కందుకూరి వీరేశలింగం మున్నగు మహనీయుల కృషీ నవయుగాంధ్ర నిర్మాతలైన గురజాడ, గిడుగు, కొమర్రాజు, తదితరులు సాగించిన ప్రగతిశీల ఉద్యమాల ప్రసక్తీ, నేడు అంతగా వినపడవు. కాదు-వినపడనివ్వరు ! వారిని, వారి ఉద్యమాలను వారి చరిత్రను, వారి విప్లవాత్మక రచనలను ఈతరం వారికి అందించే ప్రయత్నంగాని, వారి ఉద్యమ లక్ష్యాలను కొనసాగించే తలపు గాని కనబడదు. వారు నిర్మించిన సంస్థలూ, వారి స్మృతి చిహ్నాలూ శిథిలమైపోతున్నా ఎవరికీ పట్టవు. అయినా, శ్రీ కృష్ణశాస్త్రిగారు చెప్పినట్లు వీరేశలింగంది రాబోయేకాలం, వారి ప్రతికక్షులది పాపం! పోయేకాలం! ప్రగతిశీల భావాలు కలవారందరినీ, కందుకూరి వీరేశలింగం, ఆయన మహత్తర సాంఘిక సాంస్కృతిక విప్లవోద్యమమూ నాటికీ, నేటికీ ఉత్తేజం కల్గించుతూనే ఉంటుంది. తిరోగమన శక్తులకు నాటికీ నేటికీ వీరేశలింగం సింహస్వప్నమే. ❑

**(సి.రాఘవాచారి - సంపాదకీయాలు - మొదటి సంపుటి నుండి) 1978, మే 27**


**RNI Title Code : APTEL 16175 - DAARI DEEPAM (Telugu Monthly)**


Vol : 1 - Issue No : 1 October 2022




## కొత్త పుస్తకాలు స్వీకారం




if undeliverd please return to:

**B.Ramesh Chandra Babu**

Kranti Nursing Home, Near Nannaya Statue, Main Road, Tanuku, West Godavari, Ap 534 211 - Phone 08819 222265 93971 14495

Printed Matter Book Post

To :

**DAARI DEEPAM.. Printer, Publisher and Owner Bhupatiraju Ramesh Chandrababu, Published from Tanuku - 534 211, AP. Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, 520 004. Editor : DVVS Varma.**